సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 315
సోమవారం 5-2-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'


గెలుపు తలుపు తట్టేదెవరు!
రసపట్టులో రెండో టెస్టు. ఇంగ్లండ్ లక్ష్యం 399. ప్రస్తుతం 67/1. -12లో



లోతుగా తెలుసుకున్నాకే!
యులిప్‌లలో చార్జీలు ఎక్కువే.. ఈక్విటీలతో పోలిస్తే ప్రతిఫలంలో వెనుకే.. -13లో


ఏ అవగాహనా లేదు!
దేశాన్ని దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ నేతలకు పూజనీయ స్థలాల గొప్పదనంపై అవగాహన లేదని ప్రధాని దుయ్యబట్టారు.
వివరాలు 6లో ▸


ఎంబసీలో ఐఎస్ఐ ఏజెంట్
మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో పనిచేస్తూ ఐఎస్ఐకి సమాచారం చేరవేస్తున్న ఓ అధికారిని యూపీ ఏటీఎస్ అరెస్ట్ చేసింది.
వివరాలు 6లో ▸


గిరిజనుల తరఫున పోరాటం
గిరిజనులకు జల్–జంగిల్–జమీన్‌పై హక్కులు కల్పించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ పునరుద్ఘాటించారు.
వివరాలు 6లో ▸


అంతరిక్ష వీధిలో ట్రాఫిక్ జాం
అంతరిక్ష వీధి ఉపగ్రహాలతో కిక్కిరిసిపోతోంది. దాంతోపాటే ఉపగ్రహ సంబంధిత వ్యర్థాల పరిమాణమూ నానాటికీ పెరిగిపోతోంది.
వివరాలు 6లో ▸

జయజయహే తెలంగాణ

రాష్ట్ర గేయంగా ప్రజాకవి అందెశ్రీ రచన.. కేబినెట్ నిర్ణయం

ఉద్యమస్ఫూర్తి ఉట్టిపడేలా తెలంగాణ తల్లి రూపం, గేయం, చిహ్నం

వాహనాల నంబర్ ప్లేట్లపై ఇక 'టీజీ'

8 నుంచి అసెంబ్లీ.. 10న బడ్జెట్


పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన కేతావత్ సోంలాల్‌కు రూ. 25 లక్షల చెక్కును చిరంజీవి, వెంకయ్య నాయుడుతో కలసి అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి

- రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్
- కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఏర్పాటుకు ఆమోదం
- 65 ప్రభుత్వ ఐటీఐలను 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు'గా అప్‌గ్రేడేషన్ కొత్త హైకోర్టు నిర్మాణానికి వంద ఎకరాల భూమి కేటాయింపు సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు త్వరలో క్షమాభిక్ష
- అతి త్వరలో మెగా డీఎస్సీ.. వ్యవసాయాధికారి ఉద్యోగాల భర్తీ కూడా
- గ్రూప్–1, ఇతర కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీల గుర్తింపుపై కసరత్తు
- వీఆర్వోల అంశంపై త్వరలో కేబినెట్ సబ్ కమిటీ
- వివరాలను మీడియాకు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చి, ఉత్తేజం రగిల్చిన 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గేయంగా గుర్తించాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీనితోపాటు తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం భావితరాలకు గుర్తుండేలా కీలక మార్పులు చేపట్టాలని తీర్మానించింది. తెలంగాణ ఆత్మ కనిపించేలా రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, సీఎస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 25కుపైగా అంశాలపై చర్చించారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లలో రాష్ట్ర కోడ్‌గా 'టీఎస్'కు బదులు మిగతా 2వ పేజీలో ▶

'పద్మశ్రీ'లకు రూ. 25 వేల పింఛన్

25 లక్షల నగదు బహుమతి కూడా: రేవంత్ -14లో

సభలో తేల్చుకుందాం!

కృష్ణా ప్రాజెక్టులపై కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- ఎంతసేపైనా మాట్లాడండి.. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయం
- కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే నిర్ణయం తీసుకున్నది కేసీఆర్ హయాంలోనే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ఎక్కువ అన్యాయం జరిగింది
- అన్ని ఆధారాలున్నాయి.. వాటిని ప్రజల ముందు పెడతాం
- నీటిపారుదల ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడి
- గత సర్కారు కృష్ణా ప్రాజెక్టులను ఎడారి చేసింది: ఉత్తమ్

- వివరాలు 2లో

చర్చ పెట్టు.. సమాధానమిస్తాం

ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సవాల్‌కు హరీశ్ ప్రతిసవాల్

- పోతిరెడ్డిపాడుపై అసెంబ్లీలో గట్టిగా పోరాడింది మేమే..
- కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా మేం ప్రాజెక్టులు అప్పగించలేదు
- మేం కాంగ్రెస్‌లా తప్పించుకోబోం.. ధైర్యంగా చర్చకు వస్తాం
- ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేలా విభజన చట్టంలో పెట్టింది కాంగ్రెస్ కాదా?



వనస్థలిపురం (హైదరాబాద్), సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర విషయం లేదు గనకనే ప్రాజెక్టుల విషయంలో సీఎం కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు ప్రతిసవాల్ చేశారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చపెట్టాలని.. దిమ్మతిరిగే సమాధానం చెప్తామని పేర్కొన్నారు. గతంలో తాము అసెంబ్లీలో చర్చ పెడితే ప్రిపేర్ కాలేదంటూ కాంగ్రెస్ తప్పించుకుందని.. ఇప్పుడు తాము అలా చేయకుండా ధైర్యంగా చర్చకు వస్తామని చెప్పారు. గత పదేళ్లలో కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా తాము రాష్ట్ర ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించలేదని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హస్తినాపురంలో, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడారు. సీఎం రేవంత్‌కు ఆలోచన లేక, అర్థంకాక ఆగమాగమై మాట్లాడుతున్నారని, రాష్ట్రానికి నీటి సమస్యను తీసుకువస్తున్నారని ఆరోపించారు.

విభజన బిల్లులో పెట్టిందెవరు?: ''రాష్ట్ర విభజన సమయంలో.. ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పాలని బిల్లు పెట్టి పాస్ చేసింది కాంగ్రెస్ కాదా? ఆ బిల్లును తయారుచేసింది మీ జైపాల్‌రెడ్డి, మిగతా 2వ పేజీలో ▶

హుటాహుటిన బీఆర్ఎస్ అత్యున్నత స్థాయి సమావేశం

- ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండించిన భేటీ.. నేడు ప్రెస్‌మీట్

3లో

నల్లగొండలో సభ

- కేఆర్ఎంబీ వాస్తవాల వివరణే లక్ష్యం... త్వరలో భారీ సభకు ఏర్పాట్లు

న్యూస్‌రీల్

ఆశావహుల వడపోతకు నాయకత్వం సిద్ధం


లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకత్వం సిద్ధమవుతోంది. ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ముగియడంతో 6న టీపీసీసీ ఎన్నికల కమిటీ వాటిని పరిశీలించనుంది.
- వివరాలు 2లో▶

అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం 12న మహాధర్నా

BHARAT JAGRUTHI

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు భారత జాగృతి ఆందోళనలను ఉధృతం చేయనుంది. ఈ నెల 12న యునైటెడ్ పూలే ఫ్రంట్‌తో కలసి ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనుంది.
- వివరాలు 2లో▶

నేటి నుంచి 'గావ్ చలో అభియాన్': యెండల


రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి 8వ తేదీ వరకు 'గావ్ చలో అభియాన్' చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. 35 వేల పోలింగ్ బూత్‌లన్నింటికీ శ్రేణులు తరలివెళ్లనున్నట్లు చెప్పారు.
- వివరాలు 2లో▶

వారిది ఆత్మహత్య కాదు.. హత్యే


ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు టెన్త్ విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం భువనగిరి పట్టణం ఆందోళనలతో అట్టుడికింది. బాలికలది ఆత్మహత్య కాదని హత్యేనని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.
- వివరాలు 5లో▶

వీళ్లు ఔట్.. వాళ్లు ఇన్

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ రాజకీయం అయిపోగానే తెలంగాణలో బిహార్ రాజకీయం ప్రారంభమయింది. 3 రోజుల క్రితం రాంచీ నుంచి వచ్చిన జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 38 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోగానే, బిహార్‌కు చెందిన 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకున్నారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్‌ను ఈడీ అరెస్టు చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో చంపయీ సొరేన్ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. చంపయీ సొరేన్ బలనిరూపణకు సోమవారం వరకు గడువు ఉండడంతో జేఎంఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను హైదరాబాద్ శివార్లలోని శామీర్‌పేటలో ఉన్న ఓ రిసార్టుకు తీసుకువచ్చారు. శుక్ర, శని, మిగతా 2వ పేజీలో ▶

రాంచీ వెళ్లిపోయిన జార్ఖండ్ ఎమ్మెల్యేలు

- హైదరాబాద్‌కు చేరుకున్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..
- ఆ రాష్ట్రంలో బలపరీక్ష రోజు వరకు ఇక్కడే 20 మంది మకాం


ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

పాత కాలువ గేట్లు ఎత్తుతున్న రైతులు


పాలేరు గేట్లెత్తిన రైతులు

అడ్డుకున్న అధికారులు.. కాలువ వద్ద ఉద్రిక్తత

కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. రిజర్వాయర్‌కు సాగర్ నుంచి నీరు వస్తుండగా ఆదివారానికి 15 అడుగులకు చేరింది. ఈ క్రమంలో పాలేరు పాత కాలువ పరిధిలోని పలు గ్రామాల రైతులు రిజర్వాయర్ వద్దకు చేరుకుని గేట్లు ఎత్తి కాలువకు నీటిని వదిలారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు గేట్లను దించే ప్రయత్నం చేయగా రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రైతులు ఖమ్మం – సూర్యాపేట రహదారిపై రాస్తారోకో చేశారు. కాలువ పరిధిలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ జూకూరి గోపాలరావుతో పాటు పలువురు రైతు సంఘం నాయకులు రైతులకు మద్దతు ప్రకటించారు. కాగా, ఆర్డీఓ గణేశ్, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏసీపీ బస్వారెడ్డి పాలేరు చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రైతులు నీరు విడుదల చేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి పరిస్థితిని వివరించి ఒకటి, రెండు రోజుల్లో నీరు విడుదల చేస్తామని, అప్పటివరకు సంయమనం పాటించాలని కోరారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

తప్పు.. మీదంటే మీదే

- విద్యాశాఖలో ఇద్దరు అధికారుల మధ్య వాగ్వాదం !
- డిప్యుటేషన్లపై ఆరా తీసిన సీఎంఓ
- సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం .. డిప్యుటేషన్లపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

- వివరాలు 10లో

కాంగ్రెస్ మాటల ప్రభుత్వం: కేటీఆర్


కాంగ్రెస్ మాటల ప్రభుత్వమని.. ఆ పార్టీ చేసిన 420 హామీలకు ప్రజలు మోసపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజయోత్సవ సభలో కేటీఆర్ మాట్లాడారు.
- వివరాలు 3లో

పల్లె కడుపున రాచపుండు!

- కామారెడ్డి జిల్లా మద్దికుంటను వెన్నాడుతున్న కేన్సర్ వ్యాధి
- గ్రామంలో ఇరవై మందికిపైగా బాధితులు
- మూడేళ్లలో 12 మంది మృత్యువాత
- చికిత్స పొందుతున్న మరికొందరు.. ఖర్చు భరించలేక తిప్పలు
- సర్వైకల్, బ్రెస్ట్, ఊపిరితిత్తుల కేన్సర్లతో అవస్థలు
- ఎక్కడ ఇబ్బంది వస్తుందోనన్న ఆందోళనతో బయటికి చెప్పని పలువురు బాధితులు
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్న వైద్యాధికారులు

- వివరాలు 5లో▶



టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి బదిలీ

- అనితారామచంద్రన్ స్థానంలో నవీన్ నికోలస్‌కు బాధ్యతలు
- పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ


అనితా రామచంద్రన్


నవీన్ నికోలస్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమెస్థానంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్‌ను నియమించారు. వీరితోపాటు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మత్స్యశాఖ డైరెక్టర్‌గా ఉన్న లచ్చిరాంభూక్యను ప్రభుత్వం బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ కేంద్ర సర్వీసులకు తిప్పి పంపించింది. వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా ఉన్న బి.గోపికి ఫిషరీస్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

➤ హైదరాబాద్ జిల్లా చీఫ్ రేషనింగ్ అధికారి బి.బాలమాయాదేవి బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా,
➤ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావును రాష్ట్ర సమాచార, మిగతా 2వ పేజీలో ▶

వరికి రూ.500 బోనస్

వచ్చే వానాకాలం సీజన్ నుంచే అమలు: వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌లో పండించే వరికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. జూన్‌లో నిర్వహించే 'గ్లోబల్ రైస్ సమ్మిట్' బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమ్మిట్ నిర్వాహకులు డాక్టర్ జానయ్య, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, కమిషనర్ గోపి, విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతులు వరి తక్కువ వేయాలని, అందుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు సాగు చేసి, పంటల సాగులో సమతుల్యత పాటించాలన్నారు. వరితోపాటు అన్ని పంటలకు కూడా కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతుధర ఇవ్వాలని కోరారు. వివిధ దేశాలకు వరి ఎగుమతులపై కేంద్రం విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆంక్షలు రాష్ట్రానికి ప్రతిబంధకంగా ఉన్నాయని, రైస్ పాలసీపై కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కేరళ ప్రజలు దొడ్డు బియ్యం, కర్ణాటక ప్రజలు సన్నబియ్యం, మరికొన్ని ఇతర రాష్ట్రాల్లో జనం చిట్టి ముత్యాలు వంటి రకాల బియ్యం వాడుతారని, ఆ ప్రకారం ఆయా రాష్ట్రాలకు తెలంగాణ నుంచి రైస్ అమ్ముకునేలా అవకాశం కల్పించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఎంత అవసరమైతే అంతమేరకు వరి సాగు చేయాలని, ఎగుమతులు పెంచడం వల్ల రాష్ట్రంలో అదనపు వరిని విక్రయించడానికి వీలుకలుగుతుందని పేర్కొన్నారు. ఆ మేరకు కేంద్రం ఆలోచించి తెలంగాణ రైతులకు మేలు చేయాలన్నారు.



- వరి ఎగుమతులపై కేంద్రం ఆంక్షలు ఎత్తివేయాలని విన్నపం
- పంటలకు బీమా సౌకర్యం ఉండాలి.. ఆమేరకు నిర్ణయం తీసుకుంటాం

రేషన్‌రైస్ ఎవరూ వాడడం లేదు

ఇప్పటికే పేదలకు ఇస్తున్న రేషన్‌రైస్ ఎవరూ వాడుకోవడం లేదని తుమ్మల అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భారత్‌రైస్ పేరుతో కిలోకు రూ. 29కే ఇస్తామనడం హాస్యాస్పదమన్నారు. అలా ఇవ్వడం వల్ల అవకతవకలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆ ధరకు సన్నాలు ఇస్తే బాగుంటుందన్నారు. దేశంలో వరి పండించడంలో తెలంగాణ టాప్‌లో ఉందని, రాష్ట్రంలో 60 శాతం రైతులు వరిపైనే ఆధారపడ్డారని తెలిపారు. జూన్‌లో నిర్వహించే గ్లోబల్ రైస్ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు వస్తారన్నారు. పంటలకు బీమా సౌకర్యం ఉండాలని, ఆ మేరకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ సందర్భంగా గ్లోబల్ రైస్ సమ్మిట్‌పై అంతర్జాతీయ ఆర్గనైజర్లు కూడా ఆన్‌లైన్‌లో మాట్లాడారు.

ఇదండీ సంగతి



కామ్రేడ్లను అలానే వెనకేసుకొస్తే మిమ్మల్ని కూడా క్షమించరట!

క్లుప్తంగా...

కొత్త నాటకానికి తెరలేపిన కాంగ్రెస్

బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



పాలమూరు: అధికార కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమల్లో కొత్త నాటకం మొదలుపెట్టిందని, రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లు గెలిపిస్తేనే వాటిని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ తీరు చూస్తుంటే.. కర్ణాటక మాదిరిగా తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి సిద్ధమైనట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మును ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కలిసి పనిచేశాయని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న 17 సీట్లు గెలవడం వల్ల ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కాలేరని, నమ్మించి మోసం చేయడంలో కాంగ్రెస్ దిట్ట అని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోని 17 స్థానాల్లో బీజేపీ పదికిపైగా ఎంపీ సీట్లు గెలుస్తుందని జోస్యం చెప్పారు. సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం 12న మహాధర్నా

భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు కోసం భారత జాగృతి ఆందోళనలను ఉధృతం చేయనుంది. ఈనెల 12న యునైటెడ్ పూలే ఫ్రంట్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనుంది. ఈ ధర్నాకు హాజరు కావాలని అన్ని రాజకీయ పార్టీలతో పాటు బీసీ సంఘాలు, మేధావులు, ప్రొఫెసర్లు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ఈనెల 6న ఉదయం వరంగల్, మధ్యాహ్నం కరీంనగర్, 7న ఉదయం వికారాబాద్, మధ్యాహ్నం మహబూబ్‌నగర్, 8న ఉదయం ఆదిలాబాద్, మధ్యాహ్నం నిజామాబాద్, 9న ఉదయం ఖమ్మం, మధ్యాహ్నం నల్లగొండ, 10న సంగారెడ్డిలో ఈ రౌండ్ టేబుల్ సమావేశాలు జరగనున్నాయి.

రాహుల్ జోడో యాత్ర.. ఇండియా కూటమి చోడో యాత్ర: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తుంటే.. ఇండియా కూటమి పార్టీలు కాంగ్రెస్ చోడో అంటున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఎద్దేవాచేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమికి ఒక ఎజెండా లేదని, నీతి లేదని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభివృద్ధికి, అబద్ధాలకు మధ్య పోరు జరుగుతుందని, మోదీ హయాంలో అనేక కార్యక్రమాలు విజయవంతమయ్యాయని లక్ష్మణ్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మోదీకి మంచి పేరు వచ్చిందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడే కేంద్ర బడ్జెట్‌ను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు రాజకీయ భవిష్యత్ లేదని, కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని లక్ష్మణ్ ఆరోపించారు.

నేటి నుంచి 'గావ్ చలో అభియాన్': యెండల



సాక్షి,హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి నుంచి 8వ తేదీ వరకు 'గావ్ చలో అభియాన్'కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలోని 12,769 గ్రామ పంచాయతీల పరిధిలోని 35 వేల పోలింగ్ బూత్‌లన్నింటికీ పార్టీ శ్రేణులు తరలివెళ్లనున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, అగ్రశ్రేణి నాయకత్వంతో పాటు కార్యకర్తలందరూ గ్రామాల్లో పర్యటిస్తారని యెండల తెలిపారు.

సభలో తేల్చుకుందాం!

కృష్ణా ప్రాజెక్టులపై కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- ఎంతసేపు కావాలన్నా మాట్లాడండి.. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయం
- సాకులతో సమావేశాలకు గైర్హాజరు కావొద్దు.. కావాలంటే తలుపులేసి మాట్లాడుకుందాం
- కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే నిర్ణయం తీసుకున్నది కేసీఆర్ హయాంలోనే..
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్‌ఎస్ పాలనలోనే ఎక్కువ అన్యాయం



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: అరవై ఏళ్ల ఉమ్మడి పాలనలో కంటే కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలోనే తెలంగాణకు ఎక్కువ నష్టం జరిగిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ధనదాహానికి తెలంగాణ బలైందని, రాష్ట్రంలో కృష్ణాబేసిన్ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు ఎడారిగా మారాయని పేర్కొన్నారు. రాష్ట్ర సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేసిన కేసీఆర్.. ఇప్పుడు ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగిస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో సాగునీటి ప్రాజెక్టులు, నిధుల వినియోగం, నీటి పారుదల అంశాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. దమ్ముంటే ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై చర్చలో పాల్గొనాలని సవాల్ విసిరారు. ఆదివారం సచివాలయంలో మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖలతో కలసి రేవంత్ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కవితారావు అంతా కలసి కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాస్తవ ప్రచారం చేస్తున్నారు. అసలు తెలంగాణలోని ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు పునాదిపడినది కేసీఆర్ ఎంపీగా ఉన్నప్పుడే. ఏపీ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోనే తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేలా బిల్లులో పొందుపర్చారు. తెలంగాణ ఏర్పాటు బిల్లులోని ప్రతి అక్షరాన్ని తన సమ్మతితోనే పెట్టారని చెప్పుకునే కేసీఆర్.. ప్రాజెక్టుల అప్పగింత నిర్ణయాన్ని ఎందుకు వ్యతిరేకించలేదు?

స్వయంగా సంతకాలు చేసి కూడా..

తెలంగాణ, ఏపీ మధ్య 811 టీఎంసీల జలాలను పంచుకునేందుకు 2015 జూన్ 18, 19 తేదీల్లో కేఆర్‌ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సమావేశం జరిగింది. ఆ సమావేశానికి అప్పటి సీఎం కేసీఆర్, నాటి ప్రభుత్వ సీఎస్ ఎస్‌కే జోషి, ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సాగునీటి నిపుణుడు విద్యాసాగర్‌రావు హాజరయ్యారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల చొప్పున నీటిని పంచేందుకు ఒప్పుకొన్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతం ఎక్కువగా ఉన్న తెలంగాణకు కేవలం 299 టీఎంసీలే నీరే తీసుకునేందుకు ఎలా ఒప్పుకొన్నారు? ఇదంతా ఆ సమావేశం మినిట్స్‌లో రికార్డు అయింది. రాష్ట్రానికి రావాల్సిన నీటిని ఏపీకి ధారాదత్తం చేసిన దుర్మార్గుడు కేసీఆర్. అంతే కాదు 2022 మే 27న జరిగిన సమావేశంలో 15 ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు అంగీకరించారు. గత ఏడాది మే 19న జరిగిన కృష్ణాబోర్డు 17వ సమావేశంలో ప్రాజెక్టులను అప్పగించేందుకు ఒప్పుకుంటూ కేసీఆర్ స్వయంగా సంతకాలు చేశారు. ప్రాజెక్టుల నిర్వహణ కోసం 2023–24 బడ్జెట్‌లో గోదావరి బోర్డు, కృష్ణా బోర్డులకు చెరో రూ.200 కోట్ల చొప్పున రూ.400 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు కూడా. ఇంత చేసిన కేసీఆర్.. ఇప్పుడు నల్లగొండలో నిరసన తెలుపుతాననడం సిగ్గుచేటు.

కేసీఆర్ చేతగానితనం వల్లే..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు భూభాగమంతా తెలంగాణలోనే ఉంటుంది. కానీ రెండు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాగర్ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసింది. ఏపీ పోలీసులు తుపాకులతో మోహరించారు. తెలంగాణ ప్రాజెక్టును స్వాధీనం చేసుకునేందుకు ఏపీకి ఎంత దమ్ము ఉండాలి. కేసీఆర్ చేతగానితనం వల్లే అలా జరిగింది. అధికారం కోల్పోయి ఇంట్లో కూర్చున్న కేసీఆర్ బయటికి వచ్చే పరిస్థితి లేక ప్రజలకు అబద్ధాలు చెప్తున్నారు.

కేసీఆర్‌వన్నీ తుగ్లక్ నిర్ణయాలు: ఉత్తమ్

కేసీఆర్ ముఖ్యమంత్రిగా నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో అన్నీ తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. లక్షకోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూన్నాళ్ల ముచ్చట అయ్యిందని, పలు ప్రాజెక్టుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని అన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తి చేసే ప్రాజెక్టులకు అంచనాలను రెట్టింపు చేసి నిధులన్నీ దుబారా చేశారన్నారు. రెండు టీఎంసీల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసి, గ్రావిటీ ద్వారా వచ్చే 8 టీఎంసీలను తీసుకెళ్తుంటే చోద్యం చూశారు. నీటినిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రాజెక్టులు ఏడారిగా మారుతున్నాయని, రాష్ట్ర రైతాంగం నోట్లో మట్టికొట్టిన పరిస్థితిని కేసీఆర్ సృష్టించారన్నారు.

ఎంత సమయం కావాలన్నా ఇస్తాం..

"కేసీఆర్ నల్లగొండకు వెళ్లేముందు అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలి. ఆయనకు ఎంత సమయం కావాలంటే అంత కేటాయిస్తాం. ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చెయ్యం. ప్రతి అంశంపై చర్చించాలి. చెయ్యి నొప్పి, కాలు నొప్పి అని సాకులు చెప్పి సమావేశాలకు గైర్హాజరు కావొద్దు. ఎంతసేపైనా చర్చిద్దాం. కావాలంటే చద్దర్లు, దుప్పట్లు కూడా తెచ్చుకోండి. అవసరమైతే తలుపులేసి మాట్లాడుకుందాం. కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావు కూడా రావాలి. ఎమ్మెల్సీ కవిత కూడా హాజరుకావొచ్చు. అవసరమైతే ఉభయసభలను ఒకే సమయంలో సమావేశపరుస్తాం.

ఆయన కుట్రతోనే ప్రాజెక్టులకు బొక్కలు..

రాష్ట్ర ప్రయోజనాలు తీర్చాల్సిన జలాలను కేసీఆర్ కుట్రపూరితంగా ఆంధ్రకు కట్టబెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో టీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు మంత్రులుగా పనిచేశారు. కేంద్రంలో కేసీఆర్‌తోపాటు నరేంద్ర మంత్రులుగా కొనసాగారు. అప్పట్లో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 44వేల క్యూసెక్కుల జలాలను పోతిరెడ్డిపాడు ద్వారా తీసుకెళ్లే ప్రయత్నాలను టీఆర్‌ఎస్ మంత్రులు ఎందుకు అడ్డుకోలేదు? కేసీఆర్ లోపాయికారీ ఒప్పందాలతోనే తెలంగాణకు అన్యాయం జరిగింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ముఖ్యమంత్రికి నీటిని తరలించుకెళ్లేలా మరో టన్నెల్ ఏర్పాటు చేసుకునేందుకు కేసీఆర్ కారణమయ్యారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ రాయలసీమ ప్రాజెక్టుతో రోజుకు 8 టీఎంసీల నీటిని తరలించుకునేందుకు శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద బొక్కపెట్టారు. దానికి సంబంధించి 2020 మే 5న ఏపీ జీఓ 203ని కూడా తెచ్చింది. అప్పట్లో ప్రగతిభవన్‌కు వచ్చిన ఏపీ సీఎం జగన్‌తో కేసీఆర్ ఏకాంత చర్చల తర్వాతే ఆ జీఓ జారీ అయింది. ఆ ఏడాది ఆగస్టు 5న కృష్ణాబోర్డు సమావేశం ఉంటే కేసీఆర్ బిజీగా ఉన్నానంటూ వెళ్లలేదు. వెంటనే ఆ ప్రాజెక్టు టెండర్లు, కాంట్రాక్టర్ ఎంపిక కూడా పూర్తయ్యాయి. ఆ తర్వాత కమీషన్ల కోసం కుట్ర చేసిన వ్యక్తి కేసీఆర్. ఇలాంటి వ్యక్తి ప్రజా ఉద్యమాలు చేస్తానంటే ప్రజలే బుద్ధిచెప్తారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ సీఎంగా, ఆయన అల్లుడు హరీశ్‌రావు నీటిపారుదల, ఆర్థికశాఖల మంత్రిగా ఏమేం చేశారో అన్నింటినీ ప్రజల ముందు పెడతాం. వారి ఘనకార్యాలన్నింటికీ ఆధారాలు ఉన్నాయి.

ప్రాజెక్టులను బోర్డుకు ఇచ్చే ప్రసక్తే లేదు

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వానికి అప్పగించే ప్రసక్తే లేదు. కృష్ణా, గోదావరి నదులు పుట్టినచోటి నుంచి సముద్రంలో కలిసేవరకు ఉన్న ప్రాజెక్టులన్నింటిపై సమీక్షించి రాష్ట్రాల వారీగా నీటి వాటాలు తేల్చాలి. కేవలం ఏపీ, తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులతో ముడిపెట్టొద్దు. ఈ అంశంపై ప్రధానితోపాటు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులను కలసి వినతిపత్రాలు ఇచ్చాం. అది తేలేవరకు ప్రాజెక్టుల అప్పగింత మాటే ఉండదు. ప్రస్తుతం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి పనులు పూర్తిచేస్తాం..''అని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

చర్చ పెట్టు.. సమాధానమిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

జైరాం రమేశ్ కాదా? అసలు పోతిరెడ్డిపాడు గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు. దానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో గట్టిగా పోరాడింది మేమే. పోతిరెడ్డిపాడుకు బొక్క కొట్టి నీళ్లు తీసుకెళ్తుంటే అసెంబ్లీని 30 రోజులు స్తంభింపజేశాం. నాడు టీడీపీలో ఉన్న రేవంత్ పోతిరెడ్డిపాడుపై ఏమాత్రం స్పందించలేదు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని వెంకయ్యనాయుడు ఉదయమే రేవంత్‌కు చెప్పారు. కానీ మధ్యాహ్నమే రేవంత్ చిల్లర మాటలు మాట్లాడారు..''అని హరీశ్‌రావు మండిపడ్డారు. తాము మేం కృష్ణా నీటిలో 50శాతం వాటా ఇవ్వాలని, శ్రీశైలాన్ని హైడల్ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తే హైదరాబాద్‌కు మంచినీటి సమస్య వస్తుందని.. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లకు సాగునీరు, తాగునీటి సమస్య నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

హామీల అమలుపై ప్రశ్నిస్తే ఆరోపణలా?

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైందని.. హామీలపై ప్రశ్నిస్తే పసలేని అంశాలతో ఎదురుదాడి చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. డిసెంబర్‌లోనే రూ.4వేలు పింఛన్ ఇస్తామని, ఫిబ్రవరి 1న గ్రూప్–1 నోటిఫికేషన్ ఇస్తామని, డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని డేట్లు పెట్టి.. ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జాతీయ రాజకీయాల్లో ఇండియా కూటమి ముక్కలవుతోందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాలే లేవని హరీశ్‌రావు చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ గెలవనందున రాష్ట్రంలో హామీలను అమలు చేయడం కుదరడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి సాకు చెప్పబోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పడిపోతున్నాయని, తెలంగాణలోనూ అదే జరగబోతోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో తెలంగాణ వాణిని బలంగా వినిపించాలంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జయ జయహే తెలంగాణ!

▶ మొదటి పేజీ తరువాయి

'టీజీ'ని ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించేందుకు.. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో రెండింటిని ఈ సమయంలోనే ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు మీడియాకు వివరించారు.

ఇందిరమ్మ రాజ్య ఫలాలు అందిస్తాం

కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చిన రాష్ట్ర ప్రజలకు ఇందిరమ్మ రాజ్య ఫలాలు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 8 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. తొలిరోజున గవర్నర్ ప్రసంగిస్తారని, తర్వాతి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఉంటుందని తెలిపారు. మూడో రోజు బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు కొనసాగించేదీ బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ''తెలంగాణ రాష్ట్రం కోసం సుదీర్ఘ పోరాటం జరిగింది. అలాంటి పోరాటాన్ని కాదని రాచరిక పోకడలతో రూపొందించిన రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తాం. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కనిపించేలా చిహ్నాన్ని రూపొందిస్తాం. తెలంగాణ తల్లి రూపాన్ని కూడా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు కనిపించేలా మారుస్తాం. తెలంగాణ గేయంగా అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ పాట గుర్తించాలని మంత్రిమండలి నిర్ణయించింది..'' అని పొంగులేటి తెలిపారు.

త్వరలోనే కులగణన

రాష్ట్రంలో బీసీలకు సంక్షేమ ఫలాలు పక్కాగా దక్కేలా కులగణన చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి చెప్పారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను అధికార యంత్రాంగం రూపొందిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గతంలో తెలంగాణ గెజిట్‌లో భాగంగా.. వాహనాల నంబర్ ప్లేట్లపై 'టీజీ'ని నిర్దేశించిందని.. కానీ గత ప్రభుత్వం వారి పార్టీ ఆనవాళ్లు కనిపించేలా 'టీఎస్'ను ఖరారు చేసిందని పేర్కొన్నారు. కేంద్ర గెజిట్ ప్రకారం టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని నిర్ణయించినట్టు వివరించారు. వీఆర్‌ఓల అంశంపై కేబినెట్ నిర్ణయం తీసుకోనప్పటికీ.. త్వరలోనే కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లోనే మరో రెండు గ్యారంటీ హామీలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

త్వరలోనే భారీగా ఉద్యోగాల భర్తీ..

రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైకోర్టు నిర్మాణం కోసం వంద ఎకరాల భూమి కేటాయింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెప్పారు. త్వరలో వ్యవసాయాధికారి పోస్టుల భర్తీ చేపడతామన్నారు. గ్రూప్–1, ఇతర కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీలను గుర్తించి, భర్తీ చేసే దిశగా కసరత్తు ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ ఉద్యోగాల భర్తీ కోసం అతి త్వరలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు.



కేబినేట్ సమావేశ వివరాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణపై నివేదిక ఇవ్వండి

రాష్ట్రంలో మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ అంశంపై వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం సచివాలయంలో సబ్ కమిటీతో ఈ అంశంపై సమీక్షించారు. బోధన్, ముత్యంపేటలలో మూతపడ్డ నిజాం షుగర్ ఫ్యాక్టరీలు చెల్లించాల్సిన పాత బకాయిలు, వాటి ఆర్థిక ఇబ్బందులు, ఆయా ప్రాంతాల్లోని చెరుకు రైతుల అవసరాలు, ప్రస్తుత పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని, తగిన సూచనలను అందించాలని కమిటీని కోరారు. త్వరగా నివేదిక సిద్ధం చేస్తే.. మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుందామని సూచించారు. ఈ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర గేయం ఇదే

జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం!!
పలు జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జై జై తెలంగాణ!!

పోతనది పురిటిగడ్డ, రుద్రమది వీరగడ్డ
గండరగండడు కొమురం భీముడే నీ బిడ్డ!!
కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప
గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్!!
జై తెలంగాణ జై జై తెలంగాణ!!

జానపద జనజీవన జావళీలు జాలువార
జాతిని జాగృత పరిచే గీతాల జనజాతర !!
వేలకొలదిగా వీరులు నేలకొరిగిపోతెనేమీ
తరుగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమయాగం!!
జై తెలంగాణ జై జై తెలంగాణ!!

గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగ
పచ్చని మా నేలల్లో పసిడి సిరులు కురవంగ!!
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణ యుగం కావాలి!!
జై తెలంగాణ జై జై తెలంగాణ!!

అందెశ్రీ నేపథ్యం..



తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అనే పాటను వరంగల్ జిల్లాకు చెందిన తెలుగు కవి, సినీగేయ రచయిత అందెశ్రీ రాశారు. ప్రజాకవి, ప్రకృతి కవిగా సుప్రసిద్ధుడైన అందెశ్రీ వరంగల్ జిల్లా జనగామ వద్ద ఉన్న రేబర్తి అనే గ్రామంలో జూలై 18, 1961లో జన్మించారు. ఈయన అసలు పేరు అందె ఎల్లయ్య. గొర్రెల కాపరిగా ఉన్న ఈయన్ను శృంగేరి మఠానికి సంబంధించిన స్వామీ శంకర్ మహారాజ్ అందెశ్రీ పాడుతుండగా విని చేరదీశాడు. రాష్ట్రవ్యాప్తంగా అందెశ్రీ పాటలు ప్రసిద్ధం. నారాయణ మూర్తి నటించిన విప్లవాత్మక సినిమాల విజయం వెనక అందెశ్రీ పాటలున్నాయి. 2006లో గంగ సినిమాకు గాను నంది పురస్కారాన్ని అందుకున్నారు. బతుకమ్మ సినిమా కోసం ఈయన సంభాషణలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం అందెశ్రీని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

అందెశ్రీ సినీ పాటల జాబితా

- జయజయహే తెలంగాణ జననీ జయకేతనం
- పల్లెనీకు వందనాలమ్మో
- మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు
- గలగల గజ్జెలబండి
- కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిచి మొక్కితే అమ్మరా
- జన జాతరలో మన గీతం
- ఎల్లిపోతున్నావా తల్లి
- చూడాచక్కాని తల్లి చుక్కల్లో జాబిల్లి

వీళ్లు ఔట్.. వాళ్లు ఇన్

▶ మొదటి పేజీ తరువాయి

ఆదివారం ఉదయం వరకు అక్కడే ఉన్న జార్ఖండ్ ఎమ్మెల్యేలు సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో రాంచీకి వెళ్లిపోయారు. వారు అటు వెళ్లిపోగానే బిహార్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పట్నా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. సాయంత్రం 5 గంటలకు వచ్చిన వారికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్, సీనియర్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డిలు ఎయిర్‌పోర్టులో ఆహ్వానం పలికారు. వారిని అక్కడి నుంచి నేరుగా ఇబ్రహీంపట్నంలోని ఓ రిసార్ట్‌కు తరలించారు. ఈనెల 10వ తేదీన బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం బల నిరూపణ చేసుకోనుండటంతో అప్పటివరకు వీరంతా రిసార్ట్‌లోనే ఉంటారని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

ఆశావహుల వడపోతకు
నాయకత్వం సిద్ధం

కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల ఖరారుకు 6న పీఈసీ భేటీ

- సమావేశానికి హాజరుకానున్న ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు
- 306 దరఖాస్తుల పరిశీలన
- నియోజకవర్గానికి 3 పేర్లు అధిష్టానానికి పంపే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక కార్యక్రమానికి పార్టీ నాయకత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమం ఈనెల 3వ తేదీన ముగిసిన నేపథ్యంలో 6వ తేదీన టీపీసీసీ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం జరగనుంది. టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు ఏఐసీసీ నియమించిన తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీశ్ చౌదరి, సభ్యులు జిగ్నేశ్ మేవానీ, విశ్వజిత్ కథమ్‌లు కూడా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో భాగంగా పార్లమెంటు ఎన్నికల కోసం కార్యాచరణను రూపొందించుకోవడంతో పాటు ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఆశావహుల బయోడేటాలను పరిశీలించి, పార్టీలో వారి అనుభవం, పనితీరు, గత ఎన్నికల్లో చేసిన కృషి తదితర అంశాల ఆధారంగా మొత్తం 306 దరఖాస్తులను పరిశీలించి ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ముగ్గురి పేర్లను ఏఐసీసీకి సిఫారసు చేయనున్నట్టు సమాచారం. ఈ పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) పరిశీలించి పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయనుందని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని, ఈనెల 15వ తేదీ నుంచి ఎప్పుడైనా అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశముందని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి బదిలీ


▶ మొదటి పేజీ తరువాయి

ప్రజా సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో సెక్రటరీగాను

- ➤ సమాచార, ప్రజా సంబంధాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో సెక్రటరీ కె. అశోక్‌రెడ్డిని ఉద్యానవనశాఖ డైరెక్టర్‌గా
- ➤ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఎ.నిర్మలకాంతి వెస్లీని స్త్రీ, శిశు, వయోజనుల సంక్షేమ శాఖకు బదిలీ చేస్తూ, ఆమెకే ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ పోస్టును సైతం ప్రభుత్వం అప్పగించింది.
- ➤ హైదరాబాద్ జూ పార్క్ డైరెక్టర్‌గా ఉన్న వీఎస్‌ఎన్‌వీ. ప్రసాద్‌ను పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.
- ➤ వెయిటింగ్‌లో ఇద్దరిలో సీతాలక్ష్మిని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీల కార్యదర్శిగాను, జి.ఫణీంద్రరెడ్డిని హైదరాబాద్ జిల్లా రేషనింగ్ అధికారిగా బదిలీ చేసింది.

భగవన్నామస్మరణతో ముక్తికి మార్గం

శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సులో ఆధ్యాత్మిక వేత్తలు



అనుగ్రహభాషణం చేస్తున్న తిరుమల రామానుజ పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు ఆదివారం రెండో రోజుకు చేరింది. సదస్సులో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి పాల్గొన్నారు. సదస్సుకు ముందు వీరు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. తిరుమల పెద్దజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ..దేశవ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులను ఆహ్వానించి శ్రీవారి పాదాల చెంత ధార్మిక సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. స్వామీజీలు ఆయా సంప్రదాయాల్లో ధర్మప్రచారం చేస్తున్నారని, వారి విలువైన సూచనలు తీసుకొని టీటీడీ మరింతగా ధర్మ ప్రచారం చేస్తుందన్నారు. తిరుమల చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ..నామసంకీర్తన చేస్తే భగవంతుని కృప తప్పక కలుగుతుందని చెప్పారు. భగవన్నామస్మరణతో భక్తులు తమ కష్టాలను దూరం చేసుకుని, ముక్తి మార్గం వైపు పయనించవచ్చన్నారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఏనాడూ వ్యతిరేకించలేదు

తాను అభ్యుదయ రాజకీయాల్లో ఉన్న సమయంలో కూడా భగవంతుడిని, సనాతన హిందూ ధర్మాన్ని వ్యతిరేకించలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ధార్మిక సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. స్వామివారు తన ఆలయం నుంచి గొప్ప సందేశం అందించాలనే దేశంలోని ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులను ఇక్కడికి రప్పించారన్నారు. ధార్మిక సదస్సులో స్వామీజీలు అందించే సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని సనాతన హైందవ ధర్మం పరిఢవిల్లేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఇతర మతాల భక్తులు ముందుకు వస్తే శ్రీవారి పాదకమలాల వద్ద హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై శిక్షణ ఇస్తామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, తెలంగాణ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి, బీజేపీ నేతలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.

కాంగ్రెస్ మాటల ప్రభుత్వం

- పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మల్లాపూర్/గౌతంనగర్(హైదరాబాద్): కాంగ్రెస్ మాటల ప్రభుత్వమని.. ఆ పార్టీ చేసిన 420 హామీలకు ప్రజలు మోసపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజయోత్సవ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై మాట్లాడారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజలు కాంగ్రెస్ పార్టీని 100 రోజుల్లో బొంద పెట్టడం ఖాయమని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏమైనా మాట్లాడొచ్చు..కానీ అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే అనాగరిక వ్యాఖ్యలు సరికాదన్నారు. కరెంట్ బిల్లు సీఎం కడతాడా...సోనియాగాంధీ కడుతుందా చెప్పాలన్నారు. చీకటిలో ఉంటేనే వెలుగు విలువ తెలుస్తుందని, కాంగ్రెస్ పాలన చూస్తేనే కేసీఆర్ గొప్పపాలన తెలుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు 1. 57 కోట్ల మంది ఆడబిడ్డలు, 70 లక్షల మంది రైతులు రూ.15 వేల కోసం మహాలక్ష్మి పథకం కింద రూ.2500 ఖాతాలో


మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న కేటీఆర్

ఎప్పుడు వేస్తారని, రెండు లక్షల రుణమాఫీ కోసం రైతులు, 46 లక్షల మంది పెన్షన్ కోసం ఇలా అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నెహ్రూనగర్‌కు చెందిన దివ్యాంగుడు అంజికి స్కూటీ, బీఆర్ఎస్ కార్యకర్త కుమారైకు మెడికల్ సీటుకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ రావు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు భద్రారెడ్డి, తాడూరి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్, బొంతు శ్రీదేవి, బన్నాల గీతాప్రవీణ్, ప్రభుదాస్, సింగిరెడ్డి శిరీషారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సేవాసమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు.

ఆరు గ్యారంటీలు ఇచ్చి... అయోమయంలో పడ్డారు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు ఇచ్చి ఇప్పుడు నెరవేర్చలేక అయోమయంలో పడిందని కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరిలోని లక్ష్మీ సాయి గార్డెన్స్‌లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేయకుంటే సీఎం రేవంత్‌రెడ్డిపై గళమెత్తుదామన్నారు. మల్కాజిగిరి ప్రజలను ఎవరైనా భయభ్రాంతులకు గురిచేసినా, వేధింపులకు పాల్పడినా రాష్ట్రవ్యాప్తంగా అందరం వచ్చి మల్కాజిగిరిలో దిగుతామన్నారు. మల్కాజిగిరి ప్రజలు ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసి చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు మేకల సునీత రాముయాదవ్, శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మీనా ఉపేందర్‌రెడ్డి, సబితకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హుటాహుటిన బీఆర్ఎస్ అత్యున్నత స్థాయి భేటీ

- కృష్ణా ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ సమావేశం.. నేడు పార్టీ సీనియర్ల ప్రెస్‌మీట్


మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో హరీశ్‌రావు, మల్లారెడ్డి


సాక్షి, హైదరాబాద్: కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే వ్యవహారం చినికి చినికి గాలివానలా మారుతోంది. ఈ ప్రాజెక్టుల అప్పగింత ప్రక్రియ విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన పాలనలో జరిగిన వ్యవహారాలే కారణమని ఆరోపిస్తూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ అత్యున్నత స్థాయి సమావేశం ఆదివారం రాత్రి నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహబూబ్ అలీ, జగదీశ్‌రెడ్డిలతో పాటు అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని, ప్రభుత్వ అనాలోచిత వైఖరి, కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారిన వైనాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. కేఆర్ఎంబీకి సాగర్ శ్రీశైలం సహా కృష్ణా నది మీద ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేలా ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తప్పుబట్టింది. ఈ విషయంలో పార్టీ సీనియర్ నేతలతో సోమవారం ప్రెస్‌మీట్ నిర్వహించాలని నిర్ణయించింది.

నల్లగొండలో గులాబీ సభ

త్వరలో 2లక్షల మందితో నిర్వహించేందుకు సన్నాహాలు

- కేఆర్ఎంబీ వాస్తవాల వివరణే టార్గెట్.. సభలో శ్వేతపత్రాలు రిలీజ్

సాక్షి, హైదరాబాద్: త్వరలో నల్లగొండలో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. దాదాపు రెండులక్షల మందితో సభ ఏర్పాటు చేసి, కేఆర్ఎంబీ వాస్తవాలను ప్రజలకు వివరించనుంది. సభావేదిక నుంచే పార్టీ అధినేత కేసీఆర్ శ్వేతపత్రాలు రిలీజ్ చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని భావిస్తోంది. ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్ వైఫల్యాలను వివరించి..ఇంటింటికీ పార్టీ శ్రేణులు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నల్లగొండ నుంచి పార్లమెంట్ ఎన్నికలకు శంఖారావం పూరించాలని అనుకుంటోంది. 2018 ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్నా, 2023లో జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట మినహా అన్నిచోట్ల బీఆర్ఎస్ ఓటమిని చవిచూసింది. దీంతో తిరిగి కేడర్‌లో పునరుత్తేజం నింపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తే తెలంగాణకు ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు జరిగే అన్యాయాన్ని వివరించేందుకు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లలో కృష్ణాజలాలపై సాగించిన పోరాటాన్ని సభావేదికగా ప్రజలకు వివరించాలని పార్టీ అధిష్టానం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు కేఆర్ఎంబీతో ఎన్నిసార్లు సమావేశమైంది, సమావేశంలో చర్చించిన అంశాలను సభావేదిక నుంచే శ్వేతపత్రాలు రిలీజ్ చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. విభజన చట్టంలోని అంశాలతోపాటు ముఖ్యంగా నీటి వాటాలపై బీఆర్ఎస్ కొట్లాడిన తీరును ప్రజలకు వివరించి వారిని, చైతన్యపర్చాలని చూస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టాన్ని ప్రముఖంగా వివరించనుంది. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 2లక్షల రుణమాఫీ, వరికి 500రూపాయల బోనస్ హామీలను ఎండగట్టనున్నట్టు తెలిసింది. సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల చేయకపోవడం, చివరి ఆయకట్టు రైతులు వేసిన పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వంటి అంశాలతోపాటు గత బీఆర్ఎస్ సాగునీటి విడుదలకు తీసుకున్న చర్యలు, రైతుల కోసం పాటుపడిన తీరును కేసీఆర్ వివరించేందుకు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాతే నల్లగొండ సభ జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ప్రేమలో ఎల్లప్పుడూ కొంత పిచ్చితనం ఉంటుంది. కానీ పిచ్చితనంలో ఎల్లప్పుడూ కొంత హేతువు ఉంటుంది.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 5 ఫిబ్రవరి 2024

ఫస్ట్-రేట్ రచయిత

సెకండ్-రేట్ రచయితల్లో తాను మొదటి వరుసలో ఉంటానని చెప్పుకొన్నాడట సోమర్‌సెట్ మామ్. ఆయన దృష్టిలో బాల్జాక్, డికెన్స్, టాల్‌స్టాయ్, దోస్తోవ్‌స్కీ ప్రపంచం చూసిన నలుగురు గొప్ప నవలాకారులు. పాఠకులను సాహిత్యం వైపు ఆకర్షించడమే కొందరు రచయితల విలువైన కాంట్రిబ్యూషన్ అవుతుంది. ఇక్కడ కూడా మామ్ మొదటి వరుసలో ఉంటారు. ఆంగ్ల అనువాద కథలతో పరిచయం ఉండే తెలుగు పాఠకులకు దాదాపుగా తగిలే మొదటిపేరు విలియమ్ సోమర్‌సెట్ మామ్. అత్యధిక కాపీల అమ్మకం, అత్యంత పేరు, అత్యధిక సంపాదనలతో చాలా విధాలుగా ఒక కమర్షియల్ రచయిత కూడా కలలు కనలేని జీవితాన్ని మామ్ అనుభవించాడు. హాలీవుడ్ సినిమాలకు పనిచేశాడు, దేశదేశాలు తిరిగాడు, అత్యంత ప్రముఖులతో విలాసవంతమైన టూర్లు, డిన్నర్లల్లో పాల్గొన్నాడు. తన గురించి మామ్ ఏమని చెప్పుకొన్నా, ఆయన 'ద మూన్ అండ్ సిక్స్‌పెన్స్', 'ద పేంటెడ్ వీల్', 'కేక్స్ అండ్ ఎయిల్', 'ద రేజర్స్ ఎడ్జ్' గొప్ప నవలలుగా పేరొందాయి. ఇక మామ్ మాస్టర్‌పీస్‌గా చెప్పే 'ఆఫ్ హ్యూమన్ బాండేజ్' ప్రపంచ గొప్ప నవలల్లో ఒకటిగా నిలిచిపోయింది. నూటికి పైగా కథలు, పదులకొద్దీ నాటకాలు, నవలలు... ఎంత విస్తృతంగా రాశాడో అంత ఆదరణ పొందిన మామ్‌కు ఇది నూటా యాభయ్యో జయంతి సంవత్సరం.

మామ్ జీవితంలోనూ ఒక రచనకు కావాల్సినంత డ్రామా, కన్నీళ్లు, కష్టాలు, ట్విస్టులు ఉన్నాయి. గొప్ప ఆంగ్ల రచయితల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్న ఆయన ఆంగ్లాన్ని చిన్నతనంలో సాటి విద్యార్థులు హేళన చేసేవారు. కారణం, జన్మకు ఆంగ్లేయుడు అయినా, పుట్టింది ఫ్రెంచ్ గడ్డ మీద. అలా ఫ్రెంచ్ ఆయన మొదటి భాష అయింది. ఫ్రెంచ్ గడ్డ మీద పుట్టిన అందరూ ఫ్రెంచ్‌వాళ్లే అవుతారనీ, తప్పక మిలిటరీలో చేరాల్సిందేననీ శాసనం వచ్చినప్పుడు ఆ స్థానీయతను తప్పించుకోవడానికి మామ్ కుటుంబం ఫ్రాన్స్‌లోని బ్రిటిష్ దౌత్య కార్యాలయాన్ని ఆశ్రయించింది. అందులోనే మామ్‌కు జన్మనిచ్చింది(1874 జనవరి 25) వాళ్ల తల్లి. అలా బ్రిటన్ ఎంబసీలో జన్మించడం వల్ల మామ్ బ్రిటనీయత స్థిరపడిపోయింది. వాళ్ల గ్రేట్-అంకుల్ గుర్తుగా పెట్టిన సోమర్‌సెట్ అనే మధ్యపేరు ఆయనకు నచ్చలేదు. ఇంట్లో విల్లీ అని పిలిచేవాళ్లు. మామ్‌కు ఎనిమిదేళ్ల వయసున్నప్పుడే తల్లి క్షయవ్యాధితో చనిపోయింది. ఆ లోటు ఆయనకు ఎప్పుడూ తీరలేదు. 'అది ఎప్పుడూ పూర్తిగా మానని గాయం'గానే ఉండిపోయింది. వృద్ధుడయ్యాక కూడా తల్లి ఫొటోను మంచం పక్కనే ఉంచుకునేవాడు. ఆ తర్వాత రెండేళ్లకే తండ్రి చనిపోవడం మరో దెబ్బ. అప్పుడు బ్రిటన్‌లోని చిన్నాన్న దగ్గరికి వచ్చాడు. ఆ కొత్త ఇల్లు, వాతావరణం బాగున్నప్పటికీ, తల్లిదండ్రులు లేని చింత, కొత్త సమాజంలో కలవలేకపోవడం, సిగ్గరి కావడం వంటి కారణాల వల్ల ఇట్టే మాట్లాడేవాడు కాదు. అది క్రమంగా నత్తిగా మారి జీవితాంతం ఆయనతో ఉండిపోయింది. తాత, తండ్రి న్యాయవాదులు అయినప్పటికీ మామ్ ఆ బాటలోకి పోకపోవడానికి ఈ నత్తి కూడా ఒక కారణం.

డాక్టర్ కాబోయి యాక్టర్ అవడంలా కాకుండా, నిజంగానే డాక్టరీ చదివినా దాని జోలికి పోకుండా రంగస్థలంలో ప్రాక్టీస్ చేశాడు మామ్. నాటకాలతో ముందు ప్రజాదరణ పొందినా తర్వాత నవలలు, కథల మీద మాత్రమే దృష్టిసారించాలని నిశ్చయించుకున్నాడు. ఒక చదవదగ్గ కథకు మెటీరియల్ రాకపోతే తానెవరి సమక్షంలోనూ గంటసేపు కూడా గడపనని అనేవాడు. ఆయనకు ఏదైనా కథావస్తువే. దానికి తగినట్టే ఆయన జీవితం కూడా అనుభవాల పుట్ట. యువకుడిగా మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటన్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ కోసం కొన్నాళ్లు స్విట్జర్లాండ్‌లో గూఢచారిగా పనిచేశాడు. ఫ్రెంచ్ నాటక రచయిత అన్నది అప్పుడు ఆయన కవర్. తర్వాత, రష్యాలోనూ బోల్షివిక్కులకు వ్యతిరేకంగా, జర్మన్ నిఘా నెట్‌వర్క్ మీద సమాచారాన్ని పంపాడు. మెన్షివిక్కులకు మద్దతు ఇవ్వాలన్నది బ్రిటన్ ఆలోచన. జర్మనీలో చదువుకున్నందువల్ల మామ్‌కు జర్మన్ వచ్చు. ఈసారి అమెరికా పబ్లిషర్ అనేది కవర్. అయితే ఈ అనుభవాలను రచనలుగా తెచ్చాడుగానీ అధికార రహస్యాల చట్టాన్ని ఇవి ఉల్లంఘిస్తుండటంతో చాలావాటిని కాల్చేశాడు. అయినా గూఢచర్య కథలు రాసిన తొలి గూఢచార రచయిత మామ్ అయ్యాడు. జేమ్స్ బాండ్ సిరీస్ రాయడానికి ఇయాన్ ఫ్లెమింగ్‌కు ప్రేరణగా నిలిచాడు. కానీ గూఢచర్యంలో పనిరోజులు ఒకేవిధంగా ఉండి విసుగు పుట్టిస్తాయనీ, చాలా రోజులు నిరర్థకమనీ వ్యాఖ్యానించాడు.

ఇటీవల వచ్చిన మలయాళ సినిమా 'కాదల్'లో హోమోసెక్సువల్ అయినప్పటికీ హీరోకు ఒక కూతురు ఉంటుంది. దాంపత్య బంధపు ఒత్తిడి అది. మామ్ కూడా లైంగిక ధోరణి రీత్యా హోమోసెక్సువల్. పదేళ్ల వివాహ బంధంతో ఆయనకు ఒక కూతురు. కానీ తర్వాత వివాహం నుంచి విముక్తం అయ్యి స్నేహితులతో స్వేచ్ఛాజీవితం గడిపాడు. తల్లి దూరమవడం మొదలు తన జీవితంలోని అపసవ్యతలన్నింటి కారణంగా, జీవితాంతం దేవుడి మీద అవిశ్వాసిగా ఉన్న మామ్ తన ఆత్మకథాత్మక నవలను చివరి దశలో చదువుకున్నా కన్నీళ్లు కార్చకుండా పూర్తిచేసేవాడు కాదు. ఇంకేది కలిపినా డిజైన్ పాడవుతుందని తెలిసినప్పుడు ఆర్టిస్ట్ ఇక దాన్ని వదిలేసినట్టుగా, తాను రచయితగా సంతృప్తికర దశలో ఉన్నప్పుడే జీవితాన్ని చాలించాలని మామ్ ఆశపడ్డాడు. అన్నింటి విషయంలో జరిగినట్టుగానే ప్రకృతికి ఆయన విషయంలో వేరే లెక్కుంది. కోరుకున్న ముప్పై సంవత్సరాల తర్వాత, అన్ని వృద్ధాప్యపు సమస్యలతో పాటు 91 ఏళ్ల నిండుతనం కూడా ఇచ్చిగానీ ఆయన్ని సాగనంపలేదు.

మనం ఎందుకు పట్టించుకోం?

కామెంట్



కరణ్ థాపర్

భారత రాజకీయాల గురించి ఒక శోచనీయమైన, దురదృష్టకరమైన నిజానికి నితీశ్ కుమార్ ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచారా? ఈ విధమైన అవకాశవాదం, పదేపదే మిత్రపక్షాలను మార్చటం ఏ పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశంలోనూ ఆమోదయోగ్యమైనది కాదు. అది ఆ నాయకుడి విశ్వసనీయతను, పార్టీ ప్రతిష్ఠను నాశనం చేస్తుంది. నితీశ్ కుమార్ పిల్లిమొగ్గలతో పోల్చలేం కానీ, 2010లో యూకేలో కన్జర్వేటివ్‌లతో లిబరల్స్ పొత్తు పెట్టుకున్నప్పుడు అదొక నీతిమాలిన చర్యగా పరిగణన పొందింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో లిబరల్ పార్టీ కుప్పకూలింది. మరి ఈ 'దుముకుళ్లను' మన ఓటర్లు ఎందుకు సమ్మతిస్తారు? తమను గెలిపించిన వారికి ద్రోహం చేసి వెళ్లిన రాజకీయ నాయకులకు మన ఓటర్లు ఎందుకు శిక్ష విధించరు?

నాయకులు పార్టీని వదిలి వెళ్లడం, వేరే పార్టీలో చేరడం మన అందరికీ బాగా తెలిసిన విషయమే. మనం ఆశించినంతగా ఏమీ వారు అసాధారణమైన వ్యక్తులు కారు. కానీ నితీశ్ కుమార్ అంత బుద్ధిహీనమైన పని చేసి ఉండాల్సింది కాదని మీరు అంగీకరిస్తారా? ఆయన అలా చేయకుండా ఉండలేరని అందరూ ఊహిస్తున్నదే అయినప్పటికీ ఆయన ప్రవర్తన నాకు నిజంగా చాలా దిగ్భ్రాంతిని కలుగజేసింది. ఆత్మగౌరవం గల ఒక మనిషి – రాజకీయ నాయకుడే అయినా – తన సొంత రాజకీయ మనుగడ కోసం తను కట్టుబడి ఉండవలసిన విలువల్ని, సిద్ధాంతాలను వెనక్కు నెట్టేయగలిగినంతగా దిగజార గలడని నేను నమ్మలేకపోయాను.

2013 నుండి, నితీశ్ తన వ్యక్తిగత రాజకీయ జీవితాన్ని ముందుకు తీసుకెళ్లడానికి హఠాత్తుగా కూటములను మార్చేయటం ఇది ఐదోసారి. అయితే నా సహోద్యోగి అశోక్ ఉపాధ్యాయ అనటం ఏమిటంటే – మీరు కనుక నితీశ్ 1994లో సమతా పార్టీని స్థాపించడం కోసం లాలూ ప్రసాద్ యాదవ్‌తో, జనతాదళ్‌తో తెగతెంపులు చేసుకోవటాన్ని కూడా లెక్కలోకి తీసుకుంటే ఆయన అలా చేయడం ఆరోసారి అవుతుందని!

నేను అంతగా ఎందుకు ఆశ్చర్యపోయానని మీరు నన్ను అడగవచ్చు. రెండు కారణాలు. నితీశ్ మళ్లీ అలాంటి పని చేస్తాడని నేను ఊహించలేదు. అలా చేస్తే కనుక విశ్వసనీయత ప్రమాదంలో పడిపోయే స్థాయికి ఆయన ఇప్పటికే చేరుకుని ఉన్నారని నా భావన.

ఆయన అలా చేస్తాడని నేను అనుకోకపోవటానికి రెండో కారణం మరింతగా నిస్సందేహమైనది. బీజేపీతో తిరిగి కలిసే అవకాశంపై ఆయన, ఆయన్ని తిరిగి రెండోసారి కూటమిలోకి చేర్చుకునే విషయమై బీజేపీ... 'అసలు అలాంటి ఆలోచనే లేదన్నట్లు'గా స్పష్టం చెయ్యటం జరిగింది.

ఏడాది క్రితమే 2023 జనవరి 30న, ''ఏదో ఒక రోజు మీరు బీజేపీలో తిరిగి కలుస్తారా?'' అని అడిగినప్పుడు నితీశ్ ఇలా అన్నారు: ''మర్ జానా కబూల్ హై, ఉస్ కే సాథ్ జానా హమ్‌కో కభీ కబూల్ నహీ హై. యే అచ్ఛీ తరహ్ జాన్ లీజియేగా.'' (చావనైనా చస్తాను కానీ, వాళ్లతో వెళ్లి కలిసేది లేదు. దీనిని మీరు సరిగ్గా అర్థం చేసుకోవాలి.)

తర్వాత కొన్ని వారాలకు 2023 ఫిబ్రవరి 25న ఇదే ప్రశ్న హోం మంత్రి అమిత్ షాకు ఎదురైంది. బీజేపీ నితీశ్‌ను మరొకసారి అక్కున చేర్చుకోటానికి సుముఖంగా ఉందా? 'ది హిందూ'లో వచ్చిన దానిని బట్టి అమిత్ షా ఈ విధంగా సమాధానం చెప్పారు: ''ఆయా రామ్, గయా రామ్‌లు ఇక చాలు. నితీశ్ కుమార్‌కు బీజేపీ తలుపులు శాశ్వతంగా మూతపడ్డాయి.''



'ఇండియా' కూటమిని వీడి తిరిగి ఎన్డీయేలో చేరిన నితీశ్ కుమార్

సరే, నితీశ్ కుమార్ ఏడాది క్రితం స్పష్టంగా మరణం కంటే అధ్వాన్నం అని భావించిన దానినే ఇప్పుడు కోరుకున్నారు. ఇక 'ఎప్పటికీ' అనేది అమిత్ షా ఉద్దేశంలో కేవలం తాత్కాలికం అని మాత్రమే కాదు, హాస్యాస్పదంగా అది ఎంతో స్వల్పకాలిక వ్యవధి అని కూడా!

ఈ వైఖరులపై అవమానకరమైన మాటలు వచ్చి పడటంలో వింతేమీ లేదు. నితీశ్‌ని పల్టూరామ్, పల్టూమార్, పల్టూపుత్ర అంటున్నారు. శశి థరూర్ అయితే సహజంగానే ఇప్పుడంతగా వాడుకలో లేని ఆంగ్ల పదాన్ని నితీశ్‌కు అన్వయించడం కోసం తవ్వి తీశారు. 'స్నోలీగోస్టర్' అనే మాట అది. 'తెలివైన, కానీ విలువల్లేని వ్యక్తి' అని ఆ మాటకు అర్థం.

ఏమైనా ఈ పరిణామంపై నా ఆందోళన ఇక్కడితో ఆగటం లేదు. భారతదేశ రాజకీయాల గురించి విచారం వ్యక్తం చేయదగిన, దురదృష్టకరమైన ఒక నిజానికి నితీశ్ కుమార్ సాక్ష్యంగా నిలిచారా? ఈ విధమైన అవకాశవాదం, పదేపదే మిత్రపక్షాలను మార్చటం అనేది ఏ ప్రధాన పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశంలోనూ ఆమోదయోగ్యమైనది కాదు. పైగా ఖండించదగినది. అది ఆ నాయకుడి విశ్వసనీయతను, పార్టీ ప్రతిష్ఠను నాశనం చేస్తుంది. నితీశ్ కుమార్ పిల్లి మొగ్గలతో పోల్చలేం కానీ, 2010లో బ్రిటన్‌లో లిబరల్స్ అనేవాళ్లు కన్జర్వేటివ్‌లతో పొత్తు పెట్టుకున్నప్పుడు అదొక నీతి మాలిన చర్యగా పరిగణన పొందింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో ఓట్లు రాబట్టలేక లిబరల్ పార్టీ కుప్పకూలింది... ఇండియాలో జరగని విధంగా!

మన భారతీయులం భిన్నంగా ఎలా ఆలోచిస్తామో, భిన్నంగా ఎలా స్పందిస్తామో చూపించటానికి అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్ కొన్ని ఉదాహరణలు మాత్రమే. మధ్యప్రదేశ్‌లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీని అధికారంలోకి తీసుకు రావటానికి కాంగ్రెస్‌ను విడిచిపెట్టి బీజేపీలో చేరినవారు పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ గత ఏడాది డిసెంబర్ ఎన్నికల్లోనూ భారీ మెజారిటీని సాధించారు.

ఈ దుముకుళ్లను మన ఓటర్లు ఎందుకు సమ్మతిస్తారు? తమను గెలిపించిన వారికి ద్రోహం చేసి వెళ్లిన రాజకీయ నాయకులకు మన ఓటర్లు ఎందుకు శిక్ష విధించరు? ప్రజాసేవ కంటే, నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత కంటే తమ ప్రయోజనాలకు, సంపాదనకు ప్రాధాన్యం ఇస్తున్నారని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నా ఎందుకు మన ఓటర్లు పట్టించుకోరు?

ఎందుకు అన్నదానిపై అనేక విధాలైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా కూడా నా దగ్గర సమాధానమైతే లేదు. వాటిల్లో ఒక అభిప్రాయం... అలాంటి రాజకీయ నాయకులు తమ నియోజక వర్గాలకు కావలసినవన్నీ చేసిపెడుతుంటారని; అలాగే వారి నేర్పరితనం, రాజకీయ చలనశీలత వారిపై వ్యతిరేకతను కాక, ప్రజల మన్ననను పొందేలా చేస్తోందని! కానీ ఆ అభిప్రాయాలు సరైనవని అనిపించేవి కావు. సాకులు లేదా, అనుకూల వాదనలు. లేదంటే నిలబడని సమర్థింపులు.

చివరికి చెప్పొచ్చేదేమంటే, లోపం మనలో ఉన్నదే కానీ, మన తలరాతలో ఉన్నది కాదు. తెలిసే మనం ఇలాంటి నాయకులకు, తమ స్వార్థం కోసమే తప్ప మరింత గొప్ప లక్ష్యాలకు, గొప్ప ప్రజా ప్రయోజనాలకు కట్టుబడి ఉండని వారికి – వాళ్లెప్పుడైనా ప్రజలకు కొంత మేలు చేస్తే చేసి ఉండొచ్చుగాక – ఓటు వేస్తాం. అది కొనసాగినంత కాలం భారతదేశ నితీశ్‌కుమార్‌లు మన రాజకీయాలను స్వేచ్ఛగా నడిపిస్తూనే ఉంటారు. మన భవిష్యత్తును కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

క్షీణతకు నాంది



భారత్ ఒకప్పుడు గొప్ప సముద్ర వాణిజ్యం కలిగివుంది. 'కుట్టిన ఓడల్లో' మనం అరేబియా, ఆగ్నేయాసియా ప్రయాణించాం. కానీ ఎప్పుడైతే బ్రాహ్మణులు 'సముద్ర యానం' వల్ల కుల బహిష్కరణ జరుగుతుందని ధర్మశాస్త్రాల్లో ప్రకటించారో అప్పట్నుంచీ సముద్ర వ్యాపారం క్షీణించింది. సముద్రయానం చేసి వచ్చిన దురాక్రమణదారుల చేతిలో ఓడిపోయాం.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

మరింత ప్రయోజనం



అంత పెద్ద ఆలయాలు ఎందుకు? మళ్లీ అదే ప్రశ్న. నేను ఇప్పుడూ ఇచ్చే జవాబు: అంత పెద్ద మాల్స్, విమానాశ్రయాలు ఎందుకు? 'మాల్స్, విమానాశ్రయాలు జనానికి ఉపయోగం, వాటివల్ల బిజినెస్ జరుగుతుంది'. 'ఆలయాల వల్ల కూడా జనానికి ఉపయోగమే. అలాగే క్యాష్ ఫ్లో అవుతుంది, ఇంకా మంచి మార్గంలో'!

– స్వామి సమర్పణానంద, ఆధ్యాత్మిక గురువు

వాళ్లను మించి...



మహిళలు మరింత దయాపూరితంగా, హింసకు దూరంగా ఉంటారని అనుకోవడం నా అమాయకత్వం. ఒక మహిళగా ఉండటం అంటే ఏమిటో తెలియజెప్పిన మా అమ్మలాంటి మహిళలు అరుదైపోతున్నారు. ఇప్పటి సాధికార మహిళలు పిచ్చి స్త్రీవాదపు ఉత్పత్తుల్లా మారిపోయి, దుర్గుణాల్లో పురుషులను మించి పోతున్నారు. పురుషుల మంచి లక్షణాలను స్వీకరించేవారు కొందరే ఉంటున్నారు.

– మధు పూర్ణిమా కిశ్వర్, రచయిత్రి

మగవాళ్ల తీరు



మహిళల పట్ల జరిగే అసభ్య ప్రవర్తనలకు సంబంధించి తమ మగ స్నేహితులను ఎదుర్కోవడంలో చాలామంది మగవాళ్లు పిరికివాళ్లలా వ్యవహరిస్తారు. ఎందుకంటే, వాళ్ల దృష్టిలో మహిళల భద్రత కన్నా, మగవాళ్ల సమ్మతికి విలువ ఎక్కువ.

– జెన్ని, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కంటికి కూడా బాగుండాలా?



డాక్టర్లు, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్‌ను తీసుకునేటప్పుడు కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ విద్యార్హతలతో పాటు చూపులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాయని ఒక డాక్టర్ స్నేహితురాలు నాతో క్యాజువల్‌గా చెప్పింది. అది వికారం, మన పద్ధతి కాదని ముందయితే కొట్టేశాను. కానీ ఇప్పుడాలోచిస్తుంటే అందులో కొంతైనా నిజం ఉందేమో అనిపిస్తోంది.

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

ఇన్ బాక్స్

ప్రోగ్రామ్ డివిజన్ శాపగ్రస్థమయిందా?

ప్రసార భారతి వచ్చినప్పటి నుండి 'కార్యక్రమ' విభాగం తన తేజో ప్రభను కోల్పోతూ ఉంది. కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్లు 'ఆకాశ దర్శన్'ల కార్యక్రమ విభాగం దీన, హీన స్థితికి అనేక కారణాలు. నిచ్చెన మెట్ల సమాజంలో ఎన్ని దొంతరలు ఉన్నాయో అంతకంటే మిన్నగా ఈ విభాగంలో ఉండటం కూడా ఒక వాస్తవం. దీనితో వీరిలో ఒకరంటే ఒకరికి పడదు. బొమ్మకు శబ్దం అంటే చిన్న చూపు. అసలు ప్రసార భారతి జననంతోనే కార్యక్రమ హననం ప్రారంభమయింది. అగర్వాల్ కమిషన్ నుంచి ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కమిషన్ దాకా ఇచ్చిన సూచనలూ, ఆ తరువాత చట్టసభల సభ్యుల, ఆ యా రంగాల్లోని నిష్ణాతుల అభిప్రాయాలను ఎవ్వరూ పట్టించుకోలేదు.

న్యూస్ డివిజన్ మొదలుకుని కెమెరా డివిజన్ వరకు అందరూ కార్యక్రమ డివిజన్‌లో వాటా సాధిస్తూ భాగస్వాములు కావటం విశేషం. ప్రోగ్రామ్ డివిజన్ మీద కనీస అవగాహన లేకుండా, శాసిస్తూ, నియంత్రిస్తూ, ఆధిపత్యం చేయటం ఇక్కడే సాధ్యం. ప్రసార భారతిలో ఇంజనీరింగ్ డివిజన్ ఎప్పుడూ పెద్దన్నే. వర్తమాన ప్రభుత్వ రంగ ప్రసార మాధ్యమాల చరిత్ర చూస్తే ప్రసార మాధ్యమాలకి ఆయువు పట్టు అయిన కార్యక్రమ విభాగం బలి పశువుగా మారి తన ఉనికిని కోల్పోయే స్థితికి నెట్టివేయబడిందని బోధపడుతుంది. ఇప్పటికీ వీరి రోదన అరణ్యరోదన గానే ఉండటం అత్యంత బాధాకరం.

ప్రమోషన్స్ లేక, తోటి డివిజన్లతో పోటీ పడలేక కునారిల్లటం నేటి నిజం. మరో వైపు గతంలో కంటే ప్రోగ్రామ్ డివిజన్ మీద పని ఒత్తిడి పెరిగింది. బడ్జెట్‌లో ప్రోగ్రామ్ వాటాలో కోతలు, కొత్త కొత్త నియమ నిబంధనలు నియంత్రణ పరిస్థితిని మరింత అధ్వాన్నంగా మారుస్తున్నాయి. ఇన్ని విపరీత ధోరణుల మధ్య ఉన్న అతి కొద్ది మంది కూడా పదవీ విరమణ సమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడటం శుభపరిణామం కాదు.

తెలుగు రాష్ట్రాలలోని దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాలలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను చూసినా పరిస్థితి బోధపడుతుంది. పాము తన పిల్లలను తాను తిన్నట్లు ప్రోగ్రామ్ విభాగం స్వర్ణ యుగంలోని పెద్దలు స్వార్థపూరితంగా స్వప్రయోజనాల కోసమే పని చేయటం కూడా ఈ డివిజన్‌ను కోలుకోలేని దెబ్బతీసిందంటారు కొందరు. ఇక ఇప్పటి ప్రసార భారతిలోని కొత్త తరం త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. అడకత్తెరలో పోకచెక్కలా ఇరుక్కున్నారు. ముందుకు పోలేక వెనుకకు రాలేక తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

– వలేటి గోపీచంద్, విశ్రాంత కార్యక్రమ నిర్వాహకులు, ఆకాశవాణి

ఓ తెనాలి – తత్ దిన పత్రిక

సందర్భం



పి. విజయ బాబు

ఆ పత్రిక కార్యాలయం అంతా సందడి సందడిగా ఉంది. ఇన్‌చార్జి క్యాబిన్‌లో నుంచి పొగలు సెగలు వస్తున్నాయి.

బయట డెస్క్‌లో జర్నలిస్టు ధర్మారావు దిగాలుగా కూర్చుని ఉన్నాడు. అతని సహచరుడు లోకనాథం అతని దగ్గరకు వచ్చి, 'ఏం బ్రదర్ డల్‌గా ఉన్నావ్? క్యాబిన్ నుంచి పొగలు సెగలు వస్తున్నాయి. బాస్ ఏమైనా తిట్టాడా?' అని అడిగాడు. 'అంతేగా?' అన్నాడు.

'ఎందుకయ్యా! రోజూ ఇలా. ఒకప్పుడు నువ్వు రాసే ఐటమ్స్ అంటే ఇటు పత్రికలోను అటు జనంలోనూ ఎంత హాట్ హాట్‌గా ఉండేవి? అంత చేయి తిరిగిన జర్నలిస్టువి, కాస్త మనసు కూడా చంపుకొని మసాలా వార్తలు రాశావనుకో! నీ అనుభవానికి ఆ మసాలా తోడైతే వేడి వేడి మిరపకాయ బజ్జీల్లా ఉండవా నీ ఐటమ్స్? ఎందుకయ్యా! జర్నలిజం విలువలు, తొక్కా అంటూ నిన్ను నువ్వే పనిష్ చేసుకుంటావు? మనకు కావలసింది జీతం, ప్రశాంతంగా ఉండటం. సమాజం, నైతికత, బాధ్యత అంటూ పనికి మాలిన బిల్డప్పులు ఎందుకు? నేను రోజూ ఇలా చెబుతూనే ఉంటాను, నువ్వు మాత్రం మనసు మార్చుకోక తిట్లు తింటూనే ఉంటావు. ఇంతకీ అసలు ఏం జరిగింది?' అడిగాడు లోకనాథం.

'గాంధీనగర్‌లో ఒక మానవీయ కోణానికి సంబంధించి మంచి స్టోరీ రాశాను. అది తీసుకెళ్లి ఇస్తే నా మొహం మీద విసిరేసి, ఇప్పుడు ఈ స్టోరీలు ఎవడికి కావాలి? ఆ రోజులు పోయాయని ఎన్నిసార్లు చెప్పను? ఇప్పుడు కావాల్సిందంతా స్పైసీ... 'సాగర సంగమం' సినిమాలో స్టెప్పులు కావాలి... ఆవృతాలు, ఆవులు, గేదెలు ఎవడికి కావాలి అన్నట్టుగా, నామీద ఇంత ఎత్తున ఎగిరేడు' గద్గద స్వరంతో చెప్పాడు ధర్మారావు. 'మరి నేను చెప్పేది అదే. తెలివితేటలు ఉండగానే సరిపోదు. కాస్తంత లౌక్యం కూడా కావాలి బతకాలంటే. సరే సరే నాకు టైం అయిపోతుంది' అంటూ లోకనాథం కేబిన్ తలుపు తీసుకొని లోపలికి వెళ్లాడు.

పొగలు సెగలు కక్కుతున్న ఇన్‌చార్జి చింపిరి జుత్తుతో సిగరెట్ల మీద సిగరెట్లు తాగుతూ కనిపించాడు. 'రావయ్యా రా! నీ కోసమే చూస్తున్నా. బ్యానర్ స్టోరీ రెడీ అయిపోయింది. సెకండ్ ఐటమ్ ఏం వేద్దామా అని చూస్తున్నాను. టైం అయిపోతూ ఉంది. ఇంకా ఏం డిసైడ్ కాలేదు. నువ్వేమైనా వండుకొచ్చావా?' ఆత్రంగా అడిగాడు ఇన్‌చార్జి.

'మీరేం కంగారు పడకండి సార్! నేను ఉన్నాగా? చిల్లీస్ చికెన్, చికెన్ 65, చైనీస్ నూడుల్స్... ఏమైనా సరే అరగంటలో వండి వార్చేస్తా? ఇప్పుడు మన పత్రికతో ఏ డ్రైనేజీ గానీ, మూసీ నది గానీ పోటీ పడలేవు. మీకెందుకు కంగారు? ఇదిగోండి ఇది చూడండి. ఇది నా వంటకం కాదు గాని ఒక తెనాలి అవాకులు చవాకులు. భలే గమ్మత్తుగా ఉన్నాయి ఆరోపణలు' అంటూ చేతిలో ఉన్న ప్రింట్ అవుట్ అందించాడు.



సీరియస్‌గా ఐటెం చదవడం మొదలు పెట్టాడు ఇన్‌చార్జి.

హెడ్డింగ్ చూశాడు: 'సజ్జలకే 140 కోట్లు.'

* 'ప్రభుత్వ సలహాదారులకు 680 కోట్లు వ్యయం.

* 89 మంది సలహాదారులకు అంత ప్రజాధనం వెచ్చించడం అవసరమా?

* నాదెండ్ల మనోహర్ ధ్వజం

ఇన్‌చార్జి ముఖంలో టెన్షన్ చెరిగిపోయి పెదాల మీద చిరునవ్వు మొదలైంది.

'ఇదీ ఐటమ్ అంటే.. ధర్మారావు గాంధీనగర్‌లో పేదల బతుకులు అది ఇది అంటూ చెత్త ఐటమ్ తెచ్చాడయ్యా! దాంతో నా మూడంతా పాడైపోయింది. ఇదీ మసాలా అంటే. అవును గానీ మనలో మాట, ఒక్క సజ్జలకే 140 కోట్లు అంటాడు ఏంటయ్యా?

సలహాదారులకి 680 కోట్లా? అసలు అంత బడ్జెట్టే లేదు కదయ్యా!

ఈ తెనాలి బుర్రేమైనా చెడిపోయిందా? లేదంటే లోకేష్‌కి పోటీగా తయారవుదాం అనుకుంటున్నాడా?' అడిగాడు ఇన్‌చార్జి.

''అదేం కాదు సార్! తెనాలి నుంచి పోటీ చేయాలనుకుంటున్నాడు. తెనాలిలో తనకు టిక్కెట్ వస్తుందో రాదో అనేది ఒక టెన్షన్. తీరా టికెట్ దక్కించుకున్నా అసమ్మతి సెగతో మళ్ళీ ఓడిపోతానేమో అని భయం పట్టుకుంది. దాంతో పూర్తిగా 'తెనాలి' అయిపోయాడు. అందుకే ఏది పడితే అది మాట్లాడుతున్నాడు.''

'నిజమేనయ్యా! కానీ ఐదేళ్లకి కోటీ నలభై లక్షలు కాబోలు. దాన్ని అర్థం చేసుకోలేక 140 కోట్లనేసినట్టున్నాడు. బడ్జెట్లో లేని డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? పైగా సలహాదారులు ఉన్నది 46 మందేగా 89 మంది ఎక్కడి నుంచి వచ్చారు? ఓకే... నువ్వే చెప్పావుగా? అతగాడు మైండ్ చెడి తెనాలి అయిపోయాడని. సరే ఏదైతే అదవుతుంది? ఈరోజు మనకి చికెన్ 65 లాంటి మసాలా స్టోరీ దొరికింది. పాఠకులు ఇవన్నీ ఎక్కడ పట్టించుకుంటారు? మన పత్రికకు ఇంగువ కట్టిన గుడ్డ లాంటి ఇమేజ్ ఉండనే ఉందిగా! బాస్ అయితే హ్యాపీ ఫీల్ అవుతాడు. తిట్టుకుంటే జనాలు 'తెనాలి'ని తిట్టుకుంటారు. సరే సరే నువ్వు మాత్రం ఈ మూడు నెలలు మూసీ నది మన పేపర్‌ని చూసి కుళ్లుకునేంత మురుగు స్టోరీలు ఇవ్వాలి సుమా!' అంటూ స్టోరీకి రంగులు హంగులు అద్దే పనిలో పడ్డాడు ఇన్‌చార్జి. 'తప్పకుండా సార్! ఇక నేను వస్తా' అంటూ లోకనాథం క్యాబిన్ తలుపు తీసుకొని చిద్విలాసంగా నవ్వుకుంటూ బయటకు వచ్చాడు. ఒక మూల దీనంగా కూర్చున్న సిసలైన జర్నలిస్టు ధర్మారావు వైపు జాలిచూపు విసిరేసి, 'బాబుని చూసైనా నేర్చుకోడు జాబు నిలబెట్టుకోవాలని ఆలోచించడు' అని తనలో తను సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

చిత్త శాంతి

వ్యాసుడు లోక కల్యాణం కోసం, సమస్త మానవాళికి సుబోధకంగా ఉండేటట్లు మహా భారతాన్ని రచించాడు. ప్రజలు తెలుసుకోదగిన జ్ఞానమంతా భారతంలోనే ఉందని పెద్దలు చెబుతారు. అంత గొప్ప గ్రంథాన్ని రచించి కూడా వ్యాసుడు చాలా అసంతృప్తినీ, అశాంతినీ అనుభవించాడు. తన అశాంతికి కారణమేమిటా అని ఆలోచిస్తుండగా అక్కడికి నారదుడు వస్తాడు.

నారదుని చేతిలో ఉండే మహతి అనే వీణ నుంచి నారాయణ నామం నిరంతరం ధ్వనిస్తూ ఉంటుంది. ఆయన నోటి నుండి వెలువడే హరి నామ సంకీర్తనా అమృత ప్రవాహంలో యోగులు పరవశించి పోతారు. అటువంటి నారదుడు విచారంగా ఉన్న వ్యాసుని చూసి కారణం అడుగుతాడు. వ్యాసుడు తనకు కలుగుతున్న అశాంతిని గురించి చెప్పి, కారణం చెప్పమంటాడు. అప్పుడు నారదుడు, 'నువ్వు నీ గ్రంథంలో విష్ణు కథలు కొంచెం మాత్రంగానే చెప్పావు. సమగ్రంగా చెప్పలేదు. వాసుదేవుని గుణగణాలు అందంగా వర్ణించి చెప్పాలి. హరినామ సంకీర్తన ప్రధానంగా చెయ్యకపోవటమే నీ మనసులో కొరతకూ, అశాంతికీ కారణం. మానవులందరి భవబంధ విముక్తి కోసం భగవంతుని లీలలు హృద్యంగా వర్ణించు. జనుల వ్యధలు తొలగించు. ఈ విశ్వమంతా విష్ణుమయం. శ్రీహరి లీలావతారాలలోని విక్రమ విశేషాలను వర్ణించు. నీకు చిత్తశాంతి లభిస్తుంది' అని చెబుతాడు.



జ్యోతిర్మయం

అప్పుడు వ్యాసుడు ఆశ్రమానికి వెళ్లి తన చిత్తంలో భగవంతుని దర్శించాడు. ఏ మహా గ్రంథాన్ని విన్నంత మాత్రాన లౌకికమైన సంసారబంధాలపై విరక్తి కలిగి మాధవునిపై అచంచలమైన భక్తి ఆవిర్భవిస్తుందో అటు వంటి మహా గ్రంథాన్ని... భక్తుల పాలిట కల్ప వృక్షమైన మహా భాగవతాన్ని రచించాడు. చిత్తశాంతి పొందాడు.

భాగవతం చదివే, వినే సహృదయ భక్తులకు చిత్త శాంతి లభిస్తుంది. ఇది సద్యో ముక్తిదాయక గ్రంథం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.దశమి ప.12.40 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ రా.3.47 వరకు, తదుపరి మూల, వర్జ్యం: ఉ.9.16 నుండి 10.54 వరకు, దుర్ముహూర్తం: ప.12.35 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.36 వరకు, అమృతఘడియలు: సా.6.56 నుండి 8.32 వరకు ; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 5.53.

క్లుప్తంగా...


ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూన్యాయ శిబిరాలు

- లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్



పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో ఈ నెల 7, 8 తేదీల్లో, ఇదే మండలంలోని బొమ్మకల్లులో 16, 17 తేదీల్లో లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో భూన్యాయ శిబిరాలను నిర్వహించనున్నారు. అలాగే 12, 13 తేదీల్లో జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో న్యాయ శిబిరాలను నిర్వహించనున్నారు. భూ సమస్యలను క్రోడీకరించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి లీఫ్స్ సంస్థ ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ధరణి పోర్టల్ సమస్యలపై అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన కమిటీలో సభ్యులైన నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్, లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు ఎం.సునీల్ కుమార్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ నేత కోదండరెడ్డి భూ సమస్యల సాధనకు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా సంబంధిత తేదీల్లో శిబిరాలకు చేరుకొని దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ నిపుణులు, న్యాయవాదుల ద్వారా రైతులకు న్యాయ సేవలు అందించడానికి తమ సంస్థ సహకారం అందిస్తుందని వెల్లడించారు.

వీఆర్వోల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసి భూఅక్రమాలకు పాల్పడాలన్న ఉద్దేశంతోనే గత ప్రభుత్వం వ్యవహరించిందని ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ వీఆర్వోల జేఏసీ ఆదివారం గాంధీభవన్‌లో కోదండరెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించింది. ఇతర శాఖల్లో విలీనమైన వీఆర్వోల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వానికి సూచించాలని కోదండరెడ్డిని కోరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు కోల్పోయిన ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా వారి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పనిచేయాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కోదండరెడ్డిని కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, కోచైర్మన్ సురేశ్‌బాబు, నేతలు పల్లెపాటి నరేశ్, ప్రతిభ, పగిళ్ల వెంకన్న, రాజమల్లు, శ్రీహరినాయక్, రామస్వామి, ప్రభు, బాలాజీ, మధు, విజయ్ తదితరులున్నారు.

మద్యం కోసం ముగ్గురు స్నేహితుల ఘర్షణ

- ఒకరిపై కత్తితో దాడి చేసిన మరో యువకుడి తల్లి
- నిజామాబాద్ నగరంలో ఘటన

ఖలీల్‌వాడి(నిజామాబాద్): ముగ్గురు స్నేహితుల మధ్య మద్యం విషయంలో జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఆదివారం రాత్రి నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్‌లో ఈ ఘటన జరిగింది. ఓ యువకుడిపై మరో యువకుడి తల్లి కత్తితో దాడి చేసింది. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గౌతంనగర్‌కు చెందిన పవన్, స్నేహితులైన చందు, చిన్ను ఆదివారం రాత్రి ఒకచోట చేరారు. మద్యం తాగించాలని పవన్‌ను చిన్ను, చందు అడిగారు. ఈ విషయంలో మాటామాట పెరిగి గొడవ జరిగింది. పవన్‌పై ఆ ఇద్దరు స్నేహితులు కలిసి దాడి చేశారు. దీంతో గాయపడిన పవన్ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం చిన్ను, అతడి తల్లి రేణుక, చందు ముగ్గురు కలిసి పవన్ ఇంటికి వెళ్లి మరోసారి గొడవ పడ్డారు. రేణుక వెంట తెచ్చుకున్న కత్తితో పవన్‌ను పొడిచింది. పవన్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పవన్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రహదారి భద్రతపై బైక్ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గచ్చిబౌలి స్టేడియం నుంచి హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ ప్రవీణ్‌రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హెల్మెట్ బైక్ ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ద్విచక్రవాహనదారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన చాలా సందర్భాల్లో హెల్మెట్ ధరించిన వాళ్లు ప్రాణాలతో బయటపడినట్లు ఆయన గుర్తు చేశారు. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. రహదారి భద్రతా నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని ప్రవీణ్‌రావు సూచించారు. ఈ బైక్ ర్యాలీలో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు విజయ్‌రావు, సురేందర్‌రెడ్డి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి పోటెత్తిన భక్తులు



ములుగు జిల్లా మేడారంలోని శ్రీ సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. మహా జాతరకు ఇంకా 17 రోజులు మిగిలి ఉండగానే భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించడానికి పోటెత్తుతున్నారు. ఆదివారం ఒక్క రోజే 3 లక్షల మందికి పైగా వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. జనం కిక్కిరిసి పోవడంతో ఉదయం 5 గంటలకే గద్దెలకు తాళం వేశారు. హనుమకొండ నుంచి మేడారానికి 60 ఆర్టీసీ బస్సుల్లో 5 వేల మంది చేరుకున్నారు.

– ఎస్ఎస్ తాడ్వాయి

పల్లె కడుపున రాచపుండు!

- కామారెడ్డి జిల్లా మద్దికుంటను వెన్నాడుతున్న కేన్సర్ వ్యాధి
- గ్రామంలో 20 మందికిపైగా బాధితులు
- మూడేళ్లలో 12 మంది మృత్యువాత..
- చికిత్స పొందుతున్న మరికొందరు.. ఖర్చు భరించలేక అవస్థలు
- సర్వైకల్, బ్రెస్ట్, ఊపిరితిత్తుల కేన్సర్లతో అవస్థలు



మద్దికుంట గ్రామ ముఖచిత్రం

సాక్షి, కామారెడ్డి: కేన్సర్ వ్యాధి రాచపుండులా మారి పల్లెల్ని వణికిస్తోంది. ఏమవుతోందో తెలుసుకునే లోపే ప్రాణాలను కబళిస్తోంది. కుటుంబాలను వీధిపాలు చేస్తోంది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామం కొన్నాళ్లుగా కేన్సర్‌తో అల్లాడుతోంది. గత మూడేళ్లలోనే ఇక్కడ పన్నెండు మంది కేన్సర్‌తో చనిపోయారని.. మరో పది మందికి పైగా చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు చెప్తున్నారు. ఈ వ్యాధి బారిన పడుతున్న వారిసంఖ్య మరింతగా పెరుగుతుండటం ఆందోళన రేపుతోంది. కొందరు బాధితులు మానసికంగా, శారీరకంగా దెబ్బతిని జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా కేన్సర్ బారినపడుతున్నారు. ఒక్క ఊరిలోనే ఇంతమంది కేన్సర్ బాధితులు ఉండటం ఆందోళన రేపుతోంది.

వరుసగా మరణాలతో కలవరం

మద్దికుంట గ్రామానికి చెందిన భారతి అనే మహిళ మూడేళ్ల కింద కేన్సర్ బారినపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. తర్వాత ప్రమీల, లక్ష్మి, భూమవ్వ, భాగ్య, రాజవ్వ.. ఇలా మూడేళ్లలో పది మందికిపైగా కేన్సర్ బారినపడి చికిత్స పొందుతూ చనిపోయారు. వీరిలో కొందరు రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) కేన్సర్‌తో చనిపోయినట్టు గ్రామస్తులు చెప్తున్నారు. ఐదారుగురు మగవారు ఊపిరితిత్తుల (లంగ్స్) కేన్సర్, నోటి కేన్సర్లతో మరణించారు. మరి కొందరు చికిత్స పొందుతున్నారు. ఓ మహిళకు రొమ్ము కేన్సర్ సమస్య తీవ్రం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేసి ఆ భాగాన్ని తొలగించారు. మరో మహిళ ఇదే సమస్యతో చికిత్స పొందుతోంది. ఇంకో ఇద్దరు మహిళలు సర్వైకల్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. అయితే పొరుగువారు, గ్రామస్తులు ఎలా స్పందిస్తారో, తమను ఎక్కడ దూరం పెడతారోనన్న ఆందోళనతో బాధితులు తాము కేన్సర్ బారినపడ్డ విషయాన్ని బయటికి వెల్లడించడం లేదు.

గ్రామస్తుల్లో ఆందోళన

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు అప్పటి కలెక్టర్ యోగితారాణా జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో మహిళలకు సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించారు. పదుల సంఖ్యలో బాధితులను గుర్తించారు. చాలా మందికి ఇది ప్రారంభ దశలోనే ఉండటంతో వైద్యం అందించారు. పరీక్షలు చేయించుకోనివారు, చేయించుకున్నా బయటికి చెప్పకుండా ఏవో మందులు వాడుతున్నవారు తర్వాత ఇబ్బందిపడుతున్నారు. ఇలా మద్దికుంటలో ఎక్కువ మంది బాధితులు కనిపిస్తున్నారు. తరచూ గ్రామంలో ఎవరో ఒకరు పెద్దాస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవడం, వారిలో కొందరు చనిపోతుండటం చూసి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేకంగా స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి పరీక్షించాలని.. బాధితులను గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని కోరుతున్నారు.

ఎంతో అవస్థ పడి కోలుకుంటున్నా..

ఏడాది కింద కడుపులో నొప్పి మొదలైంది. ఆర్ఎంపీ వద్ద చూపించుకుని, మందులు వాడినా తగ్గలేదు. కామారెడ్డిలోని ఆస్పత్రికి వెళ్తే.. స్కానింగ్ చేసి కడుపులో కేన్సర్ సమస్య ఉందని చెప్పి హైదరాబాద్‌కు పంపించారు. బసవతారకం ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాను. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. మొన్నటి దాకా కెమో థెరపీ చేశారు. ఏడాది పాటు ఎంతో అవస్థ పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. పరీక్షలు, మందులు, రాకపోకలకు రూ.2 లక్షల దాకా ఖర్చయ్యాయి.

– కుమ్మరి లత, మద్దికుంట, కామారెడ్డి జిల్లా

కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాం

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) గురించి అవగాహన కల్పించేందుకు తరచూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆయా వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఎవరికైనా ఇబ్బంది ఉందని తెలిస్తే తగిన వైద్యసేవలు అందిస్తున్నాం. ఇటీవల దోమకొండ, భిక్కనూరులలో క్యాంపులు నిర్వహించాం. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పాలియేటివ్ థెరపీ ఏర్పాటు చేశాం. ఆరు బెడ్లతో సేవలు అందిస్తున్నాం. మద్దికుంటకు సంబంధించిన కేసులను పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కామారెడ్డి

బాబ్రీమసీదు కూల్చివేత నేరస్తునికి భారతరత్నా?

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపాటు
- ముగిసిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు



సాక్షి, హైదరాబాద్: బాబ్రీ మసీదు కూల్చివేతలో నేరస్తునిగా ఉన్న అద్వానీకి భారతరత్న ఇవ్వడంపై సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. హైదరాబాద్ మగ్దూంభవన్‌లో మూడు రోజులపాటు జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సమావేశంలో చర్చించిన విషయాలు, తీర్మానాలు తదితర అంశాలను ఆదివారం సీపీఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పండా, కె.నారాయణ, సయ్యద్ అజీజ్, లోక్‌సభాపక్ష నేత బినాయ్ విశ్వం, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి రాజా మీడియా సమావేశంలో వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరోసారి గెలుపొందితే దేశానికి విపత్తేనని, ఈ విపత్తు నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజా అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు సాధ్యమైనంత త్వరగా సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసుకుని, బీజేపీని ఓడించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ఆ ప్రభుత్వ పాలసీలను విమర్శించడం ప్రతిపక్ష హక్కు అని, కానీ మోదీ, బీజేపీ ప్రతిపక్షమే ఉండకూడదని భావిస్తోందని ఆరోపించారు. రానున్న లోక్ ఎన్నికలకు తాము సన్నద్ధమవుతున్నామని, ఇండియా కూటమి కామన్ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందిస్తుందని, అదే సమయంలో తమ పార్టీ తరపున మేనిఫెస్టోను రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో ఇండియా కూటమి నేతలు గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక నియోజకవర్గాలు ఉన్నప్పటికీ రాహుల్ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించే కేరళలో పోటీచేయడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీని ఓడించేందుకు దేశవ్యాప్తంగా ఇండియా కూటమి పనిచేస్తున్న నేపథ్యంలో కేరళలో రాహుల్ పోటీ చేయడం ఆరోగ్య వాతావరణం కాదన్నారు. కాగా, రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సీపీఐ జాతీయ సమితి ఎన్నికల మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్ కౌర్, డాక్టర్ బి.కె.కంగో, నాగేంద్రనాథ్ ఓజా, జాతీయ కార్యవర్గ సభ్యులు అనీరాజా, రాజ్యసభ సభ్యులు పి.సంతోష్ కుమార్‌లను ఈ కమిటీ సభ్యులుగా నియమించారు.

పాలస్తీనాకు సంపూర్ణ మద్దతు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలస్తీనాకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇజ్రాయిల్ చేసిన జాతి అహంకార దాడుల వల్ల వేలాది మంది పాలస్తీనా ప్రజలు మరణించారని అవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో సంఘీభావ సభ జరిగింది. ముఖ్య వక్తగా పాల్గొన్న డి.రాజా మాట్లాడుతూ.. అమెరికా సామ్రాజ్య వాదం యూరోపియన్ సెక్యూలర్ దేశాలు ఇస్తున్న ప్రోత్సాహంతోనే ఈ మారణ హోమం జరుగుతుందని అన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య యుద్ధం ప్రారంభమైన తరువాత మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిందని కానీ తమ పార్టీ మాత్రం పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలబడిందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్టు

నాగోలు(హైదరాబాద్): అక్రమంగా నగరంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32,500 విలువైన 1.30 గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నల్గొండ జిల్లాకు చెందిన గజ్జి సాయి శ్రీకాంత్(21), మన్సూరాబాద్‌కు చెందిన ధనుంజయ్(19), జగిత్యాల్‌కు చెందిన హర్షన్(21) మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మల్లికార్జున్(20)లు కలిసి గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. సాయి శ్రీకాంత్, ధనుంజయ్‌లు గంజాయిని తీసుకువచ్చి ఎల్‌బీనగర్ ప్రాంతంలో అమ్ముతున్నారు. శనివారం రాత్రి మాన్సూరాబాద్, హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకున్నారు. గంజాయి విక్రయిస్తుండగా ఎల్‌బీనగర్ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు.

19 ఏళ్లక్రితం చొరబడి

ఇప్పుడు పట్టుబడ్డారు

- భారత్‌లోకి అక్రమంగా చొరబడిన ఐదుగురు బంగ్లాదేశీయులు
- విశ్వసనీయ సమాచారంతో నలుగురిని అరెస్టు చేసిన ఖమ్మం పోలీసులు
- తప్పుడు సమాచారంతో ఆధార్, పాన్ కార్డులు, పాస్‌పోర్ట్ పొందిన వైనం

ఖమ్మం క్రైం : 19 ఏళ్ల క్రితం భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి, తమకు తెలిసిన వారి ద్వారా ఖమ్మం చేరుకుని, ఇక్కడే నివాసం ఉంటున్న నలుగురు బంగ్లాదేశీయులను ఖమ్మం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లోని శ్యామ్‌కుర్ యూనియన్‌లోని జెన్నైడ జిల్లా, మహేష్‌పూర్ సబ్ జిల్లా డకాటియా గ్రామానికి చెందిన శాగురి ఖాటూన్ అలియాస్ శిల్ప అనే మహిళ 19 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా కోల్‌కతాకు, అక్కడి నుంచి ముంబైకి చేరుకుంది. ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన బోడ రాములుతో ఆమెకు ముంబైలో పరిచయం ఏర్పడగా ఇరువురూ సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం వచ్చి శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్నారు. ఖాటూన్ సోదరులైన మహమ్మద్ నూర్‌నబీ అలియాస్ షేక్ నూర్‌నబీ, మహమ్మద్ సాగర్ అలియాస్ బోడ సాగర్‌తో పాటు ఆమె దూరపు బంధువు షేక్ జమీర్ అలియాస్ మహ్మమద్ జమీర్ కూడా భారత్‌కు వచ్చి ఖమ్మంలోనే ఉంటున్నారు. ఆధార్ కార్డులు ఇస్తున్న సమయంలో ఖమ్మం వర్తక సంఘ భవనంలో తప్పుడు సమాచారం అందించి వీరంతా ఆధార్, పాన్ కార్డులు, పాస్‌పోర్టులు పొందారు. ఆరేళ్ల క్రితం మహ్మమద్ అమినూర్ మండల్ అనే వ్యక్తిని సైతం ఖమ్మం తీసుకురాగా..అతడు స్థానికంగా సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. వీరంతా భారత్‌కు చెందిన వారినే వివాహాలు సైతం చేసుకుని ఖమ్మంలోనే జీవనం కొనసాగిస్తున్నారు. కాగా, పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఖమ్మం సీపీ సునీల్‌దత్ విచారణ చేయగా, ఈ వ్యవహారం అంతా బయటపడింది. దీంతో మహమ్మద్ నూర్‌నబీ అలియాస్ షేక్ నూర్‌నబీ, మహమ్మద్ సాగర్ అలియాస్ బోడ సాగర్, షేక్ జమీర్ అలియాస్ మహ్మమద్ జమీర్, మహ్మమద్ అమినూర్ మండల్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టుకు రిమాండ్ చేశారు. కాగా, ముందుగా దేశంలోకి అక్రమంగా చొరబడిన ఖాటూన్‌ను మాత్రం పోలీసులు వదిలేయడం గమనార్హం.



ఎస్సీ బాలికల హాస్టల్ భవనం వద్ద ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, వివిధ సంఘాల నాయకులు

వారిది ఆత్మహత్య కాదు.. హత్యే

విద్యార్థిని తండ్రి ఆరోపణ • న్యాయ విచారణ జరపాలని డిమాండ్

భువనగిరి క్రైం: ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు టెన్త్ విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం భువనగిరి పట్టణం ఆందోళనలతో అట్టుడికింది. బాలికలది ఆత్మహత్య కాదని హత్యేనని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. అందుకు హాస్టల్ వార్డెన్, ఆటోడ్రైవర్, పీఈటీనే కారణమని, వారిని అరెస్ట్ చేసి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆత్మహత్యపై పోలీసులు ఎస్సీ హాస్టల్‌లో విచారణ చేపట్టారు. 'ఇద్దరిది ముమ్మాటికీ హత్యే, వారు ధైర్యం కలవారు. ఉరేసుకుంటే నాలుక బయటికి రావాలి. అలాంటి ఛాయలు కనిపించలేదు. వైష్ణవి మృతి గురించి హాస్టల్ సిబ్బంది నాకు సమాచారం ఇవ్వలేదు. ఉరేసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నేరుగా చిన్నపిల్లలే వారిని దించడం అనుమానానికి తావిస్తోంది' అని వైష్ణవి తండ్రి గాదె నాగరాజు చెప్పారు. కాగా, మృతుల బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు, పలు పార్టీల ఆధ్వర్యంలో హాస్టల్ ఎదుట, జిల్లా ఆస్పత్రి వద్ద ప్రధాన రహదారిపై ఆందోళనలు నిర్వహించారు.



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, శ్రీసత్యనారాయణవ్రత మండపం, కల్యాణ కట్ట, లక్ష్మీ పుష్కరిణి వంటి ప్రాంతాలతో పాటు బస్టాండ్‌లలో భక్తులు అధికంగా కనిపించారు. యాదాద్రీశుడి ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకోగా.. నిత్యాదాయం రూ.45,01,535 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరుతాం

డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులకు సీఎం రేవంత్ హామీ



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న బొల్లోజు రవి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) అధ్యక్షుడు బొల్లోజు రవి, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండా రామకృష్ణ, స్వామిరెడ్డి తదితరులు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఈ విషయంపై సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనూ చర్చించాలని డీజేహెచ్ఎస్ ప్రతినిధులకు సూచించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన ఈ పదేళ్ల కాలంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం ఒక కలగానే మిగిలిపోయిందని సీఎంకు డీజేహెచ్ఎస్ ఇచ్చిన వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. డీజేహెచ్ఎస్ విన్నపాన్ని మన్నించి మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచారని, అందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జర్నలిస్టుల సొంతింటి కల సాకారమవుతుందన్న విశ్వాసం ఉందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేవలం తెలంగాణ ప్రాంత జర్నలిస్టులతో ఏర్పాటైన ఏకైక సొసైటీ డీజేహెచ్ఎస్ అని, వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న అందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీఎంకు విన్నవించారు.

అంతరిక్ష వీధిలో ట్రాఫిక్ జామ్!

పెనుముప్పుగా ఉపగ్రహ వ్యర్థాలు | వాటి సంఖ్య 24 వేల పై చిలుకే! | 13 వేలదాకా యాక్టివ్ ఉపగ్రహాలు

అంతరిక్ష వీధి ఉపగ్రహాలతో కిక్కిరిసిపోతోంది. అగ్ర రాజ్యాలు మొదలుకుని చిన్నాచితకా దేశాల దాకా కొన్నేళ్లుగా ఎడాపెడా ఉపగ్రహ ప్రయోగాలు చేపడుతున్నాయి. స్పేస్ ఎక్స్ వంటి బడా ప్రైవేట్ ఏజెన్సీలు కూడా వీటికి తోడయ్యాయి. దాంతో అంతరిక్ష ప్రయోగాల సంఖ్య అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతూ వస్తోంది. అలా అంతరిక్షంలో ఉపగ్రహాల సంఖ్యా విపరీతంగా పెరుగుతోంది. దాంతోపాటే ఉపగ్రహ సంబంధిత వ్యర్థాల పరిమాణమూ నానాటికీ పెరిగిపోతోంది. ఈ ధోరణి అంతరిక్ష సంస్థలతోపాటు సైంటిస్టులను ఇప్పుడు బాగా కలవరపెడుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2023లో ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా జరిగిన ఉపగ్రహ ప్రయోగాలెన్నో తెలుసా? ఏకంగా 2,917! అప్పుడెప్పుడో 1957లో అమెరికా తొలిసారిగా స్పుత్నిక్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రయోగించి చరిత్ర సృష్టించింది. అప్పటి నుంచి 1987 దాకా 30 ఏళ్లలో జరిగిన మొత్తం అంతరిక్ష ప్రయోగాల కంటే కూడా ఒక్క 2023లో విజయవంతంగా ప్రయోగించిన ఉపగ్రహాల సంఖ్యే చాలా ఎక్కువట! ప్రస్తుతం అంతరిక్షంలో ఏకంగా 12,930 ఉపగ్రహాలు భూమి చుట్టూ తిరుగుతున్నాయి! ఇవిగాక అంతరిక్షానికి చేరాక విఫలమైనవి, కొంతకాలం పాటు పని చేసి చేతులెత్తేసినవి, కాలపరిమితి తీరి భూమితో లింకులు తెగిపోయినవి కనీసం 24 వేల పై చిలుకే ఉంటాయట! ఇవన్నీ కూడా భూమి చుట్టూ అలా తిరుగుతూనే ఉన్నాయి. మొత్తమ్మీద యాక్టివ్ ఉపగ్రహాలు, వ్యర్థాలూ కలిపి 10 సెంటీమీటర్ల కంటే పెద్ద 'అంతరిక్ష వస్తువుల' మొత్తం సంఖ్య 2023 చివరికల్లా ఏకంగా 37 వేలు దాటిందని గణాంకాలు ఘోషిస్తున్నాయి! అంతకంటే చిన్నవాటి సంఖ్యకైతే అయితే లెక్కాపత్రం లేదు. మొత్తమ్మీద అంతరిక్షంలో ఇలాంటి వ్యర్థాల పరిమాణం 2020 చివరికే 8 వేల టన్నులు దాటిపోయిందట!



వీటితో ప్రమాదాలెన్నో...

ఈ అంతరిక్ష వ్యర్థాలతో ప్రమాదాలు ఇన్నీ అన్నీ కావు...

- భూ కక్ష్యలో తిరుగుతున్న యాక్టివ్ ఉపగ్రహాలను ఇవి ఢీకొనే ముప్పుంటుంది. అదే జరిగితే అత్యంత వ్యయప్రయాసలతో ప్రయోగించిన ఉపగ్రహాల ఆయువు అర్ధాంతరంగా తీరిపోతుంది.
- 1981లో కాస్మోస్ 1275 ఉపగ్రహం ఇలాగే అంతరిక్ష వ్యర్థాలను ఢీకొని పేలిపోయింది.
- 1996లో ఫ్రాన్స్‌కు చెందిన బుల్లి ఉపగ్రహం సెరీస్‌ను కూడా 1986లో పేలిపోయిన ఏరియన్ ఉపగ్రహపు శకలాలు ఢీకొన్నాయి.
- 2006లో రష్యా ఉపగ్రహం ఎక్స్‌ప్రెస్ కూడా గుర్తు తెలియని శకలం దెబ్బకు శాశ్వతంగా మూగబోయింది.
- 2009లో టిరా, 2010లో ఆరా 2013లో జియోస్ వంటి పలు ఉపగ్రహాలు ఇలాగే బుల్లి శకలాల బారినపడ్డాయి.
- 2009లోనైతే 950 కిలోల బరువున్న కాస్మోస్ 2251, 560 కిలోల ఇరీడియం33 ఉపగ్రహాలు పరస్పరం ఢీకొని పేలిపోయాయి. వినువీధిలో రెండు భారీ ఉపగ్రహాలు గుద్దుకోవడం అదే తొలిసారి!
- అంతరిక్ష వ్యర్థాల సంఖ్య ఇలాగే పెరుగుతూ పోతే కొన్నాళ్లకు భూ దిగువ కక్ష్యలోకి ఉపగ్రహాలను పంపడమే అసంభవంగా మారవచ్చు.

ఐఎస్ఎస్‌కూ ముప్పే

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు కూడా ఈ వ్యర్థాలతో పెను ముప్పే పొంచి ఉండటం మరింత ఆందోళనకరం. 2019 నాటికే ఐఎస్ఎస్‌ను 1,400కు పైగా బుల్లి వ్యర్థాలు ఢీకొట్టాయట. వీటి బారినుంచి కాపాడుకునేందుకు షీల్డింగ్ వ్యవస్థ ఐఎస్ఎస్‌లో ఉంది. కానీ ఐఎస్ఎస్ తాలూకు బయటి భాగాలకు మాత్రం ఆ రక్షణ లేదు. పైగా వాటిని వ్యర్థాలు ఢీకొనే ముప్పు మరింత ఎక్కువ! వ్యర్థాలు ఢీకొట్టనున్నాయన్న హెచ్చరికలతో ఐఎస్ఎస్ సిబ్బంది ఇప్పటిదాకా మూడుసార్లు సమీపంలోని సూయజ్ క్యాప్సూల్లోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది!

రోజుకొకటి భూమ్మీద...

- ఈ అంతరిక్ష వ్యర్థాలు కక్ష్య నుంచి జారి క్రమంగా భూ వాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి.
- చిన్నవైతే భూమి దాకా చేరకుండానే గాల్లోనే మండిపోతాయి.
- పెద్దవి మాత్రం భూమిపై పడుతుంటాయి.
- అలా గత 50 ఏళ్లుగా సగటున రోజుకు కనీసం మూడు వ్యర్థాలు కక్ష్య కోల్పోయి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తున్నాయట.
- వాటిలో కనీసం ఒక్కటైనా భూమిపై పడుతూ వస్తోందని గణాంకాలు చెబుతున్నాయి!
- ఓజోన్ పొర దెబ్బ తినేందుకు ఇవి కూడా కారణమవుతున్నాయి.
- పైగా ఈ వ్యర్థాల దెబ్బకు సౌర తుఫాన్లు, కాస్మిక్ రేడియేషన్ బారినుంచి భూమిని కాపాడే మాగ్నెటోస్ఫియర్ కూడా దెబ్బ తింటోందని తాజా అధ్యయనంలో తేలింది.
- ఈ అంతరిక్ష వ్యర్థాల కట్టడికి ఇప్పటిదాకానైతే అంతర్జాతీయంగా ఎలాంటి చట్టం గానీ, దేశాల మధ్య ఒప్పందాలు గానీ లేవు.
- అయితే ఈ దిశగా ఐరాస తాలూకు పీస్‌ఫుల్ యూజెస్ ఆఫ్ ఔటర్ స్పేస్ కమిటీ 2007లో కొన్ని నిర్దేశాలు రూపొందించింది.



ఆదివారం కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, జస్టిస్ సూర్యకాంత్ తదితరులు

పర్యావరణ న్యాయంపైనా దృష్టి

కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సులో రాష్ట్రపతి ● సరిహద్దులు ప్రతిబంధకం కారాదు: అమిత్ షా

న్యూఢిల్లీ: వాతావరణ మార్పులు ప్రపంచానికి పెను సవాలుగా మారుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో పర్యావరణ న్యాయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ కామన్వెల్త్ న్యాయాధికారుల సదస్సును ఉద్దేశించి ఆదివారం ఆమె ఈ మేరకు పిలుపునిచ్చారు. ''భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం గురించి స్పష్టంగా నిర్దేశించింది. ప్రజలకు అవన్నీ దక్కేలా చూడటం మనందరి ఉమ్మడి బాధ్యత. ఈ దిశగా కామన్వెల్త్ దేశాలన్నీ చొరవ తీసుకోవాలి'' అని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయసాధన వంటి అంశాల్లో సరిహద్దులు ప్రతిబంధకంగా మారరాదని అమిత్ షా ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ''నేరగాళ్లకు భౌగోళిక సరిహద్దులేమీ ఉండవు. వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. ఈ నేరగాళ్లకు ముకుతాడు వేయాలంటే దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థలు కూడా పరిమితులను దాటి పని చేయాలి'' అని పిలుపునిచ్చారు.

ఏ అవగాహనా లేదు!

కాంగ్రెస్‌పై మోదీ మండిపాటు

- పూజనీయ స్థలాల గొప్పదనం తెలియదు
- కొన్నేళ్లుగా దేశంలో భక్తి పర్యాటకానికి ఊపు
- దానితో నిరుపేదలకు కూడా మెరుగైన ఉపాధి
- అసోంలో 'కామాఖ్య కారిడార్'కు శంకుస్థాపన

గువాహటి: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన వారికి పూజనీయ స్థలాల గొప్పదనంపై కనీసం అవగాహన కూడా లేకుండా పోయిందంటూ దుయ్యబట్టారు. రెండు రోజుల అసోం పర్యటనలో భాగంగా ఆదివారం రాష్ట్రంలో రూ.11,600 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం గువాహటిలో జరిగిన భారీ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. అసోంలోని కామాఖ్య ఆలయ కారిడార్ సిద్ధమయ్యాక ఈ శక్తి పీఠాన్ని సందర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారన్నారు. ''కామాఖ్య కారిడార్ ఈశాన్య పర్యాటకానికి గేట్‌వేగా మారనుంది. అక్కడి పర్యాటక రంగమంతటికీ ఊపునిస్తుంది'' అని విశ్వాసం వెలిబుచ్చారు. ''ఇలాంటి మహిమాన్విత పూజనీయ స్థలాలెన్నో దేశవ్యాప్తంగా కొలువుదీరాయి. కానీ దశాబ్దాలపాటు దేశాన్నేలిన వారికి వాటి గొప్పదనం గురించిన అవగాహనే లేదు. పైగా వారి స్వార్థ, స్వీయ రాజకీయ లబ్ధి కోసం మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల మనమే సిగ్గుపడే పరిస్థితులు కల్పించారు. తన మూలాలను, గతాన్ని విస్మరించిన ఏ దేశమూ అభివృద్ధి సాధించజాలదు. బీజేపీ పాలనలో గత పదేళ్లలో పరిస్థితులు మెరుగవుతూ వస్తున్నాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను, వారసత్వాన్ని ఘనంగా గుర్తించుకుంటున్నాం. ఒక్క 2023లోనే కాశీకి ఏకంగా 8.5 కోట్ల మంది పర్యాటకులు పోటెత్తారు. ఉజ్జయినిని 5 కోట్లకు పైగా సందర్శించారు. అయోధ్యలో రామాలయం ప్రారంభమైన 12 రోజుల్లోనే పాతిక లక్షల మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు'' అని మోదీ వివరించారు. గత దశాబ్ద కాలంలో ఈశాన్య భారతానికి కూడా పర్యాటకులు రికార్డు స్థాయిలో పెరిగారన్నారు. భక్తి పర్యాటకం వల్ల నిరుపేదలకు కూడా మంచి ఉపాధి దొరుకుతుందన్నారు. ''బీజేపీ కార్యకర్తగా నేను అసోంలో పని చేశా. అప్పట్లో గువాహటిలో రోడ్ల దిగ్బంధం, బాంబు పేలుళ్లు నిత్యకృత్యంగా ఉండేవి. ఇప్పుడదంతా గతం'' అన్నారు. గువాహటిలో పలు మౌలిక రంగ ప్రాజెక్టులను మోదీ ఈ సందర్భంగా ప్రారంభించారు. రూ.498 కోట్ల విలువైన కామాఖ్య ఆలయ కారిడార్‌తో పాటు మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. ఫోర్ లేన్ హైవేలు, మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు తదితరాలు ఇందులో ఉన్నాయి.



ఆదివారం గువాహటిలో జరిగిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

విపాసన.. ఒత్తిళ్లపై దివ్యాస్త్రం: మోదీ

ముంబై: నిరాశలు, ఒత్తిళ్లపై విపాసన ధ్యాన పద్ధతి దివ్యాస్త్రమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ''ప్రపంచానికి ప్రాచీన భారతదేశం అందించిన అత్యుత్తమ కానుకల్లో విపాసన ఒకటి. నేటి ఆధునిక జీవన శైలిలో భాగంగా మారిన ఒత్తిళ్లను దూరం చేసుకోవడానికి యువతతో పాటు అన్ని వయసుల వాళ్లకూ ఇదో చక్కని మార్గం'' అని చెప్పారు. విపాసన బోధకుడు ఎస్.ఎన్.గోయంకా శత జయంత్యుత్సవాలను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. ''విపాసన ధ్యానపద్ధతి ఒక శాస్త్రం. చక్కని వ్యక్తిత్వ వికాస మార్గం. గోయంకా తన జీవితాన్ని సమాజ సేవకు ధారపోశారన్నారు. ''గోయంకా గురూజీతో నాకెంతో సాన్నిహిత్యముంది. ఆయన జీవితం బుద్ధుని స్ఫూర్తితో సాగింది. సమామూహికంగా ధ్యానం చేస్తే అద్భుత ఫలితాలుంటాయని ఆయన నొక్కిచెప్పేవారు. ఆయన కృషి వల్ల 80 దేశాల వాళ్లు ధ్యానం ప్రాధాన్యతను, ఆవశ్యకతను అర్థం చేసుకుని ఆచరిస్తున్నారు'' అని వివరించారు.

చిన్నతనంలో వివక్షకు గురయ్యా: సునాక్



లండన్: చిన్నతనంలో జాతి వివక్షకు గురయినట్లు భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ వెల్లడించారు. ఇంగ్లిష్ ఉచ్చారణలో యాస లేకుండా తన తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. 'చిన్నప్పుడు జాతి వివక్షకు గురయ్యా. నాతోబుట్టువులనుద్దేశించి కొందరు చేసిన వెటకారం, వెక్కిరింపులను ప్రత్యక్షంగా చూశా. ఎంతో బాధేసింది'అని సునాక్ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఇప్పుడు తన పిల్లలు జాతి వివక్షను ఎదుర్కోవడం లేదని అన్నారు. తన భారతీయ వారసత్వం గురించి చెబుతూ సునాక్... ఆకారం, రూపం ఒక అవరోధంగా మారకూడదని తల్లిదండ్రులు తమకు చెప్పేవారన్నారు. భారతీయ తరహా యాస బయటపడకుండా మాట్లాడాలని వారు పదేపదే చెప్పేవారు. మేం మాట్లాడే భాషపై వారు ప్రత్యేకంగా దృష్టి పెట్టేవారు. అలా, సరైన అభ్యాసంతో బ్రిటిష్ యాసను మేం సరిగ్గా అనుకరించ గలిగేవాళ్లం. అది చూసి మా అమ్మ చాలా సంతోషించారు'అని సునాక్ అన్నారు. జాత్యహంకార ధోరణి ఏ రూపంలోనిదైనా ఆమోదం యోగ్యం కాదని రిషిసునాక్ చెప్పారు.

నేటి యువత సామర్థ్యం అద్భుతం

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్



వడోదర: అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ఎన్నో సవాళ్లను పరిష్కరిస్తున్న నేటి యువత సామర్థ్యం చూసి తనకు ఆశ్చర్యం కలుగుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ఓటమిని అభివృద్ధికి బాటగా మలుచుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. జీవితమంటే మారథాన్(సుదీర్ఘ 42 కిలోమీటర్ల పరుగు పందెం) వంటిదే తప్ప 100 మీటర్ల స్ప్రింట్(స్వల్ప దూరం పరుగు పందెం) కాదని ఆయన పేర్కొన్నారు. బరోడా లోని మహారాజా శాయాజీరావ్ యూనివర్సిటీ 72వ వార్షిక స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ఆదివారం జస్టిస్ డీవై చంద్రచూడ్ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ ఏడాది యూనివర్సిటీ ప్రదానం చేసిన మొత్తం 346 బంగారు పతకాల్లో అత్యధికంగా 336 పతకాలు మహిళలు అందుకోవడాన్ని మన దేశం మారుతోందనడానికి నిజమైన గుర్తుగా ఆయన అభివర్ణించారు. 'చరిత్రలో ఇది ఒక ప్రత్యేకమైన సమయం. మునుపెన్నడూ లేనంతగా టెక్నాలజీ నేడు ప్రజలను అనుసంధానం చేస్తోంది. అదే సమయంలో వారిలో భయాలు, ఆందోళనలకు సైతం కారణమవుతోంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త వృత్తులు పుట్టుకొస్తున్నాయి. ఇవి సంప్రదాయ వృత్తులతో సంబంధం లేనివి. వీటిల్లో ఎవరికి వారు తమ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ సమయంలో పట్టభద్రులుగా బయటికి వస్తున్న మీ అందరికీ ఇది ఉత్తేజకర సమయం. అదే సమయంలో అనిశ్చితిని, గందరగోళాన్నీ సృష్టిస్తాయి'అని హెచ్చరించారు.

గిరిజనుల తరఫున పోరాటం: రాహుల్

ధన్‌బాద్: గిరిజన ప్రజలకు నీరు, అడవి, భూమి(జల్-జంగిల్-జమీన్)పై హక్కులను, గిరిజన యువతకు ఉపాధిని కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం ఆయన జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో జరిగిన రోడ్ షోలో ప్రసంగించారు. రాష్ట్రంలో జోడో యాత్ర మూడో రోజుకు చేరుకుంది. జిల్లాలోని తుండిలో శనివారం రాత్రి బస చేసిన రాహుల్ ఆదివారం గోవింద్‌పూర్ నుంచి తిరిగి యాత్రను మొదలుపెట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం కాకుండా కాపాడటం, యువతకు గిరిజనులకు న్యాయం దక్కేలా చేయడమే యాత్ర ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఆర్థిక అసమానతలు, నోట్లరద్దు, జీఎస్‌టీ, నిరుద్యోగం వంటి సమస్యలు దేశంలోని యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యాత్ర తిరిగి కొనసాగి బొకారో జిల్లాలోకి ప్రవేశించింది. బొకారో వైపు సాగుతూ గోధార్ కాళి బస్తీ వద్ద ఆయన బొగ్గు గని కార్మికులు, వారి పిల్లలతో ముచ్చటించారు. మధ్యాహ్నానికి యాత్ర బొకారో చేరుకుంది. భోజనానంతరం జెనామోర్ నుంచి మొదలైన యాత్ర రామ్‌గఢ్ జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలోని గోలా వద్ద జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు.

భారత దౌత్య కార్యాలయంలో ఐఎస్ఐ ఏజెంట్



లక్నో: రష్యా రాజధాని మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో కీలక విధుల్లో ఉంటూ పాకిస్తాన్ నిఘా విభాగం ఐఎస్ఐకి కీలక సమాచారం చేరవేస్తున్న ఓ అధికారి ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏటీఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా షామహియుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన సతేంద్ర సివాల్ విదేశాంగ శాఖ ఉద్యోగి. ఇతడు మాస్కోలోని భారత దౌత్య కార్యాలయంలో ఇండియా బేస్డ్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఐబీఎస్ఏ)గా పనిచేస్తూ 2021 నుంచి దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడు. పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ నెట్‌వర్క్‌తో టచ్‌లో ఉంటూ రక్షణ శాఖ కార్యకలాపాలు, విదేశాంగ శాఖ వ్యవహారాలు, భారత సైన్యం కదలికలకు సంబంధించిన కీలక సమాచారాన్ని వారికి చేరవేస్తున్నాడు. కీలక సమాచారం అందిస్తే భారీగా ప్రతిఫలం ముట్టజెపుతామంటూ పలువురు ఇతర అధికారులను సైతం తన వైపు తిప్పుకునేందుకు సతేంద్ర ప్రయత్నిస్తున్నట్లు యూపీ ఏటీఎస్‌కు ఉప్పందింది. దీంతో, ఏటీఎస్ బృందం ఇతడి కదలికలు, కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచింది. ఆ మేరకు నిబంధనల ప్రకారం ఇతడిని ఇటీవల మీరట్‌లోని ఫీల్డ్ యూనిట్‌కు రప్పించి అధికారులు విచారించారు. నేరానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించడంతో సతేంద్ర సివాల్‌పై ఐపీసీ సెక్షన్ 121ఏతో పాటు అధికార రహస్యాల చట్టం-1923 కింద కేసులు నమోదు చేసినట్లు ఏటీఎస్ వివరించింది.

చిలీలో భీకర కార్చిచ్చు.. 64 మంది మృతి

శాంటియాగో: దక్షిణ అమెరికా దేశం చిలీని భీకర కార్చిచ్చు వణికిస్తోంది. జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాలను కార్చిచ్చు చుట్టివేయడంతో కనీసం 64 మంది చనిపోగా 1,100 నివాసాలు కాలి బూడిదైనట్లు అధికారులు తెలిపారు. వల్పరైజో ప్రాంతంలో చెలరేగుతున్న నాలుగు కార్చిచ్చులు అత్యంత ప్రమాదకరంగా మారాయని, వీటిని కట్టడి చేయడం ఫైర్ సిబ్బందికి కష్టసాధ్యంగా మారిందని అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లో సైతం మంటలు వేగంగా విస్తరిస్తుండటంతో అక్కడ రక్షణ చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. క్విల్పు, విల్లా అలెమన, తీరప్రాంత రిసార్టు పట్టణం వియా డెల్ మార్ ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయి. విల్లా ఇండిపెండెన్సియాలో సర్వమూ కాలిబూడిదై, ఆ ప్రాంతమంతా బూడిద విస్తరించుకుని ఉంది. దక్షిణ అమెరికాలో ఎల్ నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణ పరిస్థితులు కార్చిచ్చుకు ఊతమిస్తున్నాయి.

ఆక్రమిత ఉక్రెయిన్‌పై దాడి.. 28 మంది మృతి

మాస్కో: ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత లిసిచాన్స్క్ నగరంలోని ఓ బేకరీపై జరిగిన దాడిలో 28 మంది మృతి చెందారు. రష్యా నియమించిన స్థానిక అధికారి ఈ విషయం వెల్లడించారు. బేకరీ కుప్పకూలిపోవడంతో శిథిలాల్లో చిక్కుకుపోయిన మరో 10 మందిని కాపాడినట్లు చెప్పారు. ఘటనపై ఉక్రెయిన్ అధికారులు స్పందించలేదు. ఈ శీతాకాలంలో సుమారు 930 మైళ్ల మేర విస్తరించి ఉన్న యుద్ధ క్షేత్రంలో ఎటువంటి మార్పులు చోటుచేసుకోలేదు. రష్యా, ఉక్రెయిన్ సైన్యాలు ఎక్కువగా దీర్ఘ శ్రేణి దాడులపైనే ఆధారపడ్డాయి. ఇలా ఉండగా, 24 గంటల వ్యవధిలో రష్యా బలగాలు పలు ప్రాంతాల్లో తమ సేనలపైకి పదేపదే దాడులతో ఒత్తిడి తీవ్రతరం చేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది.

యెమెన్‌లోని హౌతీలపై అమెరికా దాడులు

వాషింగ్టన్: ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులకు పాల్పడుతున్న హౌతీలకు చెందిన యెమెన్‌లోని ప్రాంతాలపై అమెరికా, యూకే యుద్ధ విమానాలు దాడులు జరిపాయి. మొత్తం 13 ప్రాంతాల్లోని 36 హౌతీల లక్ష్యాలపై యుద్ధ నౌకల నుంచి క్షిపణులు, యుద్ధ విమానాల ద్వారా దాడులు జరిపినట్లు పెంటగాన్ తెలిపింది. దాడుల్లో బహ్రెయిన్, కెనడా, డెన్మార్క్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్‌లు కూడా పాలుపంచుకున్నట్లు వివరించింది. మరిన్ని దాడులకు తెగబడకుండా, హౌతీల సామర్థ్యాన్ని దెబ్బతీయడమే తమ ఉద్దేశమని తెలిపింది. వారం క్రితం జోర్డాన్‌లోని అమెరికా బలగాలపై డ్రోన్ దాడికి ప్రతిగా అమెరికా యుద్ధ విమానాలు శనివారం ఇరాక్, సిరియాల్లోని 85 లక్ష్యాలపై దాడులు జరిపిన విషయం తెలిసిందే.

బీజేపీలో చేరాలని ఒత్తిడి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బీజేపీ లక్ష్యంగా ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరాలని తనతోపాటు, ఇతర ఆప్ నేతలపై కాషాయ దళ నేతలు ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే, తాము ఎలాంటి తప్పు చేయనందున అలా చేయబోమని స్పష్టం చేశారు. ఆప్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఎరవేసిందన్న ఆరోపణలపై విచారణకు హాజరు కావాలని ఢిల్లీ పోలీసులు కోరడం, మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ పదేపదే నోటీసులివ్వడం వంటి పరిణామాల నేపథ్యంలో కేజ్రీవాల్ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ నేతలు ఎలాంటి కుట్రలకు పాల్పడాలని చూసినా, ఎలాంటి ఫలితం ఉండదు. వాళ్ల కుట్రలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. వాళ్లకి తలొంచేదే లేదు. బీజేపీలో చేరితే ఏ ఇబ్బందులూ లేకుండా చేస్తామని చెబుతున్నారు. కానీ, ఆ పార్టీలో ఎట్టి పరిస్థితుల్లోనూ చేరబోను'అని కేజ్రీవాల్ ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. ఆప్ నేతలపై పెట్టినవన్నీ తప్పుడు కేసులన్నారు.

కేంద్రానిది ఆర్థిక ఉగ్రవాదం: టీఎంసీ

కోల్‌కతా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ అధికార పార్టీ టీఎంసీ విరుచుకుపడింది. కేంద్రం ఆర్థిక సమాఖ్య ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఆరోపించింది. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ ఆదివారం కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు. తామిచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను బెంగాల్ ప్రభుత్వం అందజేయలేదంటూ కేంద్రం చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే పార్టీ అధికారంలో ఉన్నందునే రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి విమర్శలు చేస్తోందని ఎంపీ ఒబ్రియాన్ అన్నారు. కాగ్ నివేదికలోని అంశాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ వ్యతిరేక ప్రచారానికి బీజేపీ ప్రభుత్వం పూనుకుందని పేర్కొన్నారు.

నమీబియా అధ్యక్షుడు గీన్‌గోబ్ కన్నుమూత

హరారే: నమీబియా అధ్యక్షుడు హగె గాట్‌ఫ్రీడ్ గీన్‌గోబ్(82) మృతి చెందారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న గీన్‌గోబ్ హరారేలోని లేడీ పొహంబా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారని అధ్యక్షభవనం తెలిపింది. ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడినట్లు 2014లో గీన్‌గోబ్ స్వయంగా ప్రకటించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. 2015 నుంచి దేశాధ్యక్షుడిగా కొనసాగుతున్న గీన్‌గోబ్ పదవీ కాలం ఈ ఏడాదితో పూర్తి కావాల్సి ఉంది. వలస పాలన నుంచి బయటపడ్డాక నమీబియా మొదటి ప్రధానిగా 1990-2002 మధ్య తిరిగి 2008-12 సంవత్సరాల మధ్య గీన్‌గోబ్ బాధ్యతలు నిర్వహించారు.

వ్యవస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోంది: ఖర్గే

త్రిస్సూర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను క్రమబద్ధంగా నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేసేందుకు ఈడీ, సీబీఐ, ఐటీ వంటి విభాగాలను ఆయుధాలుగా వాడుకుంటోందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను ఆదివారం ఆయన కేరళ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. త్రిస్సూర్‌లోని తెక్కినాడు మైదాన్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'మహాజన సభ'నుద్దేశించి మాట్లాడారు. సమావేశంలో 25వేలకు పైగా బూత్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగాయని, దేశంలో పేద, ధనిక అంతరాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు.

సౌత్ కరోలినాలో బైడెన్ ఘన విజయం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలకమైన సౌత్ కరొలినాలో డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా మొట్టమొదటి నిర్ణయాత్మక విజయం సాధించారు. ఈ ఘన విజయంతో ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు ప్రధాన ప్రత్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలున్నాయి. నాలుగేళ్ల క్రితం ఆయన సౌత్ కరోలినా నుంచే డెమోక్రాటిక్ పార్టీ తరఫున విజయ పరంపర నమోదు చేసుకున్నారు. తాజా ఎన్నికలో బైడెన్‌కు 96.2 శాతం ఓట్లు పోలవగా ఆయనతో పోటీకి దిగిన మరీన్ విలియమ్సన్‌కు కేవలం 2.1 శాతం ఓట్లే దక్కాయి.

గ్రోత్ ఇంజిన్ ఈశాన్య రాష్ట్రాలే: కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందకపోతే దేశం అభివృద్ధి చెందదని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశానికి ఈశాన్య రాష్ట్రాలే గ్రోత్ ఇంజిన్ అని తెలిపారు. ఆదివారం ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన 'నార్త్ ఈస్ట్ సమ్మేళన్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా మోదీ బాధ్యతలు తీసుకున్ననాటి నుంచి ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై ప్రత్యే దృష్టి సారించారని చెప్పారు. పదేళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్నడూ లేని విధంగా ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. స్థిరమైన ప్రభుత్వం, నాయకుడి వల్లే నార్త్ ఈస్ట్‌లో శాంతి నెలకొందని, అభివృద్ధి సాధ్యం అవుతోందన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయాడు. సోధి గజేంద్ర తదితర సుమారు 20 మంది మావోయిస్టులతో కూడిన కుంటా ఏరియా కమిటీ సమావేశమవుతున్నట్లు అందిన సమాచారంతో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా భేజీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నగరం, పంటాభేజీ గ్రామాల మధ్య ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనలో ఒక మావోయిస్టు చనిపోయాడు.

సాక్షి
కరీంనగర్
సోమవారం ౹ 5 ౹ ఫిబ్రవరి ౹ 2024

అజ్ఞాతంలోనూ అక్షరసేద్యం



ఒకప్పటి సమాజంలోని అసమానతలను పారదోలేందుకు పలువురు యువకులు విప్లవ పంథాను ఎంచుకున్నారు. అడవిబాట పట్టి బందూకులు చేబూనారు. ఆ చేతులతోనే అన్యాయంపై రచనలతో యుద్ధం చేశారు. తమ కవితలు, పాటలు, వ్యాసాలతో సమాజంలోని దోపిడీదారి వ్యవస్థపై పోరాడారు. 8లో▸



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆర్జిత సేవలు రద్దు చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



సుష్మిత-రమణారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

తిమ్మాపూర్: ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో మాజీ సర్పంచ్ మోరపల్లి సుష్మిత-రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఆదివారం సన్మానం ఏర్పాటు చేశారు. హాజరైన ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అరాచకపాలన సాగించిందని ఆరోపించారు. భూ ఆక్రమణదారులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల పొట్టకొట్టమని, బీఆర్‌ఎస్ నాయకుల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు మాత్రమే అవుతోందని, వంద రోజుల్లోగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి ఎల్కపల్లి సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, రమేశ్, యూత్ మండల అధ్యక్షుడు చెన్నబోయిన రవి, ఎంపీటీసీలు కొత్త తిరుపతిరెడ్డి, బండారి రమేశ్, నాయకులు కొత్త రాజిరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు తాజొద్దీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్.గౌడ్, గుంటి మధు, పొట్ట శ్రీనివాస్, రావుల కృష్ణ, చింతల లక్ష్మారెడ్డి, గోపు మల్లారెడ్డి, బి.తిరుపతి, లక్ష్మణ్, లింగయ్య, హైదర్ ఉన్నారు.

'అవినీతి చైర్మన్‌తో ఇమడలేకే అవిశ్వాసం'



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు స్థానిక చైర్మన్ అవినీతిపై విసుగెత్తి అవిశ్వాసం పెట్టారని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో మాట్లాడుతూ.. జమ్మికుంట కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంలో ఓడిపోతామనే భయంతో టెక్నికల్ సమస్యను సాకుగా చూపి గెలిచారని, కాంగ్రెస్‌పై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతీ కౌన్సిలర్‌కు అండగా ఉంటామని అన్నారు. పార్టీలో కష్టపడ్డవారికి పదవులు ఉంటాయని వెల్లడించారు. సమ్మక్క–సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులకు దళితబంధు అందించేలా కృషి చేస్తానని వివరించారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి భారీ మెజారిటీ వచ్చేలా కష్టపడాలని పిలుపునిచ్చారు. నాయకులు పత్తి కృష్ణారెడ్డి, తుమ్మేటి సమ్మిరెడ్డి, సుకంరి రమేశ్, కసుబోజుల వెంకన్న, పూదరి రేణుక శివకుమార్‌గౌడ్, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, ముద్దమల్ల రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కొన్ని మబ్బులు పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక అధ్వర్యంలో కవి విలాసాగరం రవీందర్ రచించిన కొన్ని మబ్బులు పుస్తకాన్ని సాహితీవేత్త అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ఆవిష్కరించారు. విలాసాగరం రవీందర్ కవితా సంపుటి కొన్ని మబ్బులు పుస్తకంలో మెరుపులే ఎక్కువగా ఉన్నాయన్నారు. మబ్బులు కదలిపోతూ కరిగిపోతాయని, మానవుడూ చలనంలోనే ఉండాలని బోధిస్తాయన్నారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీకుమార్, కవులు పొన్నం రవిచంద్ర, దామరకుంట శంకరయ్య, గాజోజు నాగభూషణం, అన్నవర దేవేందర్, సంకెపల్లి నాగేంద్రశర్మ, కేవీ.సంతోష్‌బాబు, గుండు రమణయ్య పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం రేకుర్తిలోని రాజశ్రీగార్డెన్‌లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని, సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రానున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హాజరవుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

సాదా.. సీదా ఎప్పుడో?



ఈ రైతు పేరు రాజిరెడ్డి. 2002లో తిమ్మాపూర్‌లో రెండెకరాల భూమిని సాదాబైనామా (తెల్ల కాగితంపై ఒప్పందం) ద్వారా కొనుగోలు చేశాడు. విక్రయించిన రైతు పదేళ్ల క్రితం చనిపోయాడు. మోకాపై రాజిరెడ్డి పంటలు పండిస్తున్నప్పటికీ రికార్డులో విక్రయించిన వ్యక్తి పేరే కనిపిస్తోంది. 2016లో ప్రభుత్వం సాదాబైనామాలకు అవకాశం కల్పించగా దరఖాస్తు చేశాడు. కానీ, ఇప్పటికీ రికార్డులో ఆయన పేరు చేరలేదు. ఇలా రాజిరెడ్డి ఒక్కరే కాదు.. ఇలాంటి వారు జిల్లాలో వేలాది మంది ఉన్నారు. తమకు పట్టా వచ్చేనా? ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేనా అంటూ నిరీక్షిస్తున్నారు.

- పెండింగ్‌లో దరఖాస్తులు
- భూములు అమ్ముకోలేరు
- ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేరు
- సర్కారు నిర్ణయం కోసం రైతుల ఎదురుచూపు
- జిల్లాలో వచ్చిన అర్జీలు 87,084





కరీంనగర్‌లోని మీసేవకేంద్రంలో దరఖాస్తు చేస్తున్న రైతులు (ఫైల్)

రెవెన్యూ డివిజన్ వారీగా వివరాలు

డివిజన్	దరఖాస్తులు	పరిశీలన
కరీంనగర్	36,095	35,939
హుజూరాబాద్	50,989	50,793

కరీంనగర్ అర్బన్: సాదాబైనామా ద్వారా భూములను కొనుగోలు చేసిన రైతులకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం గుదిబండగా మారింది. 2014 జూన్ 2లోపు తెల్ల కాగితంపై భూములను కొనుగోలు చేసిన వారికి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించగా ఏళ్లుగా నాన్చుతుండటం ఆందోళనకర పరిణామం. దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేక రైతుబంధు, బీమా వంటి ప్రభుత్వ పథకాలకు, బ్యాంకు రుణాలకు దూరమవుతున్నారు. 2020 అక్టోబర్‌లో దరఖాస్తులకు అవకాశమివ్వగా ఇప్పటికీ కొలిక్కి రాకపోవడం శోచనీయం. కొత్త ప్రభుత్వంలోనైనా పట్టాలు చేతికందుతాయా లేదా అన్న చర్చ జరుగుతోంది.

16,700 మందికి పట్టాలు

జిల్లాలో కరీంనగర్ అర్బన్‌తోపాటు తిమ్మాపూర్, హుజూరాబాద్, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్, గన్నేరువరం, మానకొండూర్, జమ్మికుంట, ఇల్లందకుంట, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ తదితర మండలాల్లో సర్వే నంబర్ల వారీగా 87,084 దరఖాస్తులు రాగా 18 వేలకు పైగా తిరస్కరించారు. 16,700 మందికి పట్టాలు జారీ చేశారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, సాదాబైనామా అర్జీలకు 1994 వరకు చట్టబద్ధత కల్పించారు. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేతిరాత కాగితాలకు గుర్తింపు లభించగా తిరిగి రెండున్నర దశాబ్దాల అనంతరం మాజీ సీఎం కేసీఆర్ రెండుసార్లు అవకాశం ఇచ్చారు. పాత రెవెన్యూ చట్టం రద్దయ్యాక దాని ఆధారంగా చేపట్టే సాదాబైనమాల క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తర్వాత పంట రుణాలకు నోచుకోక.. కొనుగోలు చేసిన భూమిని అమ్ముకోలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులతోపాటు రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు 25 వేలకు పైగా దరఖాస్తులను ఎలాంటి వివాదాలు లేనివిగా గుర్తించారు.

నిబంధనలు సడలించినా ఫలితమేది?

సాదాబైనామాల అర్జీలకు అవకాశమిచ్చిన తొలిసారి వాటిని క్రమబద్ధీకరించేందుకు తొలుత ఆర్డీవోలను ప్రభుత్వం బాధ్యులను చేసింది. ప్రతీ దరఖాస్తును సదరు అధికారి పరిశీలించిన తదుపరి పట్టా జారీ చేయాలని పేర్కొంది. గతంలో చేపట్టిన ఈ ప్రక్రియ వేగంగా లేకపోవడంతో ఆర్డీవోల నుంచి తప్పించింది. వేల దరఖాస్తులను వారు పరిశీలించడం అసాధ్యమని భావించి, తహసీల్దార్లకే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. రైతులు ఆన్‌లైన్‌లో ఫాం–10 ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, సాదాబైనామా విక్రయాన్ని క్రమబద్ధీకరించేందుకు తహసీల్దార్లు 13బీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 1బీలో నమోదు చేసి, రైతులకు పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాల్సి ఉంటుంది. విక్రయదారులకు నోటీసులు జారీ చేయడం, వాంగ్మూలం నమోదులో వీరి పాత్ర కీలకం. ఇందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తుండగా తమ వేలిముద్రలు వేసి, రైతులకు హక్కుపత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఎక్కడ పొరపాటు జరిగినా తహసీల్దార్లదే బాధ్యత. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ రద్దుతో సాదాబైనామా దరఖాస్తులను గిర్దావర్లే పరిశీలించాలని గతంలోనే నిర్దేశించింది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని, క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తేనే అన్నదాతలకు మేలు చేకూరనుంది.

ప్రభుత్వ పాఠశాలలకు పీఎంశ్రీ నిధులు

- ఉమ్మడి జిల్లాకు రూ.46,72,703 విడుదల
- పాఠశాలల్లో మౌలిక వసతులు.. అదనపు గదుల నిర్మాణానికి శ్రీకారం
- ఉమ్మడి కరీంనగర్‌లో 50 పాఠశాలలు ఎంపిక



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన దుర్శేడ్ జెడ్పీ ఉన్నత పాఠశాల

ఉమ్మడి జిల్లాలో ఎంపికైన పాఠశాలలు

కరీంనగర్	13
పెద్దపల్లి	11
రాజన్న సిరిసిల్ల	11
జగిత్యాల	15

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తూ విడతల వారీగా వసతుల కల్పనకు రూ.కోటి వరకు నిధులు వెచ్చించనున్నారు. పాఠశాలల అభివృద్ధికి ఈ పథకాన్ని 2022–23 నుంచి 2026–27 వరకు ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు నిర్ణయించారు. ఎంపికైన పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. ఆధునిక పద్ధతుల బోధనతో 21వ శతాబ్దానికి సంబంధించిన నైపుణ్యాలను ప్రస్తుత బాలలకు అందించేలా కేంద్రం అడుగులు వేస్తోంది. డిజిటల్ విద్య అమలుకు సాంకేతిక పరికరాలను అందజేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ కింద 50 పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలల గుర్తింపు, లక్ష్యాల నిర్ధారణ, చర్చ, ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనుల అమలుకు చర్యలు తీసుకుంటారు.

రూ.46.72లక్షలు..

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన ఉమ్మడి జిల్లా పరిధిలోని 50 పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ గత నెల 31న రూ.46,72,703 నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి కేటగిరీలో ఎంపికైన పాఠశాలలకు రూ.75 వేలు, రెండో కేటగిరీ పాఠశాలలకు రూ.99,939 నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కరీంనగర్ జిల్లాలోని 13 పాఠశాలలకు రూ.12,49,329, జగిత్యాల జిల్లాలోని 15 స్కూళ్లకు రూ.14,24,228, పెద్దపల్లి జిల్లాలోని 11 పాఠశాలలకు రూ.10,24,512, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 11 స్కూళ్లకు రూ.9,74,634 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు..

ఎంపికైన పాఠశాలల్లో వసతులు కల్పించి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక వనరులు సమకూర్చుతారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థులకు మానసిక స్వేచ్ఛను కల్పించి వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇస్తారు. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన లోపాలను సరిదిద్దుకోవడానికి అవసరమైన సాంకేతిక వనరులను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తారు. ఎంపికైన పాఠశాలల్లో సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తారు. ఎల్ఈడీ విద్యుత్ దీపాలను అన్ని తరగతి గదుల్లో ఏర్పాటు చేయిస్తారు. పోషకాహార పెరటి తోటల పెంపకం, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించడం, నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, బొమ్మలతో ఆకర్షణీయంగా బోధన చేసి విద్యార్థులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకుంటారు. విద్యార్థులకు చదువుతో పాటు క్షేత్రస్థాయి పనుల్లో కూడా శిక్షణ ఇస్తారు. పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత స్వయం ఉపాధి పథకాలతో లబ్ధి పొందడంపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసి వారి స్థాయిని పరిశీలిస్తారు. తద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం సులభతరమవుతుంది. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణం, విద్యార్థులకు ఇతరత్రా విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈ నిధులను వెచ్చించనున్నారు.

ఉత్తమ పోలీసులకు సేవా పురస్కారాలు

- సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి
- సీపీ అభిషేక్ మహంతి
- ముగిసిన సాయుధ బలగాల శిక్షణ
- ఉత్తమ సేవలందించిన వారికి పతకాలు



సేవా పతకాలు అందిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకుందని సీపీ అభిషేక్ మహంతి అన్నారు. సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. కమిషనరేట్ పరిధిలోని సాయుధ బలగాలకు పదిరోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ శిక్షణలో పరేడ్, డ్రిల్, ఆయుధాల వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరు ప్లాటూన్లతో కూడిన పరేడ్ నిర్వహించారు. కమాండెడ్‌గా ఆర్ఐ మోడెం సురేశ్ వ్యవహరించారు. శిక్షణలో ప్రతిభ చూపిన వివిధ విభాగాల సిబ్బందికి సీపీ అభిషేక్ మహంతి ప్రశంసాపత్రాలు అందించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలుసేవా పతకాలు ప్రకటించగా.. సీపీ అభిషేక్ మహంతి చేతుల మీదుగా అందించారు. వీరిలో కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్సై సయ్యద్ అంజద్, వన్‌టౌన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.రవీందర్ అతి ఉత్కృష్ట సేవా పతకాలు పొందారు. మానకొండూర్, కరీంనగర్ కానిస్టేబుళ్లు ఏ.తిరుపతి, ఎన్.ప్రవీణ్‌కుమార్ ఉత్కృష్ట సేవా పతకాలు స్వీకరించారు. ఏఎస్సైలు నూరుద్దీన్, లక్ష్మారెడ్డి, అబ్దుల్ రజాక్, గౌస్‌ఖాన్, కిషన్, దామోదర్‌రావు, మల్లయ్య, గోపాల్‌రెడ్డి, సయ్యద్ మొయినొద్దీన్, మల్లారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు సారంగధర, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, సంపత్, తిరుపతి, వీరాస్వామి, శ్రీశైలం, శ్రీనివాస్, లింగారెడ్డి, కానిస్టేబుల్ చంద్రమౌళి సేవా పురస్కారాలు సీపీ చేతుల మీదుగా అందుకున్నారు డీసీపీలు సి.రాజు(పరిపాలన), లక్ష్మీనారాయణ(శాంతిభద్రతలు), ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు

- అవినీతి బీఆర్‌ఎస్ పోయి.. కాంగ్రెస్ రూపంలో మళ్లీ అవినీతి వచ్చింది
- రాహుల్ యాత్రకు రేవంత్‌రెడ్డి రూ.కోట్ల విలువైన బస్సు ఏర్పాటు చేశారు
- దేశంలో అధికారంలోకి రాని కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటు దండగ
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్



సమావేశంలో మాట్లాడుతున్న తరుణ్‌చుగ్

కరీంనగర్‌టౌన్: కేంద్రంలోని బీజేపీ, ప్రధాని మోదీ ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం పదేళ్లుగా శ్రమిస్తున్నారని, వికసిత్ భారత్ సంకల్పంతో అడుగులు వేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. మీడియాతో మాట్లాడారు. పదేళ్ల మోదీ ప్రభుత్వ ఆలోచన విధానాలు, దేశ అభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి తీవ్ర ప్రయత్నం చేస్తోందని, త్వరలోనే ప్రపంచంలోనే దేశాన్ని మూడోస్థానానికి తీసుకెళ్లేలా ముందుకు సాగుతోందని అన్నారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పని అయిపోయిందని, అనేక పార్టీలతో ఏర్పాటైన ఇండియా కూటమి విచ్ఛిన్న స్థితిలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్, బీఆర్‌ఎస్ అవినీతి ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అవినీతి ప్రభుత్వం రావడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ సంపదను నాడు బీఆర్‌ఎస్ దోచుకుంటే.. నేడు కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి సర్కార్ దోచుకునే పనిలో ఉందని తెలిపారు. ఏకంగా జాతీయ కాంగ్రెస్‌కు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫండింగ్ చేసే స్థితిలో ఉందని, రాహుల్ యాత్ర కోసం టీఎస్ రిజిస్ట్రేషన్ పేరిట కోట్ల విలువ చేసే లగ్జరీ బస్సును ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. దేశంలో అధికారంలోకి రాని కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఓటు వేయడం దండుగన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ప్రభారీ మీసాల చంద్రయ్య, నాయకులు బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, చెన్నమనేని వికాస్ రావు, గండ్ర నళిని, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరుణ్‌చుగ్‌ను సన్మానించిన సంజయ్

కరీంనగర్ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్‌ను ఎంపీ బండి సంజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు.

దళితబంధు రాలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

- రూ.3లక్షలు అప్పు తెచ్చి ఫొటోస్టూడియో పెట్టుకోవడంతో ఇబ్బందులు
- రెండో విడత ఆగిపోవడంతో మనస్తాపం
- వీణవంక మండలం బ్రాహ్మణపల్లిలో ఘటన



చికిత్స పొందుతున్న మహిళ

వీణవంక(హుజూరాబాద్): దళితబంధు రెండో విడత మంజూరుకాకపోవడం.. తెచ్చిన అప్పు పెరిగిపోవడంతో మనస్తాపం చెందిన ఓ దళితమహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన వీణవంక మండలం బ్రాహ్మణపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాజుల అమల, ప్రవీణ్ దంపతులు దళితబంధు పథకం కింద ఫొటోస్టూడియోకు దరఖాస్తు చేసుకున్నారు. మొదటివిడత రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో మండలకేంద్రంలో ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నారు. రూ.5లక్షలు సరిపోక పోవడంతో బంధువుల వద్ద రూ.3లక్షలు అప్పు తెచ్చారు. రెండేళ్లు గడిచినా రెండోవిడుత నిధులు విడుదల కాకపోవడంతో తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన అమల.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో హెయిర్ డై తాగింది. గమనించిన బంధువులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. రెండోవిడుత దళితబంధు కోసం ఎదురుచూస్తున్నామని, అప్పుల బాధ భరించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని అమల భర్త ప్రవీణ్ తెలిపాడు.

జమ్మికుంటలో మరొకరు..?

జమ్మికుంటలోనూ ఓ దళితుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లబ్ధిదారుడు దళితబంధు కింద మొదటి విడత రూ.5లక్షలు రావడంతో డీజే పెట్టుకున్నాడని, రెండో విడత మంజూరు కాకపోవడంతో మనస్తాపంతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వీడియోలు వైరల్ అవుతున్నాయి.

కలల తెలంగాణ ఇంకా సిద్ధించలే: ఎంపీ సంజయ్



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: తెలంగాణ ఏర్పడి పదేళ్లయినప్పటికీ ప్రజలు కలకన్న స్వేచ్ఛాయుత వాతావరణం ఇంకా ఏర్పడలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు సమీపంలోని పద్మశాలీ హాస్టల్‌లో ఎంపీలాడ్స్ రూ.10 లక్షలతో నిర్మించే భవన పనులకు భూమిపూజ చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ పాత్ర మరువలేనిదన్నారు. పద్మశాలీ సంఘం నేతలు ఆ సామాజిక విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అదనపు గదులకు అవసరం అయితే మరిన్ని నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ప్రాణాంతకం కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చిత్రంలో వినోద్ కుమార్ తదితరులు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి కాదని, అందరం కలిసి నిర్మూలిద్దామని, నేడు సాధారణ జబ్బుగా క్యాన్సర్ మారిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను మొదట్లో గుర్తిస్తే త్వరగా నయం చేసుకోవచ్చని తెలిపారు. మనం తినే ఆహారం కల్తీకారణంగానే క్యాన్సర్ బారిన పడుతున్నామని అన్నారు. క్యాన్సర్ పరీక్షలకు మహిళలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్‌లోని కార్పొరేటర్లు, ఇతర నాయకులు ఉచిత క్యాన్సర్ శిబిరానికి ఎక్కువ సంఖ్యలో మహిళలను తీసుకొచ్చి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు వాల రమణారావు, గుగ్గిళ్ల జయశ్రీ, ఎడ్ల సరిత, పిట్టల వినోద, నాంపల్లి శ్రీనివాస్, గంట కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేణుగోపాలచారికి పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా శంకరపట్నంకు చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కట్ట వేణుగోపాలచారి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. విద్యారంగంలో విశిష్ట కృషి చేసినందుకు స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతోత్సవాల సందర్భంగా యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ హైదరాబాద్, విశ్వకర్మ ఫౌండేషన్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం స్వీకరించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ మహేందర్‌ను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తిని ఓ కేసు విషయంలో కానిస్టేబుల్ మహేందర్ తరుచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బాధితుడు డబ్బులు ఇచ్చినట్లు పూర్తి ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎస్పీ సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద వ్యక్తుల కలకలం

వెల్గటూర్ (ధర్మపురి): మండలంలోని పాశిగామ గ్రామంలో శనివారం అర్ధరాత్రి తర్వాత దొంగలు పడ్డారన్న వార్త ఆందోళన రేపింది. కొద్దిరోజుల క్రితం గ్రామంలోని రెండు ఇళ్లలో దొంగలు పడి లక్ష రూపాయలు దొంగిలించగా, మళ్లీ దొంగలు తిరుగుతున్నారన్న వార్తతో గ్రామస్తులు బెంబేలెత్తిపోయారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు అర్ధరాత్రి సమయంలో పొలానికి నీరుపెట్టి వచ్చే సమయంలో కొంతమంది యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా, వారిని రైతులు ప్రశ్నించారు. ఆ యువకులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న 8 మంది యువకులను స్టేషన్‌కు తరలించి విచారించగా, వన్యప్రాణుల వేటకు వచ్చినట్లు తేలిందని ఎస్సై తెలిపారు. దీనిపై లోతుగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహిళపై దాడి.. ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లికి చెందిన మహమ్మద్ అలీమాపై పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని దాడి చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన షేక్ హైమద్‌పై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. అలీమా, హైమద్ కుటుంబాల మధ్య కొంత కాలంగా గొడవలు ఉన్నాయి. అలీమాపై కక్ష పెంచుకున్న హైమద్ ఆమెపై సోషల్‌మీడియాలో అసభ్యకరంగా వాయిస్ మెస్సేజ్ పెట్టాడు. ఈ విషయాన్ని అడిగేందుకు తన కుమారుడితో కలిసి వెళ్లి నిలదీయగా.. హైమద్ సలాకతో అలీమాపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ మహిళను పోలీసులు చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

వేములవాడ: వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి జగిత్యాల పట్టణంలోని గోత్రాలకాలనీకి చెందిన మహేశ్(23) అనే వ్యక్తి ఆదివారం మరణించాడు. వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీకి చెందిన తేజ, ప్రమోద్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

‘అమ్మా
[illegible]
.. ఓ విప్లవ యోధుడిది.

‘తెలుగింటి వెలుగు రేఖ కాళోజీ.. తాను సత్యాన్ని శోధించే జాబాలీ.. అన్నా.. తెలంగాణ పాలికే కలా కాలన్నా.. స్వేచ్ఛ సమానతలను చాటేను లోకానా..’ అంటూ కాళోజీ గురించి మిత్ర అలియాస్ అమర్ రాసిన పాట..

‘అమ్మా.. నీ పేగు బంధాన్ని తెంచుకొని పుట్టినందుకు.. వచ్చే జన్మలోనైనా నీ కడుపున పుట్టి రుణం తీర్చుకుంటానమ్మా.. ఈ జన్మకు నా జీవితాన్ని పీడిత జనానికి అంకితం చేస్తున్నానమ్మా..’ అంటూ మల్లోజుల కోటేశ్వర్‌రావు ఉరఫ్ కిషన్‌జీ వాళ్ల తల్లి మధురమ్మకు రాసిన లేఖలో కొన్ని వ్యాఖ్యాలు..



అజ్ఞాతంలోనూ అక్షర సేద్యం

- నిత్య నిర్బంధంలో సాహిత్య సృజన
- సిద్ధాంత పోరాటం.. సాహిత్యంపై ఆరాటం
- ప్రజాసాహిత్యానికి బాటలు వేసి అజ్ఞాత సూర్యులు




అమర్ అలియాస్ కూర దేవేందర్

ఆ రచనల వెనుక నమ్మిన సిద్ధాంతంతోపాటు భాషాభిరుచి ఉంది. ప్రజాసాహిత్యానికి పట్టం కట్టాలనే తపన ఉంది. ఏళ్ల తరబడి అజ్ఞాతంలో ఉంటూ నిత్య నిర్బంధంలోనూ సృజనాత్మకంగా అక్షరసేద్యం చేశారు. పాటలై ప్రవహించారు. వ్యాసాలుగా చైతన్య పరిచారు. కథలై కదిలించారు. కవితలై ఆలోచింపజేశారు. తెలుగు సాహిత్యానికి నిలువెత్తు సంతకాలయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి అజ్ఞాతసూర్యులై వెలిగిన అక్షరయోధులపై ప్రత్యేక కథనం.

సిరిసిల్ల: ఒకప్పటి సమాజంలో ఉన్న అసమానతలను పారదోలేందుకు పలువురు యువకులు విప్లవపంథాను ఎంచుకున్నారు. అడవిబాట పట్టి బందూకులు చేబూనారు. ‘అన్న’లుగా మారి అన్యాయాలపై ఎదురుతిరిగారు. ‘అన్న’లు అంటే మనకు తెలిసినంతవరకు తుపాకులు, విప్లవ సాహిత్య పుస్తకాలతో కనిపిస్తారనే ఊహ. కానీ.. అన్యాయాలపై ఎదురుతిరిగిన అన్నల్లోనూ పలువురు సాహిత్య రచన చేశారు. ఆ సాహిత్యంతో సమాజంలోని అన్యాయాన్ని తొలగించేందుకు ప్రయత్నించారు. తమ రచనల ద్వారా ప్రజలను జాగరూకులను చేశారు. ఇలా ఓ చేత తుపాకీ.. మరో చేత అక్షర సేద్యం చేశారు.

అమరత్వానికి ‘మిత్ర’

కూర దేవేందర్ ఉరఫ్ అమర్ ‘మిత్ర’ కలం పేరుతో అనేక పాటలు, సిద్ధాంత గ్రంథాలు, సామాజిక వ్యాసాలు రాశారు. వేములవాడకు చెందిన దేవేందర్ విద్యార్థి దశలోనే విప్లవోద్యమంలోకి వెళ్లారు. సోదరుడు కూర రాజన్న బాటలో సాగిన అమర్ తొలినాళ్లలోనే ‘ఈ సంకట ప్రభుత్వాన్ని కూల్చ వెంకటనారాయణ..’ అంటూ పాటను రాశారు. రెండు వేలకుపైగా పాటలు రాసిన అమర్.. విప్లవోద్యమంలో అమరులైన వారిపై రాసిన అనేక పాటలు జనబాహుళ్యంలో ఇప్పటికీ మారుమోగుతున్నాయి. ఆయన రాసిన పాటలను అమర్ భార్య విమలక్క గొంతు నుంచి జాలువారాయి. గంగపుత్రుల జీవితాలపై ‘ఓసు’ అనే కథను రాశారు. ‘చితాభస్మంలోంచి’ అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. తల్లిపైనా, పల్లెపైనా, ఉద్యమాలపై, జైలు జీవితాలపై, తెలంగాణ ఉద్యమంలోనూ అనేక పాటలు అందించారు అమర్. సామాజికాంశాలపై వ్యాసాలు రాశారు.



బీఎస్ రాములు, మల్లోజుల వేణుగోపాల్ రాసిన పుస్తకాలు

ఎందరో.. అజ్ఞాత సూర్యులు

నిత్య నిర్బంధాల మధ్య ఎందరో కలం వీరులు తమ రచనలతో ప్రజాచైతన్యానికి బాటలు వేశారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన శంకర్ ఉరఫ్ గోపన్న ‘పరుపు బండ’ పేరుతో అనేక పాటలు రాశారు. జగిత్యాల మండలం అంతర్గాం వద్ద గోపన్న 1996లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. భీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్‌కు చెందిన శనిగరం వెంకటేశ్వర్లు ఉరఫ్ సాహూ ప్రజాసాహిత్యానికి కృషి చేశారు. కొమురంభీం నవల రాశారు. గోండు భాష నేర్చుకుని పీపుల్స్‌వార్‌లో పనిచేస్తూ.. సాహూ పేరుతో సాహిత్యాన్ని అందించారు. హుస్నాబాద్‌కు చెందిన రిక్కల సహదేవరెడ్డి ‘రక్తచలన’, ‘సంగీతం’ పేరుతో కవితా సంపుటాలు వెలువరించారు. ఈయన 1987లో కోనరావుపేట మండలం ధర్మారం వద్ద ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఎ.పవన్‌కుమార్‌రాజు ఉరఫ్ నూతన్ ‘వెదురు వనాల గానం’ పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. 1992లో ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. బీసీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన బీఎస్.రాములు సైతం జగిత్యాల జైత్రయాత్ర స్ఫూర్తితో 1984లో వార్డెన్ ఉద్యోగాన్ని వదిలి పోరుబాటలో సాగారు. అజ్ఞాతంలో ఉంటూ ఎన్నో రచనలు చేశారు. ప్రభాకర్, సత్యం, మల్లేశ్, అరుణతార, పేర్లతో కథలు, వ్యాసాలు రాశారు. ‘విశ్వసహజాతాలు’ నవలను రాశారు. అజ్ఞాతం వీడిన తరువాత అనేక తత్వశాస్త్ర గ్రంథాలను వెలువరించారు. బీఎస్.రాములు ‘బతుకుపోరు’, ‘అడవిలో వెన్నెల’ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అనేక మంది అజ్ఞాతసూర్యులు అక్షర విత్తనాలు నాటి సాహిత్య సేద్యం సాగించారు.

కథల సోపతి.. మావోయిస్టు గణపతి



లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి, జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతిది సాహిత్యంలో అందెవేసిన చేయి. విప్లవోద్యమంలో కీలకపాత్ర పోషిస్తూనే కథలు రాశారు. ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన విప్లవ వ్యూహకర్తగా వ్యవహరించారు. మావోయిస్టు పార్టీలో చేరిన కొత్తలో ‘ఎత్తుంగ్రి పిడికిళ్లు’ అనే పెద్ద కథను రాశారు. లక్ష్మి కలం పేరుతో ‘పరుగు పందెం’ కథను రచించారు. వివిధ కలాల పేర్లతో వ్యాసాలు రాశారు. ఆయన మావోయిస్టు నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఉపాధ్యాయుడిగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగిలో పనిచేశారు.

కవితల సేనాని కిషన్‌జీ



కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ

పెద్దపల్లికి చెందిన మల్లోజుల కోటేశ్వర్‌రావు ఉరఫ్ కిషన్‌జీ కవితల సేనాని. మావోయిస్టు ఉద్యమంలో తిరుగులేని నేతగా పేరుంది. సున్నితమైన అనేక జీవన పార్శ్వాలను కవితలుగా ఆవిష్కరించారు. పదేళ్ల క్రితం కిషన్‌జీ జంగల్‌మహల్‌లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. సుదీర్ఘ అజ్ఞాతవాసంలో ఉంటూ సాహిత్యాన్ని విస్మరించలేదు. ‘గోదావరి’ కలం పేరుతో అనేక కవితలు రాశారు. ఆంగ్లం, మరాఠీ, హిందీ, బెంగాలీ, ఒరియా భాషలపై పట్టున్న ఆయన అనేక సామాజికాంశాలపై వ్యాసాలు రాశారు. వాళ్ల తల్లి మధురమ్మకు రాసిన ఉత్తరం ఆయనలోని మానవీయతను తెలియజేసింది.

‘సాధన’తో సాగిన వేణుగోపాల్‌రావు



వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ

మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ సోనూ. మల్లోజుల కోటేశ్వర్‌రావు సోదరుడు. అన్నబాటలో సాగిన వేణుగోపాల్ అజ్ఞాతజీవితం సాగిస్తూనే అక్షర సేద్యం సాగించారు. ‘సాధన’ కలం పేరుతో వేణుగోపాల్ అనేక కథలు, కవితలు, వ్యాసాలు రాశారు. విప్లవోద్యమంలో తన పేరు బయటకు రాకుండా అనేక కలం పేర్లతో రచనలు చేశారు. ‘సరిహద్దు’, రాగో నవలలు రాశారు. వేణుగోపాల్ ఇప్పటివరకు 25 కథలు, అనేక వ్యాసాలు అందించారు.

డాక్టర్లే ప్రత్యక్ష దేవుళ్లు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ సంజయ్



ఎంపీ సంజయ్‌ను సత్కరిస్తున్న ఆర్థోపెడిక్ వైద్యులు

కరీంనగర్‌టౌన్: సమాజంలో ఏ రంగానికి లేని గౌరవం ఒక్క వైద్య వృత్తికే ఉందని, అందుకే డాక్టర్లను ప్రత్యక్ష దేవుళ్లుగా భావిస్తుంటారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ ఆర్థోపెడిక్ వైద్యుల 9వ రాష్ట్ర సదస్సు చివరిరోజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థోపెడిక్ రంగంలో వస్తున్న మార్పులు, లేటెస్ట్ టెక్నాలజీని ప్రాక్టికల్‌గా వివరిస్తూ జూనియర్ డాక్టర్లకు అనేక విషయాలపై అవగాహన కల్పిస్తుండటం గొప్ప విషయమన్నారు. దీనిద్వారా పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిర్వహించే సర్జరీలపై కూడా మారుమూల ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగే అవకాశముందని పేర్కొన్నారు. ‘నాకు చాలా బాధ కలిగించే విషయం ఏందంటే.. హైవేలపై నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. సకాలంలో చికిత్స అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. మనం ఎన్ని పనులు చేసినా, ఎంత సాయం చేసినా ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదని’ అన్నారు. అందుకే మోదీ ప్రభుత్వం వచ్చాక నేషనల్ హైవేల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత నిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. యాక్సిడెంట్స్ కాగానే ఆస్పత్రులకు వెళ్తే సర్జరీల పేరుతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విషయంలో వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ‘టీచర్లు, ఇంజినీర్లు, రాజకీయ నాయకులైనా సరే.. ఒక్క డాక్టర్‌ను మాత్రమే దేవుడితో పోలుస్తారని, అంత గొప్ప రంగంలో మీరు పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు. ఒక ఎంపీగా నా నుంచి మీకు ఏ సాయం కావాలన్నా చేతనైనంత మేరకు చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నా, నాకున్న స్వార్థం ఒక్కటే.. పేదలకు తక్కువ ఖర్చుతో ట్రీట్‌మెంట్, సర్జరీలు చేసేందుకు సాయపడాలి’ అని కోరారు. సదస్సులో అసోసియేషన్ బాధ్యులు, డాక్టర్లు గురువారెడ్డి, విజయభాస్కర్, బంగారుస్వామి, మోతీలాల్, నర్సింహులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో వివాహం

- రోడ్డు ప్రమాదంలో పెళ్లికూతురు తండ్రి మృతి



చంద్రయ్య(ఫైల్)

మంథని: మరో వారం రోజుల్లో తన కూతురు వివాహం జరగాల్సి ఉంది. ఆదివారం అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి కూతురు తండ్రి దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిపై నాగారం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన ఉడుత చంద్రయ్య(52) నాగారం సమీపంలో వ్యవసాయ పనులు చూసుకొని టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మంథని నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో చంద్రయ్య కొద్దిదూరం ఎగిరిపడగా బలమైన గాయాలయ్యాయి. వెంటనే అదే కారులో గోదావరిఖనిలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చంద్రయ్య మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య స్వరూప, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఎస్సై–2 రాణివర్మ కేసు నమోదు చేసుకున్నారు.

పెళ్లింట విషాదం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉడుత చంద్రయ్యది పేద రైతు కుటుంబం. తన ఇద్దరు కూతుళ్లకు వివాహం చేశాడు. చిన్నకూతురును గ్రామంలోనే తన సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈనెల 14న వివాహం జరగాల్సి ఉంది. అందుకు అవసరమైన పనుల్లో కుటుంబసభ్యులు నిమగ్నమయ్యారు. ఇంతలోనే కారు రూపంలో వచ్చిన మృత్యువు ఇంటి యజమానిని కబళించింది. ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. కాగా మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడంతో మరో ఇద్దరికి చూపు ఇచ్చాయి.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి



రవికాంత్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామ శివారు బేతాలుడి గుడి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాలు ఢీకొని అమ్మక్కపేట కు చెందిన ఎలాల రవికాంత్‌రెడ్డి(45) మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రవికాంత్‌రెడ్డి ద్విచక్రవాహనంపై అమ్మక్కపేట నుంచి డబ్బా వైపు వస్తుండగా, డబ్బా గ్రామానికి చెందిన గరిగె ప్రసాద్ ద్విచక్రవాహనంపై అమ్మక్కపేట వైపు వెళ్తూ ఎదురెదురుగా ఢీ కొనడంతో రవికాంత్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గరిగె ప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు రవికాంత్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ ఉమాసాగర్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన చొప్పరి అనిల్(21) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అనిల్ కూలీ పని నిమిత్తం జనవరి 25న గ్రామంలోని ఓ ఆసామి కూరగాయల తోటలో గడ్డి మందు స్ప్రే చేసేందుకు వెళ్లాడు. ఇంటికి వెళ్లి రాత్రి భోజనం చేసిన తర్వాత వాంతులు చేసుకోవడంతో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గడ్డి మందు పిచికారీ చేస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురై మృతి చెందాడని మృతుడి అన్న రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

రైస్‌మిల్లులో కూలీ..

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని ఓ రైస్‌మిల్లులో రేకుల షెడ్డు రిపేర్ చేస్తూ కిందపడి కూలీ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రైస్‌మిల్లులో రేకుల షెడ్డు మరమ్మతు పనులను మిల్లు యజమాని ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్(45) అనే కూలీతో కాంట్రాక్టర్ పనులు చేయిస్తున్నాడు. ఇందులో భాగంగా పైపులు బిగిస్తుండగా ప్రమాదవశాస్తు శ్రీనివాస్ జారి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్రవాహనాల చోరీ

పాలకుర్తి: బసంత్‌నగర్‌లో ద్విచక్ర వాహనాల చోరీ స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. వారం రోజుల వ్యవధిలో రెండు బైక్‌లను ఎత్తుకెళ్లారు. కేశోరాం వర్కర్స్ కాలనీలో నివాసం ఉండే ఓ కార్మికుడు వారం క్రితం రాత్రిపూట తన ఇంటివద్ద నిలిపి ఉంచిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. కేశోరాం స్టాఫ్‌కాలనీలో నివాసం ఉండే మరో కార్మికుడు శనివారం ఉదయం స్థానిక బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద తన బైక్‌ను పార్క్ చేసి వేరే గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి వచ్చే చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో బసంత్‌నగర్ బస్టాండ్ ప్రాంతం రద్దీగా ఉంటుంది. మరోవైపు దీనిని ఆనుకుని పోలీసుస్టేషన్ కూడా ఉంది. అయినప్పటికీ దొంగలు బైక్‌లను చోరీచేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్య కూడలి అయిన ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. గతంలో కేశోరాం సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. ఇప్పటికైనా కంపెనీ అధికారులు, పోలీసులు స్పందించి బసంత్‌నగర్ బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చోరీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికవర్ ఆస్పత్రి సేవలు అభినందనీయం



మేయర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కరీంనగర్‌టౌన్: సామాజిక బాధ్యతగా కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి చేస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం 52వ డివిజన్ కార్పొరేటర్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్ నేతృత్వంలో ముకరంపుర మదీనా మజీద్ సమీపంలోని కేకే హైస్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మెడికవర్ యాజమాన్యం పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బీపీ, షుగర్ పరీక్షలతోపాటు ఖరీదైన గుండె వైద్యానికి సంబంధించిన ఈసీజీ, 2డీ ఎకో టెస్టులు, గుండె, జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ వైద్యుల కన్సల్టేషన్, ఉచిత మందులు ఇస్తూ వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్‌హుస్సేన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రామనాథం, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కార్తీక్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రతిష్టారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచేవరకూ పోరాటం



జైలు నుంచి విడుదలైనవారికి స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: పేదలకు భూములు పంచేవరకు పోరాటం ఆగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైల్లా ఆశయ్య, జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 15 వేల మంది పేదలను సమీకరించి, భూ పోరాటం చేసిన 9 మంది నాయకులు రమేశ్, సులోచన, హేమలత, పోచయ్య, శంకర్, నాగరాజు తదితరులు 20 రోజులుగా కరీంనగర్ జైలులో ఉండి ఆదివారం విడుదలైన సందర్భంగా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేసిన నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలులో నిర్బంధించారని అన్నారు. అక్రమ కేసులు, బెదిరింపులు ఉద్యమాలను ఆపలేవని, పేదలకు ఇండ్ల స్థలాలు దక్కేవరకు అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఐక్యంగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మాట్లాడుతూ, కొంతమంది ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలనే కుట్రతో పేదలపై అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రభుత్వం స్పందించి కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పేదల తరపున కేసు వాదించి, బెయిల్ ఇప్పించిన అడ్వకేట్ బీమాసాహెబ్‌కు ప్రజా అభినందనలు తెలియజేసి, సన్మానం చేశారు. సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, నాయకులు యు.శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, నరేశ్, పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంపై కబ్జాదారుల కన్ను

- టీ కొట్టు నిర్వహిస్తున్న దళిత కుటుంబంపై దాడి
- స్థలాన్ని ఖాళీ చేయాలని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం కేసీఆర్ నగర్ కాలనీ వద్ద గల కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలంపై కబ్జాకోరుల కన్ను పడింది. పాలశీతలీకరణ కేంద్రం రోడ్డు మధ్య గల ఖాళీస్థలంలో కేసీఆర్‌నగర్ వాసులు మైసమ్మ, పోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే అదే స్థలంలో రాచర్లగొల్లపల్లికి చెందిన ఓ దళిత కుటుంబం టీకొట్టు పెట్టుకుంది. గత ఎనిమిదేళ్లుగా అదే ప్రాంతంలో టీకొట్టు పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మండల కేంద్రానికి చెందిన కొందరికి ఆ స్థలంపై కన్నుపడింది. టీకొట్టు ఖాళీ చేయాలని దాడి చేయడంతో ఎస్సై రమాకాంత్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు దాసరి కృష్ణంరాజు తెలిపారు. కేసు నమోదు విషయంలో పోలీసులు తీవ్ర జాప్యం చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సోమవారం ప్రజాదివస్‌కు వెళ్లి ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

గిరిజన రైతుపై ఎలుగుబంటి దాడి

- పరిస్థితి విషమం
- హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాకు చెందిన గిరిజన రైతు గుగులోతు హరిలాల్(60)పై ఆదివారం ఎలుగుబంటి దాడి చేసింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ హరిలాల్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎలుగుబంటి దాడితో హరిలాల్ ముఖం గుర్తు పట్టలేనంతగా మారింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. హరిలాల్ ఉదయం పశువులను మేపడానికి సమీప అడవి ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం వరకు పశువులను మేపుకొని తండాకు తిరిగి వస్తుండగా పొదలచాటు నుంచి ఎలుగుబంటి హఠాత్తుగా దాడిచేసింది. హరిలాల్ పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు అక్కడికి చేరుకునేసరికి ముఖం, తల, శరీర భాగాలపై దాడిచేసింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వెంటనే ఎల్లారెడ్డిపేటలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స అందించి హైదరాబాద్‌కు తరలించారు. హరిలాల్ దేవునిగుట్ట తండా తాజా మాజీ సర్పంచ్ గుగులోతు పెంటయ్య తండ్రి. హరిలాల్‌కు భార్య శీల ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మీసేవ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు. దేశంలో బీసీల కుల గణన కోసం పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి పర్శరాంగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు'

కరీంనగర్‌కార్పొరేషన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్యాట రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాల తన హయాంలో బీఆర్ఎస్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజలు మరోసారి గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల మోహన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని క్రీడా పాఠశాలలో గల సింథటిక్ ట్రాక్‌పై 8, 10, 12, 15 సంవత్సరాల బాలబాలికలకు నిర్వహిస్తున్న సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలు ఆదివారం ముగిశాయి. సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు లేక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన 25 మంది క్రీడాకారులను ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు స్పందన


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు విశేష స్పందన లభించింది. సుమారు 161 బాలురు, 97 మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సూర్యపేట జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొని కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.సంపత్‌రావు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సుధాకర్, కరుణాకర్, పద్మ, పీఈటీలు రాజేందర్‌రెడ్డి, హరికృష్ణ, రమేశ్, మల్లేశ్, రఘుపతి, పుష్పలత, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన


గన్నేరువరం: గన్నేరువరంలో వరి పంటలను ఆదివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు పి. గోన్యానాయక్, బలరాం, వెంకటేశ్వర్ రావు, అధిపతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో మొగిపురుగు, అగ్గి తెగులు ఆశించి నష్టం కల్గుజేస్తుందని గుర్తించారు. మొగిపురుగు నివారణకు నాటు వేసిన 10 నుంచి 15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 10 కిలోలు లేదా హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోల చొప్పున 20–25 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజెల్ ఎకరానికి 120 గ్రాములు పిచికారీ చేయడంతోపాటు ఇతర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

రోడ్డు నిర్మాణంతో తాగునీటి సరఫరా బంద్



కరీంనగర్‌రూరల్: జగిత్యాల–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణ పనులతో కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచింది. రోడ్డు పనులతో గ్రామానికి తాగునీటి సరఫరా చేసే పైపులైన్ దెబ్బతినడంతో రెండురోజుల నుంచి నీరు రాక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. నీటి సరఫరా నిలిచిన సమాచారంతో ఆదివారం ఎంపీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, గ్రామప్రత్యేక అధికారి రామకృష్ణ, భగీరథ డిప్యూటీ ఈఈ సూర్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డిలు ఇరుకుల్లవాగులోని రక్షిత బావి, పైపులైన్ పరిశీలించారు. దెబ్బతిన్న పైపులైన్‌కు ప్రత్యామ్నాయంగా కొత్తగా వెయ్యి మీటర్ల పైపులైన్ వేయాలని డీఈఈ సూర్యప్రకాశ్ సూచించారు. పైపులైన్ వేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి రామకృష్ణకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు.

సుందరకాండ పద్యకావ్యం పుస్తకావిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం పెండ్యాల కిషన్‌శర్మ రచించిన సుందరకాండ పద్యకావ్యం పుస్తకాన్ని భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సాహితీవేత్త, హైకోర్టు న్యాయవాది నారుమంచి వెంకట అనంతకృష్ణశర్మ ఆవిష్కరించారు. కావ్యంలోని పద్యాలన్నీ పంచదార చిలకవలె ఉన్నాయని అన్నారు. సుందరకాండపై అనేక ప్రవచనాలు చేసిన కిషన్‌శర్మ పాండిత్యం ఈ కావ్యంలో కనిపిస్తుందని తెలిపారు. అవధాని ముద్దు రాజయ్య మాట్లాడుతూ సుందరకాండ పద్యాల రూపంలో అతి సుందరంగా తీర్చిదిద్దిన కిషన్‌శర్మ గొప్ప పండితుడన్నారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో డీఈవో జనార్దన్‌రావు, కవులు గంద్ర లక్ష్మణరావు, గంప ఉమాపతి, శంకరయ్య, కృష్ణారావు, వేణుగోపాలశర్మ, లక్ష్మణాచార్యులు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలోని లేబర్ అడ్డా, సెయింట్‌జాన్ స్కూల్ ఏరియా, శివ థియేటర్ ఏరియా, భాగ్యనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం

- జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం
- యాసంగిలో 2వేల ఎకరాల సాగు లక్ష్యం

కరీంనగర్‌రూరల్: జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులను ఆయిల్‌పాం సాగుచేసేందుకు చైతన్యపరుస్తున్నారు. యాసంగి సీజన్‌లో పంటసాగు కోసం రైతుల నుంచి మొక్కల కొనుగోలుకు అవసరమైన డీడీలు స్వీకరించారు. రెండేళ్ల నుంచి ఆయిల్‌పాం సాగు లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ, ఉద్యానశాఖలు సంయుక్త భాగస్వామంతో ముందుకెళ్తున్నాయి.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు కోసం ఉద్యానవన, వ్యవసాయ, ఉపాధిహామీ అధికారులు పలు చర్యలు చేపట్టారు. పంట సాగులో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయిల్‌పాం సాగుకు నేలలు, వాతావరణం అనుకూలం కావడంతో పలువురు రైతులు సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు. అంతేకాకుండా పంట సాగులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ ఇతర వర్గాలకు 90శాతం సబ్సిడీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.4,200 చొప్పున ఎకరానికి పంట పెట్టుబడి మంజూరు చేస్తుండటంతో సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు.

యాసంగిలో రెండువేల ఎకరాల్లో సాగు

జిల్లాలో సాంప్రదాయకమైన వరి, పత్తి, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. 2022 సంవత్సరం నుంచి ఆయిల్‌పాం సాగుకు అధికారులు శ్రీకారం చుట్టారు. 2022–23 సంవత్సరంలో 188 మంది రైతులు 613.73 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశారు. ప్రస్తుత యాసంగిలో 2,135.41 ఎకరాల్లో సాగు చేసేందుకు 935 మంది రైతులు డీడీలు చెల్లించారు. ప్రస్తుతం 386 మంది రైతులకు మొక్కలను అందించగా 1082 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా మరికొన్ని రోజుల్లో మిగితా రైతులకు మొక్కలను అందచేయనున్నట్లు ఉద్యానశాఖాధికారి కె.స్వాతి తెలిపారు. రైతులను చైతన్యం చేయడంతో గతేడాది కంటే ఈ ఏడాది ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెరిగినట్లు వివరించారు.


చెర్లభూత్కూర్‌లో సాగు చేసిన ఆయిల్‌పాం తోట


ఆయిల్‌పాం మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి స్వాతి

యాసంగిలో మండలాల వారీగా ఆయిల్‌పాం సాగు వివరాలు

మండలం	డీడీలు కట్టిన రైతులు	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
చిగురుమామిడి	91	217.87
సైదాపూర్	66	169.99
శంకరపట్నం	39	78.72
చొప్పదండి	70	180.66
గంగాధర	101	268.25
రామడుగు	68	135.14
గన్నేరువరం	75	157.66
మానకొండూరు	83	152.37
తిమ్మాపూర్	66	130.11
కొత్తపల్లి	34	67.14
కరీంనగర్‌రూరల్	45	86.80
ఇల్లంతకుంట	44	87.28
హుజూరాబాద్	32	77.23
జమ్మికుంట	72	186.11
వీణవంక	49	140.08

సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలి


డైరీ ఆవిష్కరిస్తున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ నాయకులు

కొత్తపల్లి: సైకాలజిస్టుల సంక్షేమం కోసం కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రాంచందర్ అన్నారు. ఆదివారం రేకుర్తిలోని సాన్వీ డిఫెన్స్ అకాడమీ జూనియర్ కళాశాలలో తెలంగాణ సైకాలజిస్ట్ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైకాలజిస్ట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు గత ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌన్సిల్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సమాజంలో నెలకొన్న మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు మనస్తత్వశాస్త్రం ఎంతో ప్రాముఖ్యత నెలకొన్న నేపథ్యంలో ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలో మానసిక శాస్త్రాన్ని ఒక సబ్జెక్టుగా బోధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎర్రా మల్లేశం అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆడెపు వేణు, కరీంనగర్, సిరిసిల్ల కార్యదర్శులు సోరుపాక ఐలయ్య, ఈశ్వర్, అనిత, నాగేశ్వర్, సతీశ్‌కుమార్, అబ్దుల్ అజీజ్, భుమేష్, శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో 'గావ్ చలో అభియాన్'


బీజేపీ పథకాలను ఇంటింటా ప్రచారం చేస్తున్న నేతలు

కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 39వ డివిజన్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గుండారపు సంపత్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథి హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు. ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక బుక్‌లెట్‌ను డివిజన్ ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు న్యాత ప్రవీణ్, ప్రదీప్, విద్యాసాగర్, రాకేశ్, రమేశ్, శశి, ప్రశాంత్, వంశీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో అభియాన్' విజయవంతం చేయండి

సోమవారం నుంచి ప్రారంభమవుతున్న గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం గావ్ చలో అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, అనుబంధ మోర్చా బాధ్యులందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ హుజురాబాద్ నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బీజేపీ బాధ్యులు తమకు కేటాయించిన గ్రామాలకు సోమవారం తరలివెళ్లాలని సూచించారు.

మఖ్దూమ్ మొహియుద్దీన్ వారసత్వాన్ని కొనసాగిస్తాం


నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: ఆత్మగౌరవ రక్షణ కోసం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘానికి స్థాపకుడిగా మఖ్దూమ్ వ్యవహరించిన బాటలోనే వారసత్వాన్ని కొనసాగిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచారి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, రాష్ట్రోపాధ్యాయ సంఘ స్థాపకుడు మఖ్దూమ్ మొహియుద్దీన్ 115 జయంతి సందర్భంగా ఆదివారం ఎస్టీయూ జిల్లా శాఖ కార్యాలయంలో ముగ్దుం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముగ్దుం మొహియుద్దీన్ ఆశయాల సాధన కోసం బలహీన వర్గాల పక్షపాతిగా సంఘం వ్యవహరిస్తుందని తెలిపారు. విద్యా ఉపాధ్యాయ రంగంలో పేరుకుపోయిన సమస్యలపై ఉపాధ్యాయ, మేధావి వర్గం ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కిషన్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, వెంకటస్వామి, సుభాష్, కె.శ్రీనివాస్, ఖాజామిస్బావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ


కింద పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వరుస దొంగతనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లలోని సామగ్రిని దొంగలు దర్జాగా దోచుకెళ్తుండటం విద్యుత్ అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రి చోరీపై ఏఈ నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మొగ్దుంపూర్ శివారులోని దాడి రాజు అనే రైతు పొలం వద్ద ఉన్న 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులకొట్టి ఆయిల్, కాపర్‌వైర్, ఇతర సామగ్రి దొంగిలించారు. సమాచారం అందుకున్న ఏఈ నరేశ్, జేఎల్ఎం మనోహర్‌లు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఏఈ నరేశ్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామగ్రి విలువ రూ.1.20లక్షల వరకు ఉంటుందన్నారు. ఇప్పటివరకు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులకొట్టి సామగ్రిని దోచుకెళ్లారని, సమగ్ర విచారణ చేయాలని కోరారు.

6న రౌండ్ టేబుల్ సమావేశం


మాట్లాడుతున్న గుంజపడుగు హరిప్రసాద్

కరీంనగర్: మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న కరీంనగర్‌లోని ప్రతిమా కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఆదివారం ఓ సమావేశ మందిరంలో బీసీ కుల సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల కోసం తమ జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అన్నారు. జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ పక్షాన కోరుతూ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి కుల, ప్రజా సంఘాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు జాడి శ్రీనివాస్, బాలసంకుల అనంతరావు, రాజేశ్వరిగౌడ్, శ్రీరాముల రమేష్, మున్న, తుల భాస్కర్‌రావు, జయంత్, గాలిపెల్లి రత్నాకర్ చారి, సత్తు సంతోష్, ఉయ్యాల విష్ణు వర్దన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి


రవీందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తీగలగుట్టపల్లికి చెందిన మూల వెంకట రవీందర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాగృతి నియోజక వర్గ కన్వీనర్‌గా పవన్


నియామక పత్రం అందుకుంటున్న పవన్

కరీంనగర్: భారత జాగృతి కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన పూసాల పవన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నియోజక వర్గంలో జాగృతిని బలోపేతం చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారీ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పసుల చరణ్, రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంతరావు, ఎంపరజీ, గందె కల్పన, సత్తు సంతోష్, ఉయ్యాల విష్ణులకు కృతజ్ఞతలు తెలిపారు.

6న జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న జూనియర్ బాలుర జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నిర్వహణ జిల్లా కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వ్యక్తిగత కిట్టు గ్లౌజ్, స్లగ్గర్, బాల్‌తో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అర్హత ధ్రువపత్రాలను తీసుకొని జెడ్పీహెచ్ఎస్ చొప్పదండి పాఠశాల మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కోమురోజు కృష్ణ వద్ద హాజరు కావాలని తెలిపారు. ప్రతిభ గల సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10, 11 తేదీలలో హన్మకొండ జిల్లాలోని ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 83284 76506 నంబర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

6న రెజ్లర్ల ఎంపికలు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–15, అండర్–20 రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా రెజ్లర్లను ఈనెల 6న ఎంపిక చేయనున్నట్లు అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీంలు తెలిపారు. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికేట్‌లతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 8309901313 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని ఎస్సై వుల్ల అభిలాశ్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసులు నమోదు చేశామన్నారు.

శ్రీహరినగర్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం



నగరంలోని రాంనగర్ పరిధిలో గల శ్రీహరినగర్ కాలనీవాసులు ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అలరించింది. 15 ఏళ్లుగా కాలనీవాసులు ఏటా ఒకరోజు కుటుంబ సమేతంగా కలిసి వేడుకలు జరుపుకుంటున్నారు. మహిళలు, పిల్లలు, పురుషులు వేర్వేరుగా సినీ గీతాలపై నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కాలనీ సంఘం అధ్యక్షుడు మిర్యాల అనిల్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, కచ్చు రవి, మాజీ కార్పొరేటర్ బీర్ల బీరయ్య, కార్యదర్శి కాసర్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు నునుగొండ విరేశం, కోశాధికారి కూర శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి టి.రాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. – కరీంనగర్ కల్చరల్

ప్రైవేటుకు దీటుగా బోధన చేయాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

గంగాధర: ప్రైవేటు కాలేజీలకు దీటుగా బోధన చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చి దిద్దాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యత తీసుకుంటానని గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈమేరకు నిర్వాహణ కోసం ఆదివారం రూ.30 వేలు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను కళాశాల సిబ్బంది సన్మానించారు. విద్యార్థులకు సిబ్బంది సొంత ఖర్చులతో అల్పాహారం అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అధ్యాపకులను ప్రశంసించారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ, మండలి సమావేశాలు

7న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: ఏపీ శాసనసభ, శాసన మండలి సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల సభ్యు లను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై ఈ సమావేశాలు ఎప్పటి వరకు నిర్వహించాలనేది నిర్ణయించనుంది. అదేవిధంగా త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంతకుముందు ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించడానికి ఏడో తేదీ ఉదయం 8గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

సాక్షి, హైదరాబాద్: నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని పేర్కొన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర(యథార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి రవీంద్రభారతి మినీహాలులో నిర్వహించారు. చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను నక్సల్స్ ఉద్యమమే విముక్తిబాట పట్టించిందనే నిజాన్ని సమాజానికి చెప్పాలని సూచించారు. ఆకలి ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని, ఉద్యమాలను ప్రజలకు తెలిపేందుకు ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వీరమల్లు ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ అది రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, రచయిత డాక్టర్‌తైదల పాల్గొన్నారు.

తప్పు.. మీదంటే మీదే

- విద్యాశాఖలో ఇద్దరు అధికారుల మధ్య వాగ్వాదం !
- డిప్యుటేషన్లపై ఆరా తీసిన సీఎంఓ
- సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం .. డిప్యుటేషన్లపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో డిప్యుటేషన్ల వ్యవహారం చిచ్చురేపుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. సమగ్ర వివరాలు అందించాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు ఇస్తున్నారంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా మండిపడుతున్నాయి. సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు సంఘాల నేతలు ఈ వ్యవహారంపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు పంపారు. సాధారణ బదిలీలు చేపట్టకుండా, అయినవారు, ముడుపులు ఇచ్చి న వారిని కోరుకున్న ప్రాంతానికి పంపుతున్నారని సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో టీచర్లు సిటీకి.. చదువులు గాలికి'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అంతర్గత విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

కొత్త వివాదానికి దారి తీస్తున్న డిప్యుటేషన్లు

టీచర్ల డిప్యుటేషన్ అంశం అధికారుల మధ్య కొత్త వివాదానికి దారి తీస్తోంది. విద్యాశాఖలో ఉన్నతాధికారులు కొంతమంది ఈ తంతుతో తమకు సంబంధమే లేదని చెబుతున్నారు. తాను వ్యతిరేకించినా డిప్యుటేషన్ ఆర్డర్ ఎలా వచ్చిందో తెలియదని ఓ అధికారిణి తెలిపారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్నా, ప్రేక్షక పాత్ర పోషించాల్సి వస్తోందని ఆమె నిస్సహాయత వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, విద్యాశాఖ ఉన్నతాధికారి మాత్రం ఈ వాదనతో ఏకీభవించడం లేదు. ఫైల్ సంబంధిత అధికారిణి ద్వారానే తనకు వస్తుందని, ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. మానవతాకోణంలో బదిలీలు చేస్తున్న విషయాన్ని ఆమె ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారో తెలియడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా జరిగినట్టు విద్యాశాఖ వర్గాల సమాచారం. పరస్పరం సీఎంఓకు ఫిర్యాదులు చేసుకుంటున్నవైనం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది.

రంగంలోకి మధ్యవర్తులు

తీవ్ర విమర్శలు వస్తున్నా డిప్యుటేషన్ వ్యవహారం ఆగడం లేదు. ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు గత నెల 11వ తేదీన ఓ టీచర్‌ను డిప్యుటేషన్ ఇస్తూ ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఇవే కాకుండా మరికొన్ని డిప్యుటేషన్లు ఇవ్వడానికి రంగం సిద్ధమైందని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది. డిప్యుటేషన్ల బేరసారాలు పలు జిల్లాల్లో జోరుగా సాగుతున్నాయని టీచర్లు అంటున్నారు. అనారోగ్య సర్టిఫికెట్లు సృష్టించి మరీ డిప్యుటేషన్లు ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారని వారు చెబుతున్నారు. కొంతమంది రాజకీయ పలుకుబడిని ముందుకు తెస్తుంటే, మరికొంతమంది తమకు విద్యాశాఖలో ఉన్నతాధికారి తెలుసునని, ఆయనకు కొంత ముట్టజెబితే డిప్యుటేషన్ సులభమని నమ్మిస్తున్నారని పలువురు టీచర్లు తెలిపారు.

ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి

ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించి విశ్వసనీయతను కాపాడుకోవాలి. పలుకుబడి కలిగిన ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ పేరిట జిల్లాలు దాటించి బదిలీలు చేయటం సమంజసం కాదు. అనారోగ్యం, భార్యభర్తలు తదితర సహేతుక కారణాలతో బదిలీలు చేయాలనుకుంటే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుని అవసరమైన, అర్హులైన ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వటం సమంజసం. ఉపాధ్యాయులు బదిలీలకోసం అడ్డదారులు తొక్కే పరిస్థితి కల్పించారు. నూతనంగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాం.

– చావా రవి, టీఎస్ యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి

2,002ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్

నక్కపల్లి వద్ద రూ.1,235 కోట్లతో ఏర్పాటు

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద 2,001.8 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్ రూపుదిద్దుకోనుంది. ఈ బల్క్‌డ్రగ్ పార్కును ఈపీసీ విధానంలో నిర్మించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. రూ.1,234.75 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్కును డిజైన్ చేసి అభివృద్ధి చేసే విధంగా ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. 2001.8 ఎకరాల్లో.. 139.07 ఎకరాల్లో ఉన్న చెరువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. అభివృద్ధి చేసిన పార్కులో 1,009.85 ఎకరాల్లో ఫార్మా పరిశ్రమలు, 595.4 ఎకరాల్లో ఏపీఐ-డీఐఎస్ సింథసిస్, 414.1 ఎకరాల్లో ఫెర్మిటేషన్స్, 150 ఎకరాలు ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే విధంగా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. మార్చి 18 నాటికి బిడ్డింగ్ ప్రక్రియ పూర్తిచేసి పనులు అప్పగించనున్నారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మూడు బల్క్‌డ్రగ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే.. 16 రాష్ట్రాలతో పోటీ పడి ఆంధ్రప్రదేశ్ ఈ పార్కును కైవసం చేసుకున్న విషయం విదితమే. తొలుత కాకినాడ వద్ద నిర్మించడానికి ప్రయత్నం చేయగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలన్న నిబంధన మేరకు నక్కపల్లి వద్ద పార్కును అభివృద్ధి చేస్తున్నారు.

ఫార్మాహబ్‌గా ఏపీ: ఈ బల్క్‌డ్రగ్ పార్కుతో రాష్ట్రం ఫార్మాహబ్‌గా ఎదగనుంది. ఇప్పటికే రాష్ట్రంలో



300కు పైగా ఫార్మా కంపెనీలున్నాయి. ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే 100కు పైగా ఫార్మా కంపెనీలు కొత్తగా ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు. వీటిద్వారా 27,360 మందికి ప్రత్యక్షంగా ఉపాధికి లభిస్తుందని అంచనా. ప్రస్తుతం దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం 16 శాతం వాటాతో మూడోస్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.41,500 కోట్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వస్తుండగా.. అందులో రూ.8,300 కోట్లకు పైగా ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2,400 ఎకరాల్లో అభివృద్ధి చేసిన జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఇప్పటికే మైలాన్, ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో వంటి 60కి పైగా దిగ్గజసంస్థలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రజా రవాణాను కాపాడుకోవాలి

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

మన్సూరాబాద్: ప్రజా రవాణాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రాష్ట్ర మహాసభ ఎల్బీనగర్ హిమగిరి గార్డెన్స్‌లో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యూనియన్లు లేకుంటే కార్మిక వ్యవస్థ లేదని, కార్మికుల కష్టనష్టాల్లో యూనియన్ల పాత్ర కీలకమన్నారు. ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణకు



హాజరైన ఆర్టీసీ కార్మికులు

ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్లు లేకపోతే కట్టు బానిలం అవుతామని స్పష్టంచేశారు. ఆర్టీసీ ఆస్తులను ఆక్రమించుకునేందుకే గత ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చిందని, కార్మికులకు రావాల్సిన బాకాయిలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఆర్టీసీ టీఎంయూ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశ్వథ్థామరెడ్డిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ కమిటీని రద్దు చేసి యూనియన్ పునరుద్ధరచేయాలనేది ప్రధాన డిమాండ్ అన్నారు.

స్థానిక సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్లు పెంచాలి

మంత్రి కోమటిరెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతి



కాచిగూడ (హైదరాబాద్): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులతో కలిసి కృష్ణయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతంకు తగ్గించారన్నారు. కులగణనకు వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్ తొలగించాలని కోరారు. బీసీల్లో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీబీఐ విచారణలో కాకాణికి క్లీన్‌చిట్

- నెల్లూరు న్యాయస్థానంలో చోరీతో ఆయనకు సంబంధం లేదు
- చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ

సాక్షి, అమరావతి: నెల్లూరు న్యాయస్థానంలో ఫైళ్ల గల్లంతైన కేసులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. ఫైళ్ల గల్లంతు వ్యవహారంతో కాకాణికి ఏమాత్రం సంబంధం లేదని, ఈ కేసులో ఏపీ పోలీసులు సక్రమంగానే దర్యాప్తు చేశారని తేల్చిచెప్పింది. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులుగా పేర్కొన్న సయ్యద్ హయత్, షేక్ ఖాజా అనే ఇద్దరు వ్యక్తులే నెల్లూరు న్యాయస్థానంలో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఫైళ్లను కూడా అపహరించినట్లు నిర్ధారించింది. మంత్రి కాకాణి ఆ ఫైళ్లను దొంగతనం చేయించారన్న టీడీపీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈమేరకు విజయవాడలోని ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్–మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ తాజాగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2022 ఏప్రిల్ 13 రాత్రి కొందరు ఆగంతకులు దొంగతనానికి పాల్పడి ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు పలు పత్రాలను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడ్డ సయ్యద్ హయత్, షేక్ ఖాజాలను అరెస్ట్ చేసి వారి నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు పంపారు. ఈ ఉదంతంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో దాఖలైన కేసులో ఆధారాలను గల్లంతు చేసేందుకు చోరీకి పురిగొల్పారని అభాండాలు వేశారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి కాకాణి దీనిపై సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించారు. న్యాయస్థానం ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరిపి 403 పేజీల చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించింది.

సిఫారసులకు చెల్లు చీటి!

"రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో లూప్‌లైన్‌లో పనిచేసిన ఇద్దరు సీఐలు మంచిర్యాల పోలీస్ స్టేషన్‌కు వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేసుకున్నారు. కానీ ఫలించలేదు.

"జిల్లాలో ముగ్గురు సీఐలు బదిలీ కాకుండా ప్రస్తుతం పనిచేస్తున్న పోలీస్ స్టేషన్‌లోనే ఉండేందుకు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సిఫారసు చేసుకునే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యేలు కొంత అభయం ఇచ్చినప్పటికీ ఇటీవల జరిగిన బదిలీల్లో తమకు బదిలీ ఉత్తర్వులు రావడం గమనార్హం.

"ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో పని చేసిన ఓ సీఐ ఇటీవల జరిగిన బదిలీలకు ముందు జగిత్యాల జిల్లాకు అక్కడి ఎమ్మెల్యే అండతో బదిలీ చేయించుకున్నాడు. తాజా బదిలీల్లో ఆయనకు మళ్లీ బదిలీ ఉత్తర్వులు రావడంతో ఆశలు అడియాసలయ్యాయి.

- నాడు రెఫరెన్స్‌లకే ప్రిఫరెన్సు
- ఖాకీలపై రాజకీయ జోక్యానికి కొత్త ప్రభుత్వం చెక్
- ర్యాంకులు, సర్వీస్ రికార్డ్ ఆధారంగా పోస్టింగులు

మంచిర్యాలక్రైం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పోలీస్ శాఖలో బదిలీలు జరిగాయి. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా పోలీసుల అధికారుల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఖాకీల్లో ప్రక్షాళన చేపట్టారు. రాజకీయ జోక్యం లేకుండా ర్యాంకులు, సర్వీస్ రికార్డ్ ఆధారంగా బదిలీలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండబోదని స్పష్టం చేశారు. ఈ నెల 1న హైదరాబాద్‌లో ఐపీఎస్‌ల గెట్ టుగెదర్ కార్యక్రమంలో ఈమేరు డీజీపీ రవిగుప్తాకు సూచనలు చేశారు.

గతంలో నాయకుల ఆశీస్సులతో..

గత ప్రభుత్వ హయాంలో బదిలీలు పూర్తిగా మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరిగేవి. ఎస్సై



నుంచి ఏసీపీ, డీసీపీ వరకు రాజకీయ నాయకుల సిఫారులతోనే పోస్టింగ్ ఇచ్చేవారు. నచ్చిన పోస్టింగ్ కావాలంటే ముందు స్థానిక ఎమ్మెల్యేకు నచ్చాలి. ఎమ్మెల్యే లెటర్ ఉంటేనే పోస్టింగ్ ఆర్డర్ వచ్చేది. కొత్త ప్రభుత్వం రాజకీయ జోక్యానికి చెక్ పెట్టింది. గతనెల 27 మల్టీజోన్ పరిధిలో 25 మంది సీఐలను బదిలీ చేశారు. వారి పనితీరు ఆధారంగానే బదిలీలు జరిగినట్లు రామగుండం కమిషనరేట్ పరిధిలోని సీఐలు చర్చించుకుంటున్నారు. చాలాకాలంగా లూప్‌లైన్‌లో పనిచేస్తున్నవారికి పోస్టింగ్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. ఇక పైరవీలకు ప్రయత్నించిన వారికి నిరాశే ఎందురైందని తెలుస్తోంది.

ఫలించని వ్యూహం...

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ముడుపులు ముట్టజెప్పి తమకు అనుకూలంగా ఉంటానని లేటర్‌తోనే ఎస్సైలు, సీఐలు పోస్టింగ్ దక్కించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తమను మళ్లీ బదిలీ చేయకుండా ఎమ్మెల్యేల ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎస్సై నుంచి ఏసీపీ వరకు మంచిర్యాల, బెల్లంపెల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ఇందులో మంచిర్యాల, చెన్నూర్ డివిజన్లలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలు, ఓ ఏసీపీ కూడా ఉన్నారని సమాచారం. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో వారి వ్యూహం ఫలించలేదు.

రెవెన్యూకు పూర్వవైభవమే లక్ష్యం

- వీఆర్వో, వీఆర్ఏలను రెవెన్యూకు తెచ్చేలా కృషి
- డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు



మాట్లాడుతున్న వి.లచ్చిరెడ్డి

కైలాస్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ కోల్పోయిన గౌరవాన్ని తిరిగి తెచ్చేలా శాఖకు పూర్వవైభవం తీసుకొస్తామని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. అవమానాలు ఎదుర్కొన్న రెవెన్యూ ఉద్యోగులు ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా శాఖను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని భరోసానిచ్చారు. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడిఆదిలాబాద్‌జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తానుబాధ్యతలు చేపట్టిన 20 రోజుల్లోనే ధరణి ఆపరేటర్ల తొమ్మిది నెలలపెండింగ్ వేతనాలు విడుదల చేయించానని గుర్తు చేశారు. వారిని రెగ్యులరైజ్ చేయడంతో పాటు జిల్లాకు అవసరమయ్యే ఆపరేటర్ల వివరాలను కలెక్టర్ల ద్వారా తెప్పించుకుంటున్నామన్నారు. ప్రభుత్వానికి రూ.10వేల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే రెవెన్యూ శాఖకు బడ్జెట్‌లోనూ అదేస్థాయిలో నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం వీఆర్ఏలను చెట్టుకొకరిని, పుట్టకొకరని పడేసిందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన ఆడబిడ్డలు ఏడుస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిందని అలాంటి వారిని తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకొస్తామన్నారు. ప్రజలకు రెవెన్యూ వ్యవస్థ మరింత దగ్గర కావాలని, ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారి ఉండాలనే ఉద్దేశంతోనే తాను ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీలో సభ్యుడిగా చేరానని తెలిపారు. హక్కులు, బాధ్యతలతోపాటు రెవెన్యూ ఉద్యోగులకు ఎలాంటి కష్టమొచ్చినా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం ఆయనను పలువురు పూలమాల, శాలువాతో సత్కరించారు. జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, మోతీలాల్, ఉమ్మడి జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగనులపై సింగరేణి నజర్

- రాబోయే ఐదేళ్లలో సింగరేణిలో ఏడు నూతన ప్రాజెక్టులు
- ఆ తర్వాత మరో నాలుగు నూతన గనుల తవ్వకానికి ప్లాన్
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ఉన్నతాధికారులు
- వంద మిలియన్ టన్నుల లక్ష్యంపై దృష్టి
- పాజెక్టు, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి



సింగరేణి కార్పొరేట్ కార్యాలయం

గోదావరిఖని: వంద మిలియన్ టన్నుల లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ముందుకు సాగుతోంది. రాబోయే ఐదేళ్లలో మరో ఏడు కొత్త ప్రాజెక్టులు ప్రారంభించాలని యోచిస్తోంది. ఓసీపీల ఏర్పాటుకు యాజమాన్యం ప్రాధాన్యమిస్తోంది. ఏడు కొత్త ప్రాజెక్టుల ద్వారా సుమారు 18 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని ప్రణాళిక రూపొందిస్తోంది.

లక్ష్యం వంద మిలియన్ టన్నులు..

- సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి మరింత పెంచాలని యాజమాన్యం నిర్ణయించింది.
- ప్రస్తుతం 70మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధిస్తుండగా రాబోయే ఐదేళ్లలో వంద మిలియన్ టన్నులకు పెంచాలని ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోంది.
- ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న గనులకు తోడు కొత్తగా ఓసీపీలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది.
- వీటిలో కొత్తవి కొన్ని అయితే, బొగ్గు నిల్వలు పూర్తయిన మరికొన్ని ఓపెన్‌కాస్ట్ బొగ్గు గను(ఓసీపీ)లను విస్తరించబోతున్నారు.
- వీటిద్వారా సుమారు 25 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని యోచిస్తున్నారు.
- రామగుండం రీజియన్‌లో ఓసీపీ–1, 2 స్థానంలో జీడీకే–10 మెగా ఓసీపీని ప్రారంభించనున్నారు.
- దీనిద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని యోచిస్తున్నారు.
- దీనికి సంబంధించిన ప్రణాళికలు ఇప్పటికే పూర్తయ్యాయి.
- పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ దశలో ఉన్నాయి.
- మిగతా వీకే ఓసీపీ ద్వారా ఏటా ఐదు మిలియన్ టన్నులు, జవహర్‌ఖని(జేకే) ఓసీపీ ద్వారా రెండు మిలియన్ టన్నులు, మహవీర్‌ఖని ఓసీపీ(ఎంవీకే) నుంచి రెండు మిలియన్ టన్నులు, గోలేటి ఓసీపీ ద్వారా మూడు మిలియన్ టన్నులు, పీవీఎన్ఆర్ ఓసీపీ నుంచి 2మిలియన్ టన్నులు, ఆర్కేపీ ఎక్స్‌టెన్షన్ ద్వారా రెండు మిలియన్ టన్నులు, మణుగూరు ఓసీపీ ఎక్స్‌టెన్షన్ ద్వారా రెండు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని నిర్ణయించారు.
- అయితే కొత్తగా ప్రారంభించబోయే గనుల్లో అన్ని ఓసీపీలు ఉండడం విశేషం.
- భూగర్భగనులతో నష్టాలు వస్తున్నాయంటూ యాజమాన్యం ఓసీపీలపై దృష్టి సారించింది.

వచ్చే ఐదేళ్లలో కొత్త ఓసీపీలు

కొత్త గని	ఏటా ఉత్పత్తి (మిలియన్ టన్నుల్లో)
వీకే	5
జేకే, రాంపేడు	2
ఎంవీకే	2
గోలేటి	3
పీవీఎన్ఆర్ వెంకటాపూర్	2
ఆర్కేపీ ఎక్స్‌టెన్షన్	2
మణుగూరు ఎక్స్‌టెన్షన్	2
జీడీకే–10	6

లక్ష్యం వంద మిలియన్ టన్నులు


రాబోయే ఐదేళ్లలో 25 మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి పెంచాలని చూస్తున్నారు. ఏటా వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఐదేళ్ల తర్వాత మరోనాలుగు కొత్త గనులు ప్రారంభిస్తాం. తొలి మొదటి గనులకు సంబంధించి ప్రణాళికలు పూర్తయ్యాయి. అనుమతుల దశలో ఉన్నాయి. త్వరగా అనుమతుల ప్రక్రియ పూర్తిచేసి ఉత్పత్తి దశలోకి తీసుకు రావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్, ప్రాజెక్టు, ప్లానింగ్

భవిష్యత్‌లో మరో నాలుగు గనులు

రాబోయే ఐదేళ్ల తర్వాత మరిన్ని ఓసీపీలు ఏర్పాటు చేయాలనే ప్రణాళికలు ఇప్పుడే ప్రారంభించారు. ఆర్కే–5, 6 భూగర్భ గనులను కలిపి ఓసీపీ ఏర్పాటు చేసి 2మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, కేకే–5 గనిని ఓసీపీ చేసి రెండు మిలియన్ టన్నులు, ఆరే–7, ఆర్కే న్యూటెక్ గనుల నుంచి ఓసీపీ ఏర్పాటు చేసి రెండు మిలియన్ టన్నులు, భూపాలపల్లి కేటీకే ఓసీపీలో అడ్రియాల ప్రాజెక్టు తరహాలో భూగర్భగని ఏర్పాటు చేసి ఏటా 30లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే ఏటా 8.30మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

28 వరకు ప్యాసింజర్ రైళ్ల రద్దు



రామగుండం: కాజీపేట – కాగజ్‌నగర్ మధ్య నడిచే ప్యాసింజర్, వారాంతపు రైళ్లను సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాగజ్‌నగర్–సికింద్రాబాద్ మధ్య రోజూ ఉదయం నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును కాగజ్‌నగర్–కాజీపేట వరకే పరిమితం చేశామని వివరించారు. రద్దయిన రైళ్ల వివరాలు..

- రైలు నంబరు 17011/12 హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ : ఇరువైపులా ఈనెల 11వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 12757/58 సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ : ఇరువైపులా ఈనెల 11వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 07765/66 సిర్పూర్‌టౌన్–కరీంనగర్ మెమూ పుష్‌పుల్ : ఇరువైపులా ఈనెల 28వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 17003/04 కాజీపేట జంక్షన్–సిర్పూర్‌టౌన్ రామగిరి ప్యాసింజర్ : ఇరువైపులా ఈనెల 28వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 16317/18 కన్యాకుమారి–శ్రీమాతావైష్ణోదేవి కాత్రా హిమాసాగర్ : ఇరువైపులా ఈనెల 7వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 16032 శ్రీమాతావైష్ణోదేవి కాత్రా–చెన్నై సెంట్రల్ అండమాన్ ఎక్స్‌ప్రెస్ : ఈనెల 8వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 12626 న్యూఢిల్లీ–త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్ : ఈనెల 6వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 22647/48 కోర్బా–కొచ్చువెల్లి కోర్బా ఎక్స్‌ప్రెస్ : ఈనెల 7వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 12192/94 యశ్వంతపూర్–జబల్‌పూర్ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ : వారాంతపు రైలు : ఈనెల 26వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 22533/34 గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వారాంతపు రైలు : ఈనెల 28వ తేదీ వరకు రద్దు
- రైలు నంబరు 16093 చెన్నై–లక్నో : లక్నో ఎక్స్‌ప్రెస్ : వారాంతపు రైలు : ఈనెల 27వ తేదీ వరకు రద్దు

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు..

- రైలు నంబరు 17233/34 సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ : ఈనెల 11వ తేదీ వరకు కాజీపేట వరకు మాత్రమే రాకపోకలు.

సన్నిధి

మంచిమాట



భయం ప్రకృతి వరం

అన్ని జీవులతో పాటు మనిషికి కూడా భయం పుట్టుకతోనే ఉంది. సహజమైన భయానికి తోడు మానవుడు కృత్రిమమైన భయాన్ని కల్పించుకో గలడు. మనిషి ఆ విధంగా కల్పించుకున్న భయాలు ఎన్నో! అన్నీ భయాలే. రేపటి సంగతి ఏమిటి? ఈ భయం కారణంగానే దాచుకోటాలు, దోచుకోటాలు మొదలైనవి.

ఆహార నిద్రాభయమైథునాలు సర్వజీవులకు సామాన్యమే. ప్రకృతి సిద్ధం. ఆహారం ప్రాణం నిలబడటానికి. శరీరం అనే యంత్రం పని చేయటానికి తగిన శక్తి నిచ్చే ఇంధనం ఆహారం. రక్షణ కోసం ప్రకృతి చేత సమకూర్చ బడింది భయం. తెలియకపోవటం వల్ల భయం కలుగుతుంది. భయపడటం వల్ల రక్షణ జరుగుతుంది. భయం లేకపోతే చీకటిగా ఉన్న చోటుకి అయినా నిస్సందేహంగా వెళ్ళటం జరుగుతుంది. ఎత్తు పల్లాలు తెలియక దెబ్బలు తగలటమో, గోతిలో పడటమో, ముళ్ళో రాళ్ళో కాలికి గుచ్చుకుని గాయాలు కావటమో, ఏ తేలో పామో ఉండి ప్రాణం మీదికి రావటమో జరిగే అవకాశం ఉంది. తెలియని వారెవరైనా ఉండి మీద పడితే ప్రాణ హాని కూడా జరగవచ్చు. భయం ఇంకా తెలియని పసిపిల్లలు చీమలని, పాములని కూడా పట్టుకునే ప్రయత్నం చేయటం గమనించ వచ్చు. వెలుగుతున్న దీపాన్ని పట్టుకోటానికి చూస్తారు. ఒక సారి వేడి తగిలితే మరొకసారి భయపడతారు.

మానవులకు జంతువుల కన్న అధికంగా మెదడు, దానితో ఆలోచన, విచక్షణాజ్ఞానం కూడా ఇచ్చింది ప్రకృతి. దానిని ఉపయోగించుకుని మేలు పొందటానికి బదులు లేనిపోని భయాలు సృష్టించుకుని బాధ పడటం జరుగుతోంది. తన అభిప్రాయాలని ఇతరులు అంగీకరించరేమో! తన గురించి ఏమనుకుంటారో? అనుకున్నది జరగదేమో! అపజయాన్ని ఎదుర్కోవలసి వస్తుందేమో! ఇవన్నీ కల్పితాలే కాని, సహజసిద్ధం కావు కదా!

ఈ భయాల వల్ల రక్షణ కలగక పోగా దుఃఖం కలుగుతుంది. జంతువులకి భయం ఉంది కాని, దుఃఖం లేదు. అవి భయాలని తాముగా కల్పించుకో లేదు కదా! వాటి భయం వాటికి రక్షణ నిస్తుంది.

ఎదుటివారి భయాన్ని తమకు రక్షణగా చేసుకో గలిగిన తెలివితేటలు కూడా ఉన్నాయి మనిషికి. పొలాల్లో కాపలా ఉండేవారు కాని, అడవిలో సంచరించేవారు కాని, రాత్రిళ్ళు నెగళ్ల (మంటలు) వేసుకుంటారు. అడవి జంతువులు మంటలని చూసి భయపడి సమీపించవు అని.

మృత్యుభయం అన్నింటి కన్న పెద్దభయం. బుద్ధిజీవులైన మానవులకి మృత్యువు తప్పదని తెలుసు. తెలియని జంతువులే నయం. ప్రాణాల మీద ఆశని సునాయాసంగా వదులుకోగలవు. శరీరం కష్టపడుతుంటే దానిని వెంటనే వదిలేస్తాయి అని పశువైద్యులు చెప్పిన మాట. మానవులు స్పృహ లేక పోయినా బతికి ఉండాలని ప్రయత్నం చేస్తారు, కష్టపడతారు. జంతువులు మరణభయాన్ని జయించి నట్టు చెప్పుకోవచ్చును. మనిషి స్వయంకృతంగా తెచ్చి పెట్టుకున్న దుఃఖహేతువయిన భయాలు శారీరక, మానసిక అనారోగ్యాలకి కారణాలు అవుతాయి. అటువంటి భయాలని వదలాలి.

కొన్ని భయాలు ఉండాలి. ధర్మం తప్పుతానేమో, ఇతరులకి నా పనుల వల్ల బాధ కలుగుతుందేమో, కర్తవ్యనిర్వహణలో ఏమరుపాటు కలుగుతుందేమో .. వంటివి ఆరోగ్యకరమైన భయాలు.

భయం అన్నది ప్రమాదాలని కొని తెచ్చుకోకుండా కాపాడటానికి ప్రకృతి సర్వజీవులకు ప్రసాదించిన వరం. జంతువులకు భయం వర్తమాన కాలానికి మాత్రమే పరిమితమై ఉంటుంది తరచుగా. కాని, మనిషి మాత్రం భూత భవిష్యత్ కాలాలలోకి కూడా భయాన్ని విస్తరింప చేయ గలడు. జరిగిపోయిన దానిని తలుచుకుని, మళ్ళీ అట్లా అవుతుందేమోనని భయం. జరిగింది మంచి అయితే మళ్ళీ అట్లా జరగదేమోనని భయం. వృద్ధాప్యంలో పిల్లలు చూడరేమోనని భయం. వాళ్ళ చిన్నతనంలో సరిగా చదవరేమో, అందరిలో అవమానం పాలు అవాలేమో, వాళ్ళకి తగిన ఉద్యోగం వస్తుందో రాదో, సరైన సంబంధాలు కుదురుతాయో లేదో... ఇలా సాగుతూ ఉంటాయి. వాటికోసం తగిన ప్రయత్నం చేయాలి కాని భయపడితే ఏం ప్రయోజనం?

– డా. ఎన్. అనంత లక్ష్మి

వాగ్గేయకార వైభవం



తతః కిం? తతః కిం ?...

శంకరాచార్యులవారు గుర్వష్టకం అని ఒక అష్టకం చేసారు. విచిత్రం ఏమిటంటే ... దానిలో ప్రతి శ్లోకం చివర్లో.. ఒక ప్రశ్న వేసారు. ''శరీరం సురూపం తథా వా కళత్రం/యశశ్చారు చిత్రం ధనమ్ మేరు తుల్యం /మనశ్చేన లగ్నంగురోర ఙ్ఘ్రిపద్మే/ తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్''... శరీరం సురూపం...చూస్తే మంచి అందమైన రూపం, తథావా కళత్రం.. ఆయన ఎంత అందగాడో భార్య అంత అందగత్తె. వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. యశస్ చారు చిత్రం... ఆయన కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. అపారమైన కీర్తి గడించాడు... అంటే అన్ని మంచి పనులు చేసాడు. ధనం మేరు తుల్యం... ఆయన దగ్గర సంపద మేరు పర్వతం అంత ఉంది. మనశ్చే న లగ్నం... కానీ గురువుగారి పాదపద్మములమీద మనసు నిలబడకపోతే... ఇన్ని ఉన్నా... తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్... ఏం ప్రయోజనం ? ఏం ప్రయోజనం ? ఏం ప్రయోజనం ?...అని.

''విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః/సదాచారవృత్తేషు మత్తో చాన్యః/ మనశ్చేన లగ్నంగురోరఙ్ఘ్రిపద్మే/ తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్''..విదేశాల్లో కీర్తి పొందాడు, స్వదేశంలో ధన్యుడు. ఇలా కనబడితే చాలు.. ఆయనకు చేతులెత్తి నమస్కారం చేస్తారు. అంత ధన్యజీవి... అయితేనేం? గురువుగారి మీద నమ్మకం కుదరనప్పుడు... అంటే సనాతన ధర్మంలో మనిషి తప్పకుండా పొంది తీరాల్సినది – గురుభక్తి. గురువుగారి పేరు వినబడగానే భయభక్తులతో ఆయన పేరు కూడా పలకకుండా అమ్మో ఆయన మా గురువుగారంటూ రెండు చేతులూ అప్రయత్నంగా జోడించి నమస్కరించగలిగిన స్థితి. ఆ భక్తి, ఆ ఆనంద బాష్పాలు ఎవరి కళ్ళల్లో కనబడతాయో వారి జన్మ ధన్యం. ఆ గురు భక్తి వారిని కాపాడుతుంది. దీనిని మనం వాగ్గేయకారులందరిలో గమనించవచ్చు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురువుగారు రోజూ నదీ స్నానం చేస్తున్నారు. తనూ వెడుతున్నాడు. ఎప్పుడయినా ..'' గురువు గారూ, రోజూ గంగానదికి వెళ్ళి స్నానం చేయడం ఎందుకండీ... మన ఇంట్లో నూతిలో వచ్చే నీళ్ళు కూడా ఆ గంగలో వేకదా! రోజూ అంత శ్రమపడి అక్కడిదాకా వెళ్ళడం ఎందుకండీ.. అది కూడా మార్గశిర మాసంలో, పుష్య మాసంలో గంగానదీ స్నానం చేయడం అంత తేలిక కాదు కదండీ..''అని ముత్తుస్వామి దీక్షితులు వారు వారి గురువుగారిని అడిగి ఉండవచ్చు కదా!

కాదు.. ఒరేయ్! గంగకు ఒక గొప్పతనం ఉందిరా. అది మామూలు నీరు మాత్రమే కాదు. ప్రతి నదికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. అలాగే గంగకు, గోదావరికి కూడా... ఆమె అనుగ్రహించ గలదు...అని గురువుగారు చెబుతారు... అసలు అలా చెప్పే అవసరం లేనంత నమ్మకం గురువుగారి మీద, ఆయన మాట మీద ఉండాలి.

బౌద్ధవాణి

పది రకాల శిక్షణలు

అది అవంతీరాజ్య పొలిమేర. విశాలమైన మైదానం. దాని చుట్టూ చిట్టడవి. ఆ మైదానానికి ఒక పక్కగా చిన్న నదీపాయ ప్రవహిస్తోంది. ఆ నది గట్టు మీద పెద్ద మర్రి చెట్టు. పెద్ద పెద్ద ఊడలు దిగి నలుమూలకూ విస్తరించింది. ఒక శాఖ కింద చక్కటి పర్ణశాల. పర్ణశాల ముందు చిన్న అరుగు. దానిపై కూర్చుని మైదానం కేసి చూస్తూ ఉన్నాడు బుద్ధుడు.

ఎన్నో రోజుల నుండి అక్కడే ఉంటున్నాడు. శిష్యులకు శిక్షణ ఇస్తూ నిరంతరం ధర్మాన్ని బోధిస్తూ ఉన్నాడు. ఆ మైదానంలో అవంతీ రాజ గుర్రాలకు శిక్షణ ఇస్తున్నారు.

వారి దగ్గర బలమైన, ఎత్తైన గాంధార అశ్వాలు ఉన్నాయి. నిరంతరాయంగా వాటి శిక్షణ కొనసాగుతూనే ఉంది.


బౌద్ధ భిక్షువుల జీవితం కూడా నిరంతర శిక్షణతోనే నడిచిపోతూ ఉంటుంది. భిక్షువులకు, భిక్షుణీలకు కొన్ని నియమాలు, నిబంధనలూ ఉంటాయి. వాటిని పాటిస్తూ, క్రమశిక్షణతో జీవించాలి వారు. నిరంతర అధ్యయనం, నిర్దిష్టమైన శిక్షణ వల్ల వారు మంచి జ్ఞానులుగా, గొప్ప భిక్షువులుగా రాణిస్తారు. అయితే కొందరు ఎంత శిక్షణ పొందినా దోషాలు చేసి వాటిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తారు.

మన చుట్టూ ఉన్న సమాజంలో దోషాలు ఎక్కువగా ఉండే శిక్షణా నియమాలు ఎక్కువ ఉంటాయి. అలా ఉన్నప్పటికీ తక్కువ మందికి మాత్రమే అంతిమ జ్ఞానం కలుగుతుంది.

ఈ విషయం మీదే ఆరోజు బుద్ధుడు వారితో మాట్లాడుతూ

''భిక్షువులారా! అదిగో అటు చూడండి. అశ్వ శిక్షకుడు ఒక్కో అశ్వానికి ఎలాంటి శిక్షణ ఇస్తున్నాడు? ముందుగా దాని నోటికి కళ్ళెం వేస్తున్నాడు. అంతకు ముందు కళ్ళెం అలవాటు లేకపోవడం వల్ల అది కుచించుకుపోతుంది. తలను అటూ ఇటూ కొట్టుకుంటుంది. కానీ... నిరంతరం దానికి కళ్ళెం వేయడం వల్ల నెమ్మదిగా అలవాటు పడుతుంది. శాంతిస్తుంది.

అది అలా శాంతించిన తర్వాత ఆ శిక్షకుడు దానిపై జీను వేస్తాడు. అంతకుముందు జీను అలవాటు లేకపోవడం వల్ల... మరలా మెలికలు తిరుగుతుంది. గెంతుతుంది. అశాంతిగా ఉంటుంది. నెమ్మదిగా దానికీ అలవాటు పడ్డాక శాంతిస్తుంది. ఆ తర్వాత దూకడం, వెనక్కు నడవడం, సకిలించడం, మెలితిరిగి శత్రువుల నుండి తప్పుకోవడం, వంగి తనపైనున్న రౌతుని రక్షించడం, వేగంగా పరుగు తీయడం, అతి మెల్లగా నడవడం, కవాతు తొక్కడం... ఇలా అనేక విద్యలు ఒకదాని తర్వాత మరొకటి నేర్పుతాడు.. ఇలా ఈ పది రకాలుగా శిక్షణ పొందిన అశ్వం రాజుకు తగినది అవుతుంది. అలాంటి అశ్వం రాజుకు విజయాన్ని తెచ్చిపెడుతుంది.''



''భిక్షువులారా! అలాగే మనం కూడా మన మనస్సుకు శిక్షణ ఇవ్వాలి. దాన్ని అదుపులో ఉంచాలి. సరైన మార్గంలో నడిపించాలి. దానికీ పదిరకాల శిక్షణలు ఉన్నాయి'' అన్నాడు.

''భగవాన్ శెలవియ్యండి'' అన్నారు భిక్షువులు. నది మీది నుండి గాలి తెమ్మెర వచ్చింది. కొమ్మలు ఊగాయి. గలగలలాడాయి. నది నీటిపైన రెండు బారుల్లో అర్ధ చంద్రాకారంగా ఎగురుతూ కొంగల గుంపు దక్షిణం వైపుకు సాగిపోతూ ఉంది.

''భిక్షువులారా! అష్టాంగాలలోని సరైన దృష్టి, సరైన సంకల్పం, సరైన వాక్కు, సరైన కర్మ, సరైన జీవనం, సరైన ప్రయత్నం, సరైన ఎరుక, సరైన సమాధి స్థితి– ఈ ఎనిమిదింటితో పాటు సరైన జ్ఞానం అలవర్చుకుంటే... సరైన చిత్త విముక్తి కల్గుతుంది. చిత్తం దోషరహితమవుతుంది. అలాంటి భిక్షువు మాత్రమే సత్కరించడానికి అర్హుడు. దక్షిణలు తీసుకోవడానికి తగినవాడు. నమస్కరించడానికి యోగ్యుడు. అలాంటి వాని చిత్తం మాత్రమే సాటిలేని పుణ్యక్షేత్రం'' అన్నాడు.

సాధనలో నిర్లక్ష్యం చేసేవారికి తమ తప్పు తెలిసింది. వారు సక్రమంగా సాధన చేసి అనతి కాలంలో పరిపూర్ణులయ్యారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

బ్యాక్ టు హోమ్


● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు జర్మనీ నుంచి హైదరాబాద్ తిరిగొచ్చారు. హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాను కేఎల్ నారాయణ నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఫిట్‌నెస్ ట్రైనింగ్, ఓ వర్క్‌షాప్‌లో భాగంగా మహేశ్ బాబు ఇటీవల జర్మనీ వెళ్లారు. ఈ ఫిట్‌నెస్ ట్రైనింగ్‌ను పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్‌లోని స్వగృహానికి చేరుకున్నారాయన. కాగా ఈ సినిమాలో హీరో నాగార్జున ఓ కీలక పాత్రలో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమయ్యేలా రాజమౌళి ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఈ మూవీ గురించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

మళ్లీ షురూ


● ప్రభాస్


ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైంటిఫిక్ ఫ్యూచరిస్ట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపికా పదుకొనె హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశాపటానీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హీరోలు నాని, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ మేజర్ షెడ్యూల్ ఈ నెల రెండో వారంలో చిత్రీకరించేలా ప్లాన్ చేశారట నాగ్ అశ్విన్. ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొనె.. ఇలా ఈ సినిమా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని సమాచారం. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా ప్రధాన భాగం చిత్రీకరణ పూర్తవుతుందని టాక్. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' సినిమా మే 9న విడుదల కానుంది.


● టీజీ విశ్వప్రసాద్, అనుపమా పరమేశ్వరన్, రవితేజ, కావ్యా థాపర్, కార్తీక్ ఘట్టమనేని, వివేక్ కూచిభొట్ల

నేను కూడా సిద్ధం - రవితేజ

''పీపుల్ మీడియా ఫ్యాక్టరీ' బ్యానర్ నాకు హోమ్ ప్రొడక్షన్ లాంటిది. విశ్వ ప్రసాద్, వివేక్‌గార్లతో పనిచేయడం సౌకర్యంగా ఉంటుంది.. ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారు.. అన్ని విషయాల్లోనూ చాలా స్పష్టంగా ఉంటారు.. అందుకే వారితో పనిచేయడం నాకు ఇష్టం. నాతో మరిన్ని సినిమాలు చేయాలని ఉందని విశ్వ ప్రసాద్‌గారు అంటున్నారు.. ఈ బ్యానర్‌లో ఎన్ని సినిమాలు చేయడానికైనా నేను కూడా సిద్ధం'' అని హీరో రవితేజ అన్నారు. ఆయన హీరోగా కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో రవితేజ మాట్లాడుతూ– ''ఈగల్' సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకుల స్పందన చూసేందుకు నేను కూడా వేచి చూస్తున్నా. ఈ సినిమాకి తన సంగీతంతో ఇరగదీశాడు డేవ్ జాంద్. బాలనటుడు ధ్రువన్ పాత్ర బాగుంటుంది.. పిల్లలందరూ తన పాత్రకి బాగా కనెక్ట్ అవుతారు. 'ఈగల్' కథని నడిపించేది అనుపమ పాత్రే. కావ్యది లవ్లీ క్యారెక్టర్. కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రాన్ని ఎంతో క్లారిటీతో తీశాడు. ఈ సినిమా విజయం సాధించి, తనకు చాలా మంచి పేరు రావాలి. నాకు నేను విపరీతంగా నచ్చిన పాత్ర 'ఈగల్'.. ఈ పాత్ర కోసం చాలా మేకోవర్ అయ్యాను. ఈ చిత్రం రిలీజ్ కోసం వేచి చూస్తున్నా'' అన్నారు. కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ–''ఈగల్' కి దాదాపు 200 మంది సాంకేతిక నిపుణులు పనిచేశారు. ఇంతమందితో పనిచేసే అవకాశం నాకు ఇచ్చిన రవితేజ సర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి థియేటర్ అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''మా సంస్థలో వరుసగా మూడు సినిమాలు చేస్తున్న రవితేజగారికి థ్యాంక్స్. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలనుంది. 'ఈగల్'ని అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''మళ్లీ మళ్లీ రవితేజగారితో పనిచేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. ''రవితేజగారు వెర్సటైల్ యాక్టర్. 'ఈగల్' హాలీవుడ్ మూవీలా అద్భుతంగా ఉంటుంది. కానీ, తెలుగు నేటివిటీ ఎక్కడా మిస్ అవదు'' అన్నారు చిత్ర సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల.

గోవాలో మాఫియా


● ధనుష్

ధనుష్ హీరోగా దర్శకుడు శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ముంబై నేపథ్యంతో మాఫియా యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో నాగార్జున ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ తిరుపతిలో ప్రారంభమైంది. కాగా ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో జరగనున్నట్లు తెలిసింది. దాదాపు రెండు వారాలపాటు సాగే ఈ షెడ్యూల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తారట దర్శకులు శేఖర్ కమ్ముల. ఈ షెడ్యూల్‌లోనే రష్మికా మందన్నా కూడా జాయిన్ అవుతారట. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


● శ్రుతీహాసన్

లారెన్స్‌తో జోడీ?

హీరో లారెన్స్‌కి జోడీగా హీరోయిన్ శ్రుతీహాసన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. 'రైడ్, వీర, రాక్షసుడు, ఖిలాడి' వంటి పలు చిత్రాలతో తెలుగులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు దర్శకుడు రమేష్ వర్మ. ఆయన దర్శకత్వంలో రాఘవ లారెన్స్ హీరోగా ఓ ప్రాజెక్ట్ ఓకే అయిన సంగతి తెలిసిందే. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ నిర్మించనున్నారు. ఈ చిత్రానికి 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. కాగా ఈ మూవీలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందట. అందులో ఒక హీరోయిన్‌గా ఇప్పటికే నయనతార పేరు వినిపించింది.. మరో కథానాయికగా శ్రుతీహాసన్ నటిస్తారనే వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇదిలా ఉంటే ఈ మూవీలో లారెన్స్‌కి జోడీగా 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ నటించనున్నారంటూ గత ఏడాది వార్తలు వచ్చినా, ఆ తర్వాత ఎలాంటి ప్రకటన లేదు. తాజాగా నయనతార, శ్రుతీహాసన్ పేర్లు వినిపిస్తున్నాయి. ఈ నెలలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని టాక్. దాదాపు 150 కోట్ల బడ్జెట్‌తో హారర్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుందని భోగట్టా.

నాకు పదవీకాంక్ష లేదు - వి.సముద్ర


● ప్యానల్ సభ్యులతో వి.సముద్ర

''ఈ ఏడాది జరగనున్న 'తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్' ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి నేను పోటీ చేస్తున్నా. నాకు ఎలాంటి పదవీకాంక్ష లేదు.. అందరికీ సేవ చేయాలనే మంచి ఆలోచనతో పోటీ చేస్తున్నాను'' అని డైరెక్టర్ వి.సముద్ర అన్నారు. 'తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ 2024' ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తన ప్యానల్ సభ్యులతో కలిసి మేనిఫెస్టోని ప్రకటించారు వి.సముద్ర. అనంతరం ఆయన మాట్లాడుతూ–''ఈ ఎన్నికల్లో మా ప్యానల్‌ని, అధ్యక్షునిగా నన్ను గెలిపిస్తే మేనిఫెస్టోలోని హామీలను కచ్చితంగా అమలు చేస్తాం'' అన్నారు. ''సముద్ర ప్యానల్ నుంచి జనరల్ సెక్రటరీగా పోటీ చేస్తున్నాను'' అన్నారు డైరెక్టర్ మద్దినేని రమేష్. ఈ సమావేశంలో దర్శకులు మధుసూదన్ రెడ్డి, కస్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన ప్రేమికుడు


● గౌరీప్రియ, మణికందన్

మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పణలో నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేషన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకలో మారుతి మాట్లాడుతూ–''ఒక జంట మధ్య ఏర్పడిన పరిస్థితుల వల్ల ఒక ప్రేమికుడు తన ప్రేమను కాపాడుకునేందుకు ఏం చేశాడు? అనేది ఈ సినిమా కథ. ప్రభాస్‌గారి అభిమానులు ఆశించిన దానికంటే గొప్పగానే 'రాజా సాబ్' ఉంటుందని మాట ఇస్తున్నా'' అన్నారు. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ–''మేము నిర్మించిన 'బేబి' సినిమా చూసినప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో ఈ 'ట్రూ లవర్' సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తున్నప్పుడు అలాంటి ఎగ్జైట్‌మెంట్ వచ్చింది' అన్నారు. ''ట్రూ లవర్' సినిమా యువతకు మాత్రమే కాదు.. కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చేలా ఉంటుంది'' అన్నారు మణికందన్.

అయ్యో పాపం!


● సుధీర్, దివ్యభారతి

''సండేలాంటి లైఫు.. మండేలా మండుతోంది. ఈ గుండెల్లోన బీటు.. చావు డప్పై మోగుతోంది..'' అంటూ మొదలవుతుంది 'జీ.ఓ.ఏ.టీ' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సినిమాలోని 'అయ్యో పాపం సారూ..' పాట. 'సుడిగాలి' సుధీర్, దివ్యభారతి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'పాగల్' ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్నారు. చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలో సుధీర్, దివ్యభారతిలపై కీలక సన్నివేశాలను తీస్తున్నారు. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరిస్తారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా 'అయ్యో పాపం సారూ.. ఎట్టా బుక్కయ్యారు.. లారీ గుద్దిన ఆటోలా డెబ్బైపోయారు..' అనే పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి లియోన్ జేమ్స్ సంగీతం అందించగా, సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించారు. సీన్ రోల్డాన్ పాడారు. ''ఈ సినిమా సుధీర్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి.



మెయిన్ 'డ్రా'కు రష్మిక అర్హత

ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడి పాటి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. ముంబైలో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో ప్రపంచ 521వ ర్యాంకర్ రష్మిక 6-3, 3-6, 6-3తో ప్రపంచ 482వ ర్యాంకర్ విక్టోరియా మొర్వా యోవా (స్లొవేకియా)పై విజయం సాధించింది. 2 గంటల 28 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఆరు ఏస్‌లు సంధించింది.



ఆసీస్‌ను గెలిపించిన సీన్ అబాట్

వెస్టిండీస్‌తో సిడ్నీలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సీన్ అబాట్ (63 బంతుల్లో 69 ; 1 ఫోర్, 4 సిక్స్‌లు; 3 వికెట్లు, 2 క్యాచ్‌లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ముందుగా ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్లకు 258 పరుగులు సాధించగా... వెస్టిండీస్ 43.3 ఓవర్లలో 175 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది.

గెలుపు తలుపు తట్టేదెవరు!



డకెట్ క్యాచ్ అందుకుంటున్న భరత్


రసపట్టులో రెండో టెస్టు ● ఇంగ్లండ్ విజయ లక్ష్యం 399 ● ప్రస్తుతం 67/1
● భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 255 ఆలౌట్ ● శుబ్‌మన్ గిల్ సెంచరీ

విశాఖ స్పోర్ట్స్: నేడో రేపో ఫలితం గ్యారంటీ! ఎలాంటి 'డ్రా' మలుపులు లేకుండా ఈ టెస్టును బౌలర్లు నడిపిస్తున్నారు. నాలుగో రోజు కూడా బౌలింగ్ కుదిరితే భారత్ గెలుపు తలుపు తట్టడం ఖాయమవుతుంది. అలాగని టెస్టుల్లో ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆటతీరును తక్కువ అంచనా వేస్తే మాత్రం హైదరాబాద్‌లో ఎదురైన చేదు ఫలితం తప్పదు. ఈ ప్రమాదం నుంచి బయట పడాలంటే ఇంగ్లండ్ స్పిన్ మ్యాజిక్‌తో ఎలాగైతే భారత రెండో ఇన్నింగ్స్‌ను బోల్తా కొట్టించిందో... మన స్పిన్నర్లు అదే మాయాజాలంతో దెబ్బకుదెబ్బ తీయాల్సిందే! వికెట్ల వేట భారత్‌ను గెలిపిస్తుందా... లేదంటే ఇంగ్లండ్ పరుగుల బాట లక్ష్యానికి చేరుస్తుందా అనేది నాలుగో రోజే తేలుతుంది.

రెండు రోజుల ఆతిథ్య జట్టు ఆధిపత్యానికి ఎట్టకేలకు మూడో రోజు బ్రేక్ పడింది. భారత రెండో ఇన్నింగ్స్‌ను ఇంగ్లండ్ బౌలర్లు సమష్టిగా దెబ్బ తీశారు. చేతిలో 10 వికెట్లున్న టీమిండియా మరో భారీ స్కోరు చేస్తుందనుకుంటే పర్యాటక బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఇంగ్లండ్ స్పిన్ సవాలుకు ఎదురు నిలిచిన ఒకే ఒక్కడు శుబ్‌మన్ గిల్ (147 బంతుల్లో 104; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 78.3 ఓవర్లలో 255 పరుగుల వద్ద ఆలౌటైంది. మిగతా వారిలో అక్షర్ పటేల్ (84 బంతుల్లో 45; 6 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. ఏమాత్రం అనుభవం లేని స్పిన్‌త్రయం టామ్ హార్ట్‌లీ (4/77), రేహన్ అహ్మద్ (3/88), షోయబ్ బషీర్ (1/58) భారత్‌ను ఇబ్బందుల్లో పడేయడం ఇక్కడ పెద్ద విశేషం. వెటరన్ సీమర్ అండర్సన్ 2 వికెట్లు తీశాడు. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 143 కలుపుకొని ప్రత్యర్థి ముందు టీమిండియా 399 పరుగుల కఠిన లక్ష్యాన్ని నిర్దేశించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఆట నిలిచే సమయానికి 14 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 67 పరుగులు చేసింది. అశ్విన్ బౌలింగ్‌లో 'లోకల్ బాయ్' కేఎస్ భరత్ అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌తో డకెట్ (28; 6 ఫోర్లు) పెవిలియన్ చేరగా... క్రాలీ (29 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), రేహన్ (9 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ విజయానికి 332 పరుగుల దూరంలో ఉంది.

శుబ్‌మన్ పోరాటం

ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా రెండు పరుగుల వ్యవధిలోనే ఓపెనర్లిద్దరినీ కోల్పోయింది. పేసర్ అండర్సన్ ఈ రెండు వికెట్లు తీశాడు. అండర్సన్ వేసిన అద్భుత బంతికి రోహిత్ శర్మ (13; 3 ఫోర్లు) బౌల్డ్ అవ్వగా... యశస్వి (17; 3 ఫోర్లు) రూట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కష్టాలతో మొదలైన రెండో ఇన్నింగ్స్‌ను శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ (29; 2 ఫోర్లు) కాసేపు ఆదుకున్నారు. జట్టు స్కోరు వంద దాటాక అయ్యర్, రజత్ పటిదార్ (9) స్పిన్ ఉచ్చులో పడ్డారు. కుదురుగా ఆడుతున్న గిల్ అర్ధ సెంచరీ పూర్తిచేసుకోగా 130/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది. రెండో సెషన్‌లో శుబ్‌మన్, అక్షర్ పటేల్ భాగస్వామ్యం ఊరటనిచ్చింది. ఇద్దరు కలిసి ఐదో వికెట్‌కు 89 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 200 దాటగా... శుబ్‌మన్ శతకాన్ని సాధించాడు. చక్కగా సాగిపోతున్న ఈ జోడీని బషీర్... గిల్ వికెట్ తీసి విడగొట్టాడు. కాసేపటికే అక్షర్‌ను హార్ట్‌లీ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. టీ విరామానికి 227/6 స్కోరుతో ఉన్న భారత్ ఆఖరి సెషన్‌లో స్పిన్‌కు దాసోహమైంది. అనూహ్యంగా 14.3 ఓవర్లలోనే మిగిలున్న 4 వికెట్లను కోల్పోయి కష్టంగా 28 పరుగులు మాత్రమే చేసింది. సొంతగడ్డపై రెండో ఇన్నింగ్స్‌లోనూ భరత్ (6) నిరాశపరిచాడు. కుల్దీప్ (0), బుమ్రా (0) ఖాతా తెరువకపోయినా... అశ్విన్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) వల్లే భారత్ 250 పైచిలుకు స్కోరు చేయగలిగింది.



గిల్ సెంచరీ అభివాదం

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 253; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (సి) రూట్ (బి) అండర్సన్ 17; రోహిత్ (బి) అండర్సన్ 13; గిల్ (సి) ఫోక్స్ (బి) బషీర్ 104; అయ్యర్ (సి) స్టోక్స్ (బి) హార్ట్‌లీ 29; పటిదార్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 9; అక్షర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హార్ట్‌లీ 45; భరత్ (సి) స్టోక్స్ (బి) రేహన్ 6; అశ్విన్ (సి) ఫోక్స్ (బి) రేహన్ 29; కుల్దీప్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 0; బుమ్రా (సి) బెయిర్‌స్టో (బి) హార్ట్‌లీ 0; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం** (78.3 ఓవర్లలో ఆలౌట్) 255. **వికెట్ల పతనం:** 1-29, 2-30, 3-111, 4-122, 5-211, 6-220, 7-228, 8-229, 9-255, 10-255. **బౌలింగ్:** అండర్సన్ 10-1-29-2, బషీర్ 15-0-58-1, రేహన్ 24.3-5-88-3, రూట్ 2-1-1-0, హార్ట్‌లీ 27-3-77-4. **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బ్యాటింగ్) 29; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రేహన్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (14 ఓవర్లలో వికెట్ నష్టానికి) 67. **వికెట్ల పతనం:** 1-50. **బౌలింగ్:** బుమ్రా 5-1-9-0, ముకేశ్ 2-0-19-0, కుల్దీప్ 4-0-21-0, అశ్విన్ 2-0-8-1, అక్షర్ 1-0-10-0.

వైజాగ్‌లో మంచి శకునములే

గతంలో వైజాగ్‌లో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారత జట్టే గెలిచింది. ఈ రెండు సందర్భాల్లోనూ లక్ష్యాన్ని నిర్దేశించిన టీమిండియా ప్రత్యర్థిని ఆలౌట్ చేసి భారీ విజయాలు నమోదు చేసింది. 2016లో ఇంగ్లండ్‌పై 246 పరుగుల తేడాతో... 2019లో దక్షిణాఫ్రికాపై 203 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది.

హైదరాబాద్ 'టాప్'

మిజోరం జట్టుపై ఘనవిజయం



తనయ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో హైదరాబాద్ జట్టు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఇన్నింగ్స్ విజయాలు సాధించి 35 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు జట్లున్న ప్లేట్ డివిజన్‌లో భాగంగా మిజోరం జట్టుతో ఉప్పల్ స్టేడియంలో జరిగిన చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 458/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 9 వికెట్లకు 465 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం 266 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మిజోరం 43.1 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 74 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఈనెల 9 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో నాగాలాండ్‌తో హైదరాబాద్; మేఘాలయతో మిజోరం ఆడతాయి. ఫైనల్ చేరిన రెండు జట్లు వచ్చే ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో ఆడతాయి.

గెలుపు ముంగిట ఆంధ్ర

నితీశ్ కుమార్ సెంచరీ



పట్నా: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్‌లో భాగంగా బిహార్ జట్టుతో జరుగుతున్న గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయానికి రెండు వికెట్ల దూరంలో నిలిచింది. 352 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బిహార్ ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ 4 వికెట్లు, శశికాంత్ 3 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 119.2 ఓవర్లలో 463 పరుగులకు ఆలౌటై 352 పరుగుల ఆధిక్యం సంపాదించింది. నితీశ్ కుమార్ రెడ్డి (159; 16 ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత సెంచరీ సాధించాడు.

భారత్‌కు మరో ఓటమి

భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో భారత జట్టు మరో ఓటమి చవిచూసింది. నెదర్లాండ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1-3తో ఓడింది. భారత్ తరఫున నవనీత్ కౌర్ ఏకైక గోల్ చేసింది. నెదర్లాండ్స్ తరఫున యిబ్బీ జాన్సెన్ రెండు గోల్స్, ఫేవాన్‌డెర్ ఒక గోల్ సాధించారు.

వరల్డ్ గ్రూప్-1లో భారత్

పాకిస్తాన్‌పై 4-0తో విజయం



ఇస్లామాబాద్: లాంఛనం పూర్తి చేసిన భారత పురుషుల టెన్నిస్ జట్టు డేవిస్‌కప్ టోర్నీలో మళ్లీ వరల్డ్ గ్రూప్-1లో చోటు సంపాదించింది. పాకిస్తాన్‌తో ఆదివారం ముగిసిన వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ పోటీలో భారత్ 4-0తో విజయం సాధించింది. తొలి రోజు 2-0తో ఆధిక్యంలో నిలిచిన భారత్ రెండో రోజు రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. పురుషుల డబుల్స్‌లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ ద్వయం 6-2, 7-6 (7/5)తో అకీల్ ఖాన్-ముజమ్మిల్ జంటను ఓడించడంతో భారత్‌కు 3-0తో విజయం ఖరారైంది. నామమాత్రమైన నాలుగో మ్యాచ్‌లో నికీ పునాచా 6-3, 6-4తో షోయబ్ మొహమ్మద్‌పై గెలవడంతో భారత్ ఆధిక్యం 4-0కు చేరింది. అప్పటికే ఫలితం తేలిపోవడంతో ఐదో మ్యాచ్‌ను నిర్వహించలేదు.

రచిన్, విలియమ్సన్ సెంచరీలు



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో ఆదివారం మొదలైన తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 258 పరుగులు సాధించింది. కేన్ విలియమ్సన్ (112 బ్యాటింగ్; 15 ఫోర్లు), రచిన్ రవీంద్ర (118 బ్యాటింగ్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీలు చేశారు.

రన్నరప్ సుమీత్-సిక్కి జోడీ



టెహ్రాన్: ఫజర్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సుమీత్-సిక్కి రెడ్డి ద్వయం 20-22, 14-21తో భారత్‌కే చెందిన సతీశ్-ఆద్యా జోడీ చేతిలో ఓడిపోయింది.

భవిత

ఎన్‌సీఎల్‌లో ట్రైనీ సూపర్‌వైజర్

జాబ్స్ ఇన్ఫో

ప్రభుత్వరంగ సంస్థ.. నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. దీని ద్వారా 150 ట్రైనీ సూపర్‌వైజరీ పోస్టులకు భర్తీ చేయనుంది. రాతి పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టులు- అర్హతలు

- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (ఈ అండ్ టీ) ట్రైనీ (గ్రేడ్-సి)-9 పోస్టులు. **అర్హత:** మూడేళ్ల మెట్రిక్యులేషన్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిప్లొమా పాసవ్వాలి.
- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (మెకానికల్) ట్రైనీ (గ్రేడ్-సి)-59. **అర్హత:** మెట్రిక్యులేషన్, మూడేళ్ల మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి.
- అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (ఎలక్ట్రికల్) ట్రైనీ (గ్రేడ్-సి)-82. **అర్హత:** మెట్రిక్యులేషన్, మూడేళ్ల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.
- డిగ్రీ /పీజీ /డిప్లొమాలను దూరవిద్య /పార్ట్ టైమ్ ద్వారా పూర్తిచేసినవారు దరఖాస్తు చేయడానికి అనర్హులు.
- **వయసు:** 18-30 ఏళ్ల ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు, ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించే రాత పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పోస్టులను అనుసరించి పరీక్షలను వేర్వేరుగా నిర్వహిస్తారు.

రాత పరీక్ష ఇలా

- ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. రెండు సెక్షన్‌లుగా ప్రశ్నపత్రం ఇస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- సెక్షన్-ఎ: ఈ విభాగంలో టెక్నికల్ పరిజ్ఞానానికి సంబంధించిన 70ప్రశ్నలుంటాయి.
- సెక్షన్-బి: ఇందులో జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ అండ్ మెంటల్ ఎబిలిటీ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లకు సంబంధించిన 30 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు ఉంటుంది.రుణాత్మక మార్కులు లేవు.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్,హిందీ భాషల్లో ఉంటుంది.

అర్హత మార్కులు

అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలో 50 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/ఈఎస్‌ఎం/ఓబీసీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 40శాతం కనీస అర్హత మార్కులుగా సాధించాల్సి ఉంటుంది.

ప్రిపరేషన్ ఇలా

- సెక్షన్-ఎ నుంచి 70 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. ఈ ప్రశ్నలన్నీ కూడా సంబంధిత సబ్జెక్టు అంశాల నుంచే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను రివిజన్ చేసుకోవాలి.
- సెక్షన్-బికి సంబంధించి జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, వెర్బల్ మెంటల్ ఎబిలిటీ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ కోసం వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి.
- పరీక్ష సన్నద్ధతలో భాగంగా వీలైనన్నీ ఎక్కువ మాక్‌టెస్టులు,ప్రాక్టీస్ టెస్టులు రాయాలి.దీనివల్ల ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో తెలుస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 05.02.2024
- వెబ్‌సైట్: www.nclcil.in

విద్య, ఉద్యోగ సమాచారం

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బీఈడీ ఓడీఎల్ ప్రవేశాలు


హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ ఓడీఎల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీబీఎం, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ప్రాథమిక విద్యలో శిక్షణ పొందిన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులై ఉండాలి. లేదా ప్రాథమిక విద్యలో టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పూర్తిచేసి ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు. బోధనా మాధ్యమం: తెలుగు.
» **వయసు:** అభ్యర్థి 01.07.2023 నాటికి 21 ఏళ్లు పూర్తిచేసి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.02.2024
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 26.02.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 05.03.2024.
» **వెబ్‌సైట్:** www.braou.ac.in

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కొలువులు

» 223 పోస్టుల భర్తీకి ఎన్‌టీపీసీ నోటిఫికేషన్
» ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో ఉద్యోగాలు
» ఎంపికైతే నెలకు రూ.55 వేల వేతనం

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్.. ఎన్‌టీపీసీ! మహారత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ. ఈ పీఎస్‌యూ కంపెనీ ఆపరేషన్స్ విభాగంలో.. 223 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేయనుంది. ఎంపికైతే ప్రారంభం నుంచే ఆకర్షణీయ వేతనాలు అందుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



జాబ్ గైడెన్స్

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా గుర్తింపు పొందింది. మహారత్న పీఎస్‌యూ హోదాను సైతం సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా పలు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పిన ఎన్‌టీపీసీ.. వాటిలో అవసరమైన మానవ వనరుల నియామకానికి నోటిఫికేషన్లు ఇస్తోంది. సాధారణంగా గేట్ స్కోర్ ఆధారంగా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగాలను భర్తీ చేస్తుంది. తాజాగా ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

మొత్తం 223 పోస్టులు

ఎన్‌టీపీసీ తాజా నోటిఫికేషన్ ద్వారా ఆపరేషన్స్ విభాగంలో 223 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్స్) పోస్టులను భర్తీ చేయనుంది. ఓపెన్ కేటగిరీలో 98 పోస్టులు; ఈడబ్ల్యూఎస్‌లో 22; ఓబీసీ కేటగిరీలో 40; ఎస్సీ అభ్యర్థులకు 39; ఎస్టీ కేటగిరీలో 24 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఎలక్ట్రికల్/మెకానికల్ బ్రాంచ్‌లతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. బీటెక్ తర్వాత ఏదైనా పవర్ ప్లాంట్‌లో కనీసం ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** 2024, ఫిబ్రవరి 8 నాటికి 35 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్ల చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పని అనుభవం తప్పనిసరి

ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులకు పని అనుభవం తప్పనిసరి. 100 మెగావాట్లు అంతకంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పవర్ ప్లాంట్‌లలో.. ఆపరేషన్ లేదా మెయింటనెన్స్ విభాగాల్లో కనీసం ఏడాది పని అనుభవం పొంది ఉండాలని స్పష్టం చేశారు.

మూడేళ్ల వ్యవధి

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్స్(ఆపరేషన్స్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఎన్‌టీపీసీ తొలుత మూడేళ్ల కాల వ్యవధికి నియామకాలు ఖరారు చేస్తుంది. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉంది. అంటే.. ఈ పోస్టులకు ఎంపికైన వారు గరిష్ఠంగా అయిదేళ్లపాటు ఎన్‌టీపీసీలో పని చేసే వీలుంది.

రూ.55 వేల వేతనం

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.55 వేల వేతనం లభిస్తుంది. దీంతోపాటు ఇంటి అద్దె భత్యం, నైట్ షిఫ్ట్ అలవెన్స్, ఉద్యోగికి, అతని కుటుంబానికి వైద్య సదుపాయాలను సైతం అందిస్తారు.

విధులు ఇవే

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ (ఆపరేషన్స్) పోస్టులలో నియమితులైన వారు.. ఎన్‌టీపీసీకి చెందిన పవర్ స్టేషన్స్, ప్రాజెక్ట్స్‌లలో.. మెయింటనెన్స్, ఆపరేషన్స్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్లాంట్ ఆపరేషన్స్ పర్యవేక్షణ, నియంత్రణ; భద్రత, నాణ్యత ప్రక్రియలను నిర్వహించడం, సమస్యలను పరిష్కరించడం, ప్లాంట్ రికార్డ్స్, రిపోర్ట్స్ నిర్వహణ వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

స్క్రీనింగ్ టెస్ట్ ఇలా

నోటిఫికేషన్‌లో మెరిట్ ప్రాతిపదికన నియామకాలు ఖరారు చేస్తామని పేర్కొంటూనే.. తప్పనిసరి అయితే స్క్రీనింగ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను సైతం నిర్వహిస్తామని ఎన్‌టీపీసీ పేర్కొంది. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడానికే ఎక్కువ అవకాశం ఉంటుంది. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. టెక్నికల్ సబ్జెక్ట్ విభాగం నుంచి 120 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ టెస్ట్ విభాగం నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 150 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్షకు లభించే వ్యవధి 2 గంటలు.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. కటాఫ్ నిబంధనల మేరకు మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి మలిదశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది. ఇందులో అభ్యర్థుల పని అనుభవం, అకడమిక్ నేపథ్యం, సబ్జెక్ట్ నాలెడ్జ్ వంటి అంశాలను పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్(ఆపరేషన్స్) పోస్టులకు అభ్యర్థులను ఖరారు చేసే క్రమంలో.. వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో పొందిన మార్కులకు 85 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 15 శాతం వెయిటేజీ ఇచ్చి.. దానికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులతో తుది జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:ఫిబ్రవరి 8, 2024
- కాల్ లెటర్స్: మార్చి రెండు లేదా మూడో వారంలో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: careers.ntpc.co.in, www.ntpc.co.in

స్క్రీనింగ్ టెస్ట్‌లో రాణించేలా

ఎన్‌టీపీసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల గత నోటిఫికేషన్లను పరిశీలిస్తే.. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించడం అనివార్యంగా మారుతోంది. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు దశ నుంచే స్క్రీనింగ్ టెస్ట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. సబ్జెక్ట్ వారీగా దృష్టి సారించాల్సిన అంశాలు..

- **మెకానికల్ ఇంజనీరింగ్:** ఈ విభాగంలో థర్మల్ ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిక్స్ అండ్ స్ట్రెంగ్త్ ఆఫ్ మెటీరియల్స్, మెషీన్ డిజైన్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, హైడ్రాలిక్స్ అండ్ హైడ్రాలిక్స్ మెషినరీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **ఆప్టిట్యూడ్ టెస్ట్:** ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సంబంధించి జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వొకాబ్యులరీలపై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో బేసిక్ మ్యాథమెటిక్స్ తోపాటు,అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ ఇంగ్లిష్, వొకాబ్యులరీలో రాణించేందుకు బేసిక్ గ్రామర్ అంశాలు, రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

అన్వయ దృక్పథం

స్క్రీనింగ్ టెస్ట్‌కు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ముఖ్యంగా.. టెక్నికల్ సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లకు బీటెక్ స్థాయి పుస్తకాల ఆధారంగా ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది. ప్రిపరేషన్‌ను అప్లికేషన్ అప్రోచ్‌తో సాగిస్తే.. ప్రాక్టికల్ థింకింగ్ అలవడి, ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇవ్వగలిగే నేర్పు లభిస్తుంది. అదే విధంగా ఎన్‌టీపీసీ నిర్వహించిన గత పరీక్షల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం, వాటిని మూల్యాంకన చేసుకోవడం పరీక్షలో విజయానికి దోహదం చేస్తుంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
5-2-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	▲ 440	72,086
నిఫ్టీ	▲ 156	21,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	15,629	▲ 267
డోజోన్స్	38,654	▲ 135
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,616	▽ 7
డాక్స్	16,918	▲ 59
హాంగ్‌సెంగ్	2,730	▽ 41
నికాయ్	36,158	▲ 110

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	83.54
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	107.13
€	యూరో	ఎస్‌బీఐ	89.12	91.48
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.10	57.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.74	55.71
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	63.01	64.26
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.68	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.43	12.50

యులిప్.. లోతుగా తెలుసుకున్నాకే!

- వీటిలో చార్జీల బాదుడు ఎక్కువే
- ఎండోమెంట్ ప్లాన్ల కంటే అధిక రాబడి
- ఈక్విటీలతో పోలిస్తే ప్రతిఫలంలో వెనుకే
- ప్రీమియంతో పోలిస్తే పరిమిత బీమా రక్షణ
- ప్రీమియం, రాబడిపైనా పన్ను ప్రయోజనాలు
- మెరుగైన ప్రత్యామ్నాయాలు వేరే ఉన్నాయ్

ఆర్యన్ (60) క్రమం తప్పకుండా ఆదాయం కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేద్దామని బ్యాంక్‌కు వెళ్లాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి (ఎఫ్‌డీ), దానిపై ప్రతి నెలా వడ్డీ రాబడి తీసుకోవాలన్నది ఆయన ప్రణాళిక. కానీ, బ్యాంక్ ఉద్యోగి చేసిన పనికి అతడు నష్టపోవాల్సి వచ్చింది. అనుకున్నది ఒకటి అయింది మరొకటి. ఎఫ్‌డీ పేరు చెప్పి బ్యాంక్ ఉద్యోగి ఆర్యన్‌తో యులిప్ పథకంపై సంతకం చేయించాడు. ఆ తర్వాతే అది ఎఫ్‌డీ కాదని అతడికి తెలిసొచ్చింది. దీంతో క్రమం తప్పకుండా ఆదాయం పొందాలన్న అతడి ప్రణాళిక దారితప్పింది. ఇలా తప్పుదోవ పట్టించి బీమా పాలసీలు, పెట్టుబడి పథకాలను అంటగట్టే ప్రయత్నాలు సహజంగానే కనిపిస్తూనే ఉంటాయి. యస్ బ్యాంక్ కేసులోనూ ఇదే చోటు చేసుకుంది. ఏటీ-1 (అడిషనల్ టైర్) బాండ్లను ఎఫ్‌డీ పేరు చెప్పి లక్షలాది మంది నుండి పెట్టుబడులు సమీకరించింది. యస్ బ్యాంక్ సంక్షోభంలో పడినప్పుడు ఏటీ-1 బాండ్లను రైటాఫ్ చేసేశారు. అంటే పెట్టుబడి పెట్టిన వారికి రూపాయి ఇవ్వలేదు. ఎఫ్‌డీల్లో అధిక రాబడి ఇస్తుందని చెప్పారే కానీ, ఏటీ-1 బాండ్లలో ఉండే రిస్క్ గురించి చెప్పలేదు. మన దేశంలో పెట్టుబడి సాధనాలను మార్కెట్ చేసే వారు కేవలం రాబడులు, ఆకర్షణీయమైన ఫీచర్ల గురించే చెబుతుంటారు. ఆయా సాధనాల్లోని రిస్క్‌ల గురించి తెలుసుకోవడం ఇన్వెస్ట్ చేసే వారి బాధ్యత అని గుర్తించాలి.





బీమా పాలసీలను తప్పుడు సమాచారంతో విక్రయించే ధోరణులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అందులో యులిప్‌లు కూడా ఒకటి. "ఇవి ఏజెంట్లకు ఎక్కువ కమీషన్‌ను అందిస్తాయి. దీంతో పాలసీ తీసుకునే వారికి గరిష్ట ప్రయోజనం కల్పించడానికి బదులు, ఏజెంట్‌కు ఎక్కువ ప్రయోజనం కలిగించే ఉత్పత్తి విక్రయానికి దారితీస్తుంది" అని ఆనంద్‌రాఠీ వెల్త్ ప్రొడక్ట్ అండ్ రీసెర్చ్ హెడ్ చేతన్ షెనాయ్ వివరించారు. ఎండోమెంట్ బీమా ప్లాన్లలో కమీషన్ మొదటి ఏడాది 10-35 శాతం మేర ఏజెంట్లకు అందుతుంది. యులిప్ ప్లాన్ల ప్రీమియంలో 10 శాతం ఏజెంట్ కమీషన్‌గా వెళుతుంది. అదే మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో కేవలం 0.3-1.5 శాతం మధ్యే ఎక్కువ పథకాల్లో ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్ మాదిరే పనిచేస్తాయంటూ యులిప్‌లను మార్కెట్ చేస్తుంటారు ఏజెంట్లు. కానీ, పూర్తిగా తెలుసుకోకుండా అంగీకారం తెలపకపోవడమే మంచిది.

యులిప్‌లు - మ్యూచువల్ ఫండ్స్



యులిప్‌లు, మ్యూచువల్ ఫండ్స్ ఒక్కటి కావు. వీటి మధ్య సారూప్యత కొంత అయితే, వైరుధ్యాలు బోలెడు. యులిప్‌లు అంటే యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు. అంటే పెట్టుబడులతో ముడిపడిన బీమా పథకాలు. చెల్లించే ప్రీమియంలో కొంత బీమా కవరేజీకి పోను, మిగిలిన మొత్తాన్ని తీసుకెళ్లి ఈక్విటీ, డెట్ సాధనాల్లో (ఇన్వెస్టర్ ఎంపిక మేరకు) పెట్టుబడిగా పెడతారు. కనుక ఇందులో రిస్క్‌లు, రాబడుల గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. బీమా కంపెనీల ఫండ్ మేనేజర్లు యులిప్ పాలసీలకు సంబంధించిన పెట్టుబడులను మార్కెట్ లింక్డ్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. యులిప్‌ల ప్లాన్లను మ్యూచువల్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో)గా కొందరు మార్కెట్ చేస్తుంటారు. నెట్ అసెట్ వేల్యూ (ఎన్ఏవీ)ని చూపిస్తుంటారు. యులిప్‌లను మ్యూచువల్ ఫండ్స్‌కు ప్రత్యామ్నాయం అంటూ విక్రయిస్తుంటారు. దీంతో మ్యూచువల్ ఫండ్స్ మాదిరే రాబడులు వస్తాయని కొనుగోలు చేసే వారూ ఉన్నారు. కానీ వాస్తవంలో మెరుగ్గా పనిచేసే యులిప్‌ల రాబడులను గమనించినప్పుడు.. మ్యూచువల్ ఫండ్స్ కంటే తక్కువే ఉండడాన్ని చూడొచ్చు. దీనికి కారణం యులిప్‌లలో పలు రకాల చార్జీల పేరుతో పాలసీదారుల నుంచి బీమా సంస్థలు ఎక్కువ రాబట్టుకునే చర్యలు అమలు చేస్తుంటాయి.

సంక్లిష్టత.. పారదర్శకత

లిక్విడిటీ (కొనుగోలు, విక్రయాలకు కావాల్సినంత డిమాండ్), చార్జీలు అనేవి యులిప్‌లు, ఫండ్స్‌లో పూర్తిగా భిన్నం. యులిప్‌లు ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌తో వస్తాయి. ఫండ్స్ పెట్టుబడులను కోరుకున్నప్పుడు ఉపసంహరించుకోవచ్చు. యులిప్‌లలో విధించే చార్జీలు ఎక్కువగా ఉంటాయి. "మ్యూచువల్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో సాధారణంగా అయితే 0.5-1.5 శాతం మధ్య ఉంటుంది. అదే యులిప్‌లలో 20 ఏళ్ల కాలానికి లోడింగ్ 60 శాతంగా ఉంటుంది. అంటే ఏటా 3 శాతం చార్జీల రూపంలో కోల్పోవాల్సి వస్తుంది" అని ఇన్వెస్ట్ ఆజ్ ఫర్ కల్ అనే ఫైనాన్షియల్ అడ్వైజరీ సంస్థ వ్యవస్థాపకుడు అనంత్ లోధా తెలిపారు. చార్జీల పరంగా సంక్లిష్టత ఇందులో కనిపిస్తుంది. ప్రీమియం అలోకేషన్ చార్జీలు, మోర్టాలిటీ చార్జీలు, ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీలు, పాలసీ అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు, ఫండ్ స్విచింగ్ (ఫండ్‌ను మార్చుకున్నప్పుడు) చార్జీలు, పాక్షిక ఉపసంహరణ చార్జీలు, ప్రీమియం రీడైరెక్షన్ చార్జీలు, ప్రీమియం నిలిపివేత చార్జీలు.. ఇన్నేసి చార్జీలు మరే పెట్టుబడి సాధనంలో కనిపించవు. యులిప్ ప్లాన్లను తీసుకున్న వారిలోనూ చాలా మందికి ఈ చార్జీల గురించి తెలియదు. ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీల గురించే ఎక్కువ మందికి తెలుసు. ఎందుకంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల నిర్వహణకుగాను ఎక్స్‌పెన్స్ రేషియో విధిస్తుంటారు. దీన్నే ఫండ్ మేనేజ్‌మెంట్ చార్జీగానూ భావించొచ్చు. యులిప్ ప్లాన్లలో దీర్ఘకాలంలో రాబడులు 7-9 శాతం మధ్య ఉంటాయి. కానీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడిని 12 శాతానికి పైనే ఆశించొచ్చు.

రాబడులపై గ్యారంటీ లేదు

మ్యూచువల్ ఫండ్స్ మాదిరే యులిప్‌లు సైతం రాబడికి హామీ ఇవ్వవు. వీటిల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లపై ఆధారపడి ఉంటాయి. కాకపోతే దీర్ఘకాలంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ కంటే మెరుగైన రాబడి యులిప్‌లలో ఉంటుందని భావించొచ్చు. ఎందుకంటే ఇవి పెట్టుబడులను తీసుకెళ్లి ఈక్విటీల్లో పెడుతుంటాయి. దీర్ఘకాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులు ఇస్తాయని చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. కనుక అన్ని రకాల చార్జీల పేరుతో బాదిన తర్వాత కూడా ఎఫ్‌డీ కంటే కొంచెం ఎక్కువ రాబడి యులిప్‌లలో ఉంటుంది. పైగా ఎఫ్‌డీ రాబడిపై పన్ను ఉంటుంది. యులిప్ మెచ్యూరిటీ మొత్తంపై పన్ను మినహాయింపు పొందొచ్చు. అందుకే బీమా ఏజెంట్లు ఎఫ్‌డీల కంటే మెరుగైనవిగా మార్కెట్ చేస్తుంటారు. యులిప్ పెట్టుబడులను సైతం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డెట్, ఈక్విటీ మధ్య మార్చుకునే స్వేచ్ఛ ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ కూడా ఇదే పనిచేస్తుంటాయి. పన్ను పరిధిలో ఉన్న వారికి యులిప్‌లు అనుకూలమేనని చెప్పుకోవాలి. ఎందుకంటే వీటిల్లో పెట్టుబడులు, రాబడులపైనా పన్ను ప్రయోజనాలు ఉండడమే. 'బెనిఫిట్ ఇలస్ట్రేషన్' (ఎంత రావచ్చన్న అంచనాలు)లో రాబడిని 4-8 శాతం మించి చూపించకూడదు. యులిప్‌లలోనూ కన్జర్వేటివ్, బ్యాలన్స్‌డ్, అగ్రెస్సివ్ ఫండ్స్ ఉంటాయి. వీటిల్లో రాబడి, రిస్క్ వేర్వేరు. ఏ ఫండ్ ఎంపిక చేసుకుంటున్నారన్నదాని ఆధారంగానే రాబడులు ఆధారపడి ఉంటాయి. అగ్రెసివ్ ఫండ్‌తో దీర్ఘకాలంలో రాబడి అధికంగా ఉంటుంది. రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుంది.



ఆకర్షణలు కాదు.. అవసరాలు

కుటుంబ పెద్దకు అనుకోనిది ఏదైనా జరిగితే కుటుంబాన్ని ఆదుకుంటుందనే మార్కెటింగ్ ప్రచారం కూడా యులిప్ ప్లాన్ల విషయంలో కనిపిస్తుంది. కానీ, ఇందులో వాస్తవం పాళ్లు కొంతే. ఎందుకంటే యులిప్ ప్లాన్లలో బీమా రక్షణ తగినంత ఉండదు. అచ్చమైన కవరేజీ కోసం అనువైనది టర్మ్ ఇన్సూరెన్స్. అలాగే, యులిప్‌లో చెల్లించే ప్రీమియం సెక్షన్ 80సీ కింద మినహాయింపు పరిధిలోకి వస్తుందని, మెచ్యూరిటీ మొత్తంపైనా పన్ను ఉండదని కూడా చెబుతారు. కానీ, 2021 ఫిబ్రవరి 1 తర్వాత కొనుగోలు చేసిన యులిప్ ప్లాన్లకు సంబంధించి అందుకునే మెచ్యూరిటీపై పన్ను ఉండకూడదని కోరుకుంటే, ప్రీమియం రూ.2.5 లక్షలు మించకూడదు. మరీ ముఖ్యంగా యులిప్ ప్లాన్ల విషయంలో వృద్ధులను ఏజెంట్లు లక్ష్యంగా చేసుకోవడాన్ని గమనించొచ్చు. ఎందుకంటే వారికి వీటిపై తగినంత అవగాహన లేకపోవడమే. సింగిల్ ప్రీమియం పాలసీలు, గ్యారంటీడ్ ఇన్‌కమ్ (హామీతో కూడిన రాబడి) పాలసీల గురించి వృద్ధులు అడుగుతుంటారని, అవి వారి అవసరాలకు అనుకూలమైనవి కావని నిపుణుల సూచన. అలాగే, యులిప్ ప్లాన్లలో పెట్టుబడికి ఐదేళ్ల పాటు లాకిన్‌లో ఉంటుంది. దీన్ని కూడా వృద్ధులు గమనించాలి. సీనియర్ సిటిజన్లలో ఎక్కువ మందికి వారు చెల్లించే ప్రీమియానికి పది రెట్ల బీమా కవరేజీ ఇతర ప్లాన్లలో రాకపోవడం ఆకర్షణకు ఒక కారణం.



మార్గమేంటి..?

అది యులిప్ అయినా, ఎండోమెంట్ ప్లాన్ అయినా సరే బీమాను, పెట్టుబడిని కలపకూడదన్నది ప్రాథమిక సూత్రం. అచ్చమైన బీమా రక్షణ కోరుకుంటే అందుకు టర్మ్ ఇన్సూరెన్స్ మెరుగైన సాధనం. పెట్టుబడి కోసం ఈక్విటీ, డెట్ సాధనాల్లో ఎన్నో ఉన్నాయి. అటు బీమా, ఇటు పెట్టుబడిపై గరిష్ట ప్రయోజనాన్ని పొందాలంటే వీటిని విడివిడిగానే తీసుకోవాలి. పన్ను ఆదా కోరుకునేట్టు అయితే, టర్మ్ ఇన్సూరెన్స్ కోసం చెల్లించే ప్రీమియంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు కోరుకోవచ్చు. టర్మ్ ప్లాన్లలో గడువు ముగిసే వరకు జీవించి ఉంటే ఎలాంటి ప్రయోజనం అందదు. ఇక పెట్టుబడులపై పన్ను ఆదా కోరుకునే వారు ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. వీటిలో చేసే పెట్టుబడిని సెక్షన్ 80సీ కింద చూపించి పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందులో దీర్ఘకాలంలో సగటు రాబడి 15 శాతానికి పైనే ఉంది. అయితే ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన అంశం.. ఈఎల్ఎస్ఎస్ నుంచి వచ్చే రాబడిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. యులిప్‌లో అయితే మెచ్యూరిటీపైనా పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. కానీ, ఈఎల్ఎస్ఎస్‌లో అది లేదు. కాకపోతే యులిప్‌తో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ రాబడులు ఎంతో మెరుగ్గా ఉంటాయి. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్షకు మించిన మొత్తంపై 10 శాతం పన్ను చెల్లించిన తర్వాత కూడా నికర రాబడి, యులిప్‌లలో కంటే ఈఎల్ఎస్ఎస్ ప్లాన్లలో ఎక్కువే ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. డెట్‌లో పీపీఎఫ్ సాధనంలో మెచ్యూరిటీ మొత్తంపై పన్ను ఉండదు. ఇంత చెప్పినా, యులిప్ ప్లాన్ తీసుకోవడానికే మొగ్గు చూపేవారు.. బ్యాంకుల నుంచి కాకుండా నేరుగా బీమా సంస్థల నుంచి తీసుకోవడం వల్ల సరైన మార్గనిర్దేశం లభిస్తుందనేది నిపుణుల సూచన.



2024-25 ఐటీఆర్‌ల నోటిఫై

న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ 2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి దాఖలు చేయాల్సిన రిటర్నుల పత్రాలు.. ఐటీఆర్ 2, 3, 5ను నోటిఫై చేసింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని సీబీడీటీ ప్రకటించింది. పన్ను చెల్లింపుదారులు సులభంగా రిటర్నులు దాఖలు చేసేందుకు వీలుగా రిటర్నుల పత్రాల్లో మార్పులు చేశారు. రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన వ్యక్తులు ఐటీఆర్-1 దాఖలు చేయాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-2-2024	
విశాఖ	555-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538-00
విజయవాడ	538-00
4-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00

ఎస్‌బీఐ లాభం 35% డౌన్

క్యూ3లో రూ.9,164 కోట్లు • వేతనాలు, పెన్షన్ ఏరియర్ల ఎఫెక్ట్



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2023-24, క్యూ3)లో రూ. 9,164 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.14,205 కోట్లతో పోలిస్తే లాభం 35 శాతం తగ్గింది. ప్రధానంగా వేతనాలు, పెన్షన్ల కోసం వన్‌టైమ్ ప్రొవిజనింగ్ బ్యాంక్ లాభదాయకతకు గండి కొట్టింది. ఉద్యోగ సంఘాలతో కుదుర్చుకున్న 17% వేతన సెటిల్‌మెంట్ కారణంగా వేతనాలు, పెన్షన్ల కోసం అదనపు వన్‌టైమ్ ప్రొవిజనింగ్‌ను చేయాల్సి వచ్చిందని, ఇది గనుక లేకపోతే నికర లాభం రూ.16,264 కోట్లుగా ఉండేదని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా పేర్కొన్నారు. ప్రస్తుత లాభదాయకత ప్రకారం, రూ.40,000 కోట్లను సులభంగా సమీకరించగమని ఖారా చెప్పారు. అవి లేకుండా కూడా అదనంగా రూ.7.5 లక్షల కోట్ల రుణాలిచ్చే లిక్విడిటీ బఫర్ ఉందని ఆయన వివరించారు.

మొండి బకాయిలు దిగొచ్చాయ్...

క్యూ3లో స్థూల మొండి బకాయిలు 72 బేసిస్ పాయింట్లు దిగొచ్చి 2.42 శాతానికి (రూ.86,749 కోట్లు) తగ్గాయి. / క నికర మొండి బకాయిలు కూడా 13 బేసిస్ పాయింట్లు తగ్గి 0.64 శాతానికి (రూ.22,408 కోట్లు) చేరాయి. ఇది పదేళ్ల కనిష్ట స్థాయి అని ఖారా పేర్కొన్నారు. కాగా, బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 1 శాతం తగ్గి 3.28 శాతానికి పరిమితమైంది. మొత్తం రుణాలు 14.38 శాతం ఎగబాకి రూ.35.84 లక్షల కోట్లకు చేరగా, మొత్తం డిపాజిట్లు 13.02 శాతం పెరిగి రూ. 47.62 లక్షల కోట్లకు ఎగిశాయి.

పేటీఎం కస్టమర్లకు స్వాగతం...

మార్చి 1 నుండి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలను దాదాపు నిలిపేయాలంటూ ఆర్‌బీఐ ఆదేశించిన నేపథ్యంలో, పేటీఎం కస్టమర్లకు (ఎక్కువ మంది వ్యాపారులే) సాయపడేందుకు ఎస్‌బీఐ సిద్ధంగా ఉందని చైర్మన్ ఖారా చెప్పారు.

• బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్..

ముకేశ్ అంబానీ టాప్



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీకి బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్‌లో వరుసగా రెండో ఏడాది ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బ్రాండ్ గార్డియన్‌షిప్ ఇండెక్స్ 2024 వివరాలు విడుదలయ్యాయి. మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, యాపిల్ టిమ్ కుక్, టెస్లా ఎలాన్ మస్క్‌ను ముకేశ్ అంబానీ వెనక్కి నెట్టేశారు. టెన్సెంట్ హువాతెంగ్‌మా తర్వాతి స్థానంలో ఉన్నారు. ఇదే సూచీలో టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ గతేడాది ఉన్న 8వ స్థానం నుంచి ఈ ఏడాది 5వ స్థానంలోకి వచ్చేశారు. మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా 6వ స్థానం, ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ 16వ స్థానంలో నిలిచారు. 2023 ర్యాంకుల్లోనూ ముకేశ్ అంబానీ అంతర్జాతీయంగా రెండో స్థానంలో ఉండడం గమనార్హం. డైవర్సిఫైడ్ దిగ్గజ కంపెనీల పరంగా చూస్తే అంతర్జాతీయంగా 2024 సంవత్సరానికి ముకేశ్ అంబానీ మొదటి స్థానంలోఉన్నారు.

స్టాక్స్ వ్యూ

ఎల్‌అండ్‌టీ | ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,381
టార్గెట్: రూ. 4,071
ఎందుకంటే: 2023-24 ఆర్థిక సంవత్సరంలో గత కాంట్రాక్టుల ప్రభావం లాభదాయకతపై పడటం, అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై) నుండి ఆర్డర్ బుక్, టెండర్ అవకాశాలు పటిష్టంగా ఉంటాయన్న అంశాలను పరిగణనలోకి తీసుకొని, మా ఎఫ్‌వై24/25/26 ఈపీఎస్ వృద్ధి అంచనాలను వరుసగా -7.6%/+5%/+8% మేర సవరిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటిదాకా పటిష్టమైన ఆర్డర్లతో పాటు భవిష్యత్తులో వచ్చే ఆర్డర్లపై బలమైన అంచనాల నేపథ్యంలో కంపెనీ యాజమాన్యం 2023-24 ఆర్డర్లు/ఆదాయ వృద్ధి అంచనాలను సవరించింది. మెరుగైన దేశీ మౌలిక ప్రాజెక్టులు, హైడ్రోకార్బన్లు అలాగే మౌలికసదుపాయాలపై (సౌదీ విజన్ 2030 దన్నుతో) జీసీసీ పెట్టుబడులు పెరగడం వల్ల అవకాశాలు దండిగా కనబడుతున్నాయి. తక్కువ మార్జిన్ గల పాత కాంట్రాక్టులతో పాటు గాడిలో పెట్టాల్సిన కొత్త ప్రాజెక్ట్‌ల అమలును పరిగణనలోకి తీసుకొని ప్రధాన మార్జిన్ గైడెన్స్‌ను కూడా యాజమాన్యం 8.5-9% నుండి 8.25-8.5 శాతానికి తగ్గించింది. పటిష్టమైన టెండర్ అవకాశాలు, హైడ్రోకార్బన్లలో గణనీయమైన కార్యకలాపాలు, సౌదీ అరేబియా వంటి అంతర్జాతీయ మార్కెట్ల నుండి పునరుత్పాదక ఇంధన రంగంలో ఆర్డర్లు, దేశీయంగా ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవచ్చన్న అంచనాలతో దీర్ఘకాలంలో ఎల్‌అండ్‌టీకి భారీగా ప్రయోజనం చేకూరనుంది.



పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 270
టార్గెట్: రూ. 300
ఎందుకంటే: పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ఎబిటా 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (13% వృద్ధి చెంది, రూ.1320 కోట్లుగా నమోదైంది. అంచనాలను మించిన స్పాట్ మార్జిన్లు దీనికి దన్నుగా నిలిచాయి. దహేజ్/కోచి టెర్మినల్ సామర్థ్య వినియోగం అంచనాల కంటే కాస్త అధికంగా 97%/22%గా ఉంది. క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ.1,191 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సర్దుబాటు చేసిన ఎబిటా క్రితం ఏడాదితో ఇదే కాలంతో పోలిస్తే 15%, గత త్రైమాసికంతో పోలిస్తే 5% చొప్పున వృద్ధి చెందింది. అమ్మకాలు కొద్దిగా పుంజుకోనున్న నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం లాభాల అంచనాలను 1-4 శాతం మేర పెంచుతున్నాం. ఖతార్ గ్యాస్ త్వరలో రెన్యూవల్ ప్రకటన చేయనున్న నేపథ్యంలో 2027-28 ఆర్థిక సంవత్సరం తర్వాత కాలానికి సంబంధించి వార్షిక టారిఫ్‌ను 2-3 శాతం మేర సవరించే అవకాశం ఉంది. ఈ సానుకూలతల కారణంగా 2024 డిసెంబర్ నాటికి షేరు టార్గెట్ ధరను రూ.300గా నిర్ణయించాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

రిటైర్మెంట్ ఫండ్‌కు మెరుగైన మార్గం..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 35 ఏళ్లు? 55 ఏళ్లకే రిటైర్ అవుదామని అనుకుంటున్నాను. ఆ సమయానికి రిటైర్మెంట్ ఫండ్‌ను సిద్ధం చేసుకోవడం ఎలా? - కీర్తిలాల్

మీ రిటైర్మెంట్‌కు ఇంకా 20 ఏళ్ల వ్యవధి మిగిలి ఉంది. 55 లేదా 60 ఏళ్లకు రిటైర్ అవుదామని అనుకుంటే పెట్టుబడులకు ఇంకా 20-25 ఏళ్ల వ్యవధి మిగిలి ఉంటుంది. ఈక్విటీలో పెట్టుబడులు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వడానికి ఈ సమయం చాలు. మీరు ఏ వయసులో రిటైర్ అయినా.. ఈక్విటీ పెట్టుబడులకు రిటైర్మెంట్ లేదని గుర్తు పెట్టుకోవాలి. ఈక్విటీల్లో ఉన్న పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకుని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం సరైన విధానం కాదు. రిటైర్మెంట్ తర్వాత కూడా కొంత మొత్తాన్ని ఈక్విటీల్లో కొనసాగించాలి. అప్పటి వరకు సమకూర్చుకున్న ఈక్విటీ పోర్ట్‌ఫోలియో నుంచి మీకు సగటు రాబడి వచ్చినా విశ్రాంత జీవనాన్ని సాఫీగా సాగించొచ్చు. ఇప్పటికైనా మించిపోయింది లేదు కనుక ఈక్విటీల్లో పెట్టుబడులు ప్రారంభించండి. ఒకటి రెండు ఫ్లెక్సీక్యాప్ (ఫోకస్డ్) ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఆ తర్వాత పెట్టుబడులను క్రమంగా (ఏటా) పెంచుకునే ప్రయత్నం చేయండి. అప్పుడు కాంపౌండింగ్ ప్రయోజనం కనిపిస్తుంది. ఇప్పటి నుంచి వీలైనంత అధిక మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాలని గుర్తుంచుకోవాలి. తగినంత ఇన్వెస్ట్ చేయనప్పుడు మీ అవసరాలకు సరిపడా నిధి ఎలా మారుతుంది? కనుక ఇప్పటి నుంచి వీలైనంత మేర దూకుడుగా పెట్టుబడులు పెట్టుకుంటూ వెళ్లడమే ముందున్న మార్గం.

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్‌లో మంచిది ఏదనే విషయంలో సందేహం నెలకొంది. ఏ పథకం మంచిది? - రమేష్

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10-15 బేసిస్ పాయింట్ల (0.1-0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక అంతకంటే ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పని చేసిందన్నది ఇది చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూసిన తర్వాత నచ్చిన పథకాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

క్లుప్తంగా...

టీఈఏ అధ్యక్షురాలిగా నిర్మల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) ఆదివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.నిర్మల, సెక్రటరీ జనరల్‌గా ఎఫ్ఏ యాకూబ్ పాషా, కోశాధికారిగా జి.ఆనందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న చిలగాని సంపత్‌కుమార్ స్వామి వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. నిర్మల కొంతకాలంగా సంఘానికి సెక్రటరీ జనరల్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం అనేక సందర్భాల్లో పోరాడిన నేపథ్యం ఉంది. ఆమె ఎన్నిక పట్ల అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. నిర్మల మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి అందుబాటులో ఉంటానని, సమస్య పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పురుషోత్తం, గడ్డం బాలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కనకరాజు 32 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'రెప్పవాలని రాత్రి'కి రంగినేని సాహిత్య పురస్కారం

సిరిసిల్ల కల్చరల్: రంగినేని సుజాత మోహన్ రావు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మోహన్ రావు తమ మాతృమూర్తి స్మారకార్థం ఏటా అందించే రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి ఈసారి వంశీకృష్ణ వెలువరించిన 'రెప్పవాలని రాత్రి' ఎంపికైంది. ఈ మేరకు పురస్కార కమిటీ సమన్వయకర్త మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అవార్డు కింద రూ.25వేలు, జ్ఞాపిక, పురస్కారపత్రాన్ని వచ్చే నెలలో జరిగే కార్యక్రమంలో అందజేస్తారు.

'పద్మశ్రీ'లకు రూ. 25వేల పింఛన్

రూ.25 లక్షల నగదు బహుమతి కూడా..

- తొవ్వ ఖర్చులు కూడా కష్టంగా ఉన్నా.. తెలుగు సంస్కృతిని కాపాడుతున్నారు
- రాష్ట్రపతి కావాల్సిన నేత వెంకయ్యనాయుడు
- పున్నమినాగు నుంచి సైరా వరకు చిరంజీవిది ఒకే కమిట్‌మెంట్
- పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతల సన్మానసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో సీఎం రేవంత్, చిత్రంలో వెంకయ్యనాయుడు, చిరంజీవి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటి, జూపల్లి, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, హైదరాబాద్: పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.25 లక్షల నగదు బహుమతి, ఖర్చుల నిమిత్తం నెలకు రూ.25 వేలు పింఛను ఇవ్వాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. తొవ్వ ఖర్చులకు కూడా కష్టంగా ఉన్నా, కనుమరుగవుతున్న కళలు, తెలుగు సంప్రదాయాలను కాపాడేందుకు కష్టపడుతున్న కళాకారులకు ఆర్థిక సహకారం అందించాలని ప్రభుత్వం భావించిందని తెలిపారు. పద్మవిభూషణ్ పురస్కారాలకు ఎంపికైన మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, సినీనటుడు చిరంజీవితోపాటు పద్మశ్రీకి ఎంపికైన ఆనందాచార్య, దాసరి కొండప్ప, ఉమామహేశ్వరి, గడ్డం సమ్మయ్య, కేతావత్ సోంలాల్, కూరెళ్ల విఠలాచార్యలను ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను కాపాడేందుకు రాజకీయాలకతీతంగా అందరూ ఏకం కావాలని..లేదంటే తెలుగుభాష కాలగర్భంలో కలిసిపోతుందన్నారు. మారుమూల ప్రాంతాల్లో తెలుగు సంప్రదాయ కళలను కాపాడుతున్న కళాకారులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలతో గౌరవించడం సముచితమని, ఈ పరిస్థితుల్లో పురస్కారాలకు ఎంపికైన వారిని సత్కరించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా భావించినట్టు తెలిపారు. రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో కొత్త సంప్రదాయం నెలకొల్పేందుకు అవార్డుకు ఎంపికైన వారిని సన్మానించే కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థి దశ నుంచి తనకు వెంకయ్యనాయుడు ప్రసంగాలు అంటే తనకు ఇష్టమని రేవంత్‌రెడ్డి చెప్పారు. 1978లో విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి ఎమ్మెల్యేగా జైపాల్‌రెడ్డితో కలిసి ప్రజాసమస్యలపై పోరాడిన నేత వెంకయ్యనాయుడని కొనియాడారు. రాజకీయాల్లో భాష ప్రాధాన్యతపై వెంకయ్య చేసిన సూచనలను తాను పాటిస్తానని ఈ సందర్భంగా చెప్పారు. వెంకయ్యనాయుడు రాష్ట్రపతి కావాల్సిన నాయకుడన్నారు. కళాకారుడిగా కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి చిరంజీవి అని..పున్నమినాగు సినిమా నుంచి సైరా నరసింహారెడ్డి వరకు ఒకే కమిట్‌మెంట్‌తో ఆయన ఉన్నారని కొనియాడారు.

కొత్త సంప్రదాయానికి నాంది పలికిన రేవంత్‌రెడ్డి : వెంకయ్య

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పద్మ అవార్డులకు ఎంపికైన వారిని సన్మానించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త సంప్రదాయానికి నాంది పలికారన్నారు. రాజకీయాల్లో ప్రమాణాలు తగ్గిపోతున్నాయని, బూతులు మాట్లాడటం రాజకీయాల్లో మంచిది కాదని అభిప్రాయపడ్డారు. బూతులు మాట్లాడేవారికి పోలింగ్ బూతుల్లోనే సమాధానం చెప్పాలన్నారు. తెలుగు కళామతల్లికి రెండు కళ్లు ఎన్టీఆర్, అక్కినేని అయితే, మూడోకన్ను చిరంజీవి అని కొనియాడారు.

కళాకారులు ఎక్కడ గౌరవం పొందుతారో ఆ రాజ్యం సుభిక్షం : చిరంజీవి

ప్రముఖ సినీనటుడు చిరంజీవి మాట్లాడుతూ ఎక్కడ కళాకారులు గౌరవం పొందుతారో.. ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పద్మ అవార్డులకు ఎంపికైన వారిని సన్మానించడం ముదావహమని పేర్కొన్నారు. ప్రజాగాయకుడు గద్దర్ పేరున అవార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామమని చెప్పారు. రాజకీయాల్లో దుర్భాషలు ఎక్కువయ్యాయని, వ్యక్తిగతంగా దుర్భాషలాడటం మంచిది కాదని, అలాంటి వారికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వెంకయ్య, చిరంజీవిల ఔన్నత్యాన్ని కొనియాడారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



1973 బ్యాచ్ విద్యార్థులు

సెయింట్ పాల్స్ స్కూల్‌లో 'గోల్డెన్ జూబ్లీ'

హాజరైన 1973వ బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

హిమాయత్‌నగర్(హైదరాబాద్): హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో పదోతరగతి(1973 బ్యాచ్) చదివి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆనాటి విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ సంబరాలు ఘనంగా చేసుకున్నారు. ఆదివారం ఆ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతా పాఠశాల ప్రాంగణంలో ఒకచోట చేరి పాఠశాల రోజులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్ కోఆర్డినేటర్ వీరస్వామి మాట్లాడుతూ తమ బ్యాచ్‌లో 140 మంది విద్యార్థులుండగా, 75మంది వస్తారని అనుకున్నామని, 62 మంది గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారని చెప్పారు. అమెరికా, న్యూజిలాండ్ నుంచి ముగ్గురు, ఒకరు కోల్‌కతా నుంచి రావడం ఆనందంగా ఉందన్నారు. కమిటీ ప్రతినిధులు కెబీఎంఎం.క్రిష్ణ, వి.కిషోర్, కోకా వెంకటరమణ, వి.రమేష్ పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

విద్యాబుద్ధులు నేర్పిన తొమ్మిది మంది గురువులు, ప్రస్తుత ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మజర్‌అలీ అహ్మద్‌ను 1973 బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

పాఠశాల అభివృద్ధికి రూ. 40 లక్షలు విరాళం

1973 బ్యాచ్‌కు చెందిన ప్రొఫెసర్ సుధాకర్, అమెరికాలో స్థిరపడిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ చల్లా కిషోర్, అతని నలుగురు సోదరులతో కలిసి పాఠశాల కొత్త భవనం కోసం రూ. 20 లక్షల చొప్పున మొత్తం రూ.40 లక్షలు విరాళంగా అందజేశారు.

ఎపిగ్రఫీ మ్యూజియానికి నేడు శంకుస్థాపన

- దేశంలోనే తొలిసారి... సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో మంజూరు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే తొలి ఎపిగ్రఫీ మ్యూజియం మన భాగ్యనగరంలో ఏర్పాటుకానుంది. సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న ఈ ఎపిగ్రఫీ మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. భారత పురాతత్వ శాఖ హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో ఈ మ్యూజియంను ఏర్పాటు చేయనున్నారు. గత బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భారత్ షేర్డ్ రెపోసిటరీ ఆఫ్ ఇన్‌స్క్రిప్షన్స్ (భారత్–శ్రీ) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఈ మ్యూజియం హైదరాబాద్‌కు కేటాయించేలా కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. లక్షకు పైగా ప్రాచీన శిలాశాసనాలు, లోహాలపై, చెక్కలపై చెక్కిన శిల్పాలను, వాటి డిజిటలీకరణ పూర్తి చేసి ఈ ఎపిగ్రఫీ మ్యూజియం ద్వారా సందర్శకులకు అందుబాటులో ఉంచుతారు. మల్టీమీడియా ద్వారా సందర్శకులు ఆయా శాసనాల్లోని అంశాలను తెలుసుకోవచ్చు. భారతదేశంలో రాత, శాసనాల పుట్టుపూర్వోత్తరాలు మొదలుకొని వివిధ భారతీయ భాషల్లో మన పూర్వీకులు ఇచ్చిన సందేశాలు, పేర్కొన్న అంశాలు, వివిధ రాజుల సమయాల్లోని విశేషాలు.. మరెన్నో ఈ ఎపిగ్రఫీ మ్యూజియం సందర్శన సందర్భంగా అనుభవంలోకి రానున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటలకు సాలార్‌జంగ్ మ్యూజియంలోని వెస్టర్న్ బ్లాక్ వద్ద ఎపిగ్రఫీ మ్యూజియానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు.

ఫైర్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం





కిశోర్ (అధ్యక్షుడు), శ్రీనాథ్ (ప్రధాన కార్యదర్శి)

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవలశాఖ అధికారుల సంఘం అధ్యక్షునిగా మహబూబ్‌నగర్ జిల్లా డీఎఫ్‌వో (డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్) పి.కిశోర్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం ఏడీఎఫ్‌వో ఎస్.శ్రీనాథ్ ఎన్నికయ్యారు. నాగోల్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నుంచి డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మల్టీజోన్–1 ఉపాధ్యక్షునిగా ట్రైనింగ్ అకాడమీ ఏడీఎఫ్‌వో ఎం.క్రాంతి కుమార్, మల్టీజోన్ –2లో ఉపాధ్యక్షునిగా ట్రైనింగ్ అకాడమీ డీఎఫ్‌వో ఎస్.సందన్న, చాంద్రాయణగుట్ట ఏడీఎఫ్‌వో మహ్మద్ రఫీ, సంయుక్త కార్యదర్శులుగా మల్టీజోన్–1లో భద్రాచలం ఎస్ఎఫ్‌వో జి.శ్రీనివాస్, వరంగల్ ఎస్ఎఫ్‌వో పి.నర్సింగ్ రావు, మల్టీజోన్–2 జాయింట్ సెక్రటరీలుగా జీడిమెట్ల ఎస్ఎఫ్‌వో వి.సుభాశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హైదరాబాద్ ఏడీఎఫ్‌వో ఎస్.సురేశ్‌రెడ్డి, కోశాధికారిగా సివిల్ డిఫెన్స్ ఏడీఎఫ్‌వో వై.ప్రభాకర్‌రెడ్డిలు నియమితులయ్యారు. కొత్త కార్యవర్గాన్ని ఫైర్ డీజీపీ వై.నాగిరెడ్డి అభినందించారు.

అక్రమంగా మందులు నిల్వ చేస్తే ఐదేళ్ల జైలు

డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్ రెడ్డి హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు, అక్రమ నిల్వలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరుస దాడులతో అక్రమార్కులను అరెస్టు చేస్తున్నారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచినా, మందులు విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నేరానికి ఐదేళ్ల వరకు జైలుశిక్ష తప్పదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నట్టు వెల్లడించారు. డ్రగ్ లైసెన్స్‌లేని మందుల దుకాణాలకు మందులు సరఫరా చేసే హోల్‌సేలర్స్, డ్రగ్ డీలర్లపైనా డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మందులు సరఫరా చేసే ముందు ఆయా దుకాణాలకు డ్రగ్ లైసెన్స్ ఉందా లేదా అన్నది పరిశీలించుకోవాలని సూచించారు.

రూ.1.20 లక్షల విలువైన మందుల స్వాధీనం

భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గర్రెపల్లిలో కల్లూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహించడంతోపాటు మందులు విక్రయిస్తున్నట్టు డీసీఏ అధికారులు శనివారం గుర్తించారు. అతడి వద్ద నుంచి రూ.1.20 లక్షల విలువైన 59 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు.

సమస్యలపై స్త్రీనిధి ఉద్యోగుల వినతి

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారానికి ఆదివారం స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య ఉద్యోగులు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిశారు. సెర్ప్, మెప్మా సిబ్బంది మాదిరిగా స్త్రీనిధి ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్లకు వేతన సవరణ చేయాలని, కనీస వేతనం రూ.30 వేలు అమలు చేయాలని, ఆర్టీసీ మాదిరిగా స్త్రీ నిధిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.అరుణ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.జ్యోతి, కార్యదర్శి నాగపూర్ రామ్ మోడీ, కోశాధికారి డి.శివ, ఉపాధ్యక్షులు బి.నరేష్, కరుణాకర్, కిరణ్ ఉన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.